

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

21.09.2026

సోమవారం | అనంతపురం

సంపుటి : 11 | సంచిక: 130

పేజీలు : 08 | వెల: రూ.5

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# 1000కి పైగా డ్రోన్లతో కల్లోలం

- రష్యాపై ఉక్రెయిన్ అతిపెద్ద దాడి
- రష్యా పార్లమెంటరీ ఎన్నికల చివరి రోజున
- మాస్కో ప్రాంతంలో డ్రోన్ దాడి
- చమురు శుద్ధి కర్మాగారంలో అగ్నిప్రమాదం.
- దాడికి ఉక్రెయిన్ కారణమని రష్యా ఆరోపణలు



మాస్కో, సెప్టెంబర్ 20,
అనంతజనశక్తి న్యూస్

రష్యాపై ఉక్రెయిన్ అతిపెద్ద దాడికి పాల్పడింది. రష్యా పార్లమెంటరీ ఎన్నికల చివరి రోజున మాస్కోపై డ్రోన్ దాడి జరిగింది. 1000కి పైగా డ్రోన్లలో ఉక్రెయిన్ మాస్కోపై విరుచుకుపడింది. ఈ డ్రోన్ దాడిలో మాస్కోలోని చమురు శుద్ధి కర్మాగారం దెబ్బతింది. దాడి తర్వాత పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ దాడిలో ఇద్దరు మరణించినట్లు సమాచారం. శనివారం రాత్రి జరిగిన ఈ దాడి రష్యాను గణనీయంగా దెబ్బతీసిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమిర్ జెలెన్స్కీ అన్నారు. రష్యాకు చెందిన ఒక చమురు ఉత్పత్తి కేంద్రం, లాజిస్టిక్ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని దాడికి పాల్పడినట్లు చెప్పారు. ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న యుద్ధానికి ఈ లాజిస్టిక్ కేంద్రాలు కీలకంగా ఉన్నాయి. ఈ ఆపరేషన్‌లో ఎఫ్‌పీ 1, ఆర్ 100, మిచ్ 2000, పాలియానిట్సియా, వెండెట్టా, లియుటి, బార్స్, ఫ్లెమింగో, సిచెన్, పెలికాన్ వంటి వ్యవస్థలను ఉపయోగించారు. యుద్ధాన్ని ముగించేందుకు శాంతి మార్గాన్ని ఎంచుకోవాలని రష్యాకు జెలెన్స్కీ సూచించారు. ఇంధనం, ఆహార భద్రత రంగాలలో ఉద్రిక్తతల్ని తగ్గించే మార్గాలు ఉన్నాయని, దీనికి రాజకీయ సంకల్పం అవసరమని చెప్పారు. రష్యాలో పార్లమెంటరీ ఎన్నికల చివరి రోజు ఈ దాడి జరిగింది. ఈ ఎన్నికలు ఉక్రెయిన్‌పై పుతిన్ సాగిస్తున్న యుద్ధానికి ఓ పరీక్షగా నిలిచాయి. రష్యా ఈ దాడికి ఉక్రెయిన్‌ను నిందించింది. మరోవైపు ఉక్రెయిన్ రష్యా నిర్వహిస్తున్న ఎన్నికల్ని తిరస్కరించింది. ఎన్నికల సమయంలో ఆన్‌లైన్ ఓటింగ్‌పై సైబర్ దాడి ప్రయత్నం జరిగినట్లు రష్యా ఎన్నికల అధికారులు తెలిపారు.

# సూపర్ ఎల్ నినోను కలిసి ఎదుర్కొందాం

- విపత్కర పరిస్థితిని సవాల్‌గా తీసుకుందాం
- సీఎం చంద్రబాబు నాయుడు పిలుపు
- ప్రభుత్వం ముందస్తు కార్యాచరణకు సిద్ధమైంది
- ఎల్‌నినోను విపత్తుగా కాకుండా సవాల్‌గా చూడాలి
- అధికార యంత్రాంగానికి సీఎం దిశానిర్దేశం
- నిత్యావసరాల ధరలు అదుపుతప్పకుండా..
- ముందస్తు చర్యలు చేపట్టాలని సూచన
- బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు ధరలను నియంత్రించాలి



బెంగళూరులో ది ఎర్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో చంద్రబాబు నాయుడు

7లో..

అమరావతి, సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్

ఎల్‌నినో ప్రభావంతో రైతులకు నష్టం రాకుండా, ధరలు అదుపుతప్పకుండా ప్రభుత్వం ముందస్తు కార్యాచరణకు సిద్ధమైంది. ఎల్‌నినోను విపత్తుగా కాకుండా సవాల్‌గా ఎదుర్కొనేలా ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. రైతులను కాపాడటంతో పాటు నిత్యావసరాల ధరలు అదుపుతప్పకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు ధరలను నియంత్రించాలని సూచించారు.

## ప్రకృతితో మమేకమైన అభివృద్ధికే భవిష్యత్తు

- ప్రకృతితో మమేకమైన అభివృద్ధికే భవిష్యత్తు
- గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు పడాలి
- ప్రతి భవనం వనరులను సృష్టించేలా ఉండాలి
- అభివృద్ధి ఆగకూడదు... పర్యావరణానికి గాయం చేయకూడదు
- బెంగళూరులో ది ఎర్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

6లో..

## 'ఇది నీచమైన చర్య'

- రాహుల్ గాంధీపై బీజేపీ నేతల ఫైర్
- 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో
- రాహుల్ కి సంబంధించిన వీడియో వివాదాస్పదం

2లో..



## వచ్చే రోజుల్లో దేశంపై తీవ్ర ప్రభావం

- ఎల్ నినోపై భారత వాతావరణ శాస్త్రవేత్తల ఆందోళన
- వేడి, వర్షా భావం, నీటి కొరత వంటి పరిస్థితులు
- వ్యవసాయం, అడవులు, పశుపోషణపై తీవ్ర ప్రభావం!

హైదరాబాద్, సెప్టెంబర్ 20,
అనంతజనశక్తి న్యూస్

రాబోయే కొన్ని రోజుల్లో భారతదేశంలో వాతావరణ పరిస్థితులు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 202627 ఎల్‌నినో సాధారణం కన్నా శక్తివంతంగా ఉండొచ్చని 180 మందికి పైగా పర్యావరణ, వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇది దేశంలోని అడవులు, నదులు, సముద్రాలు, పర్వతాలు, వన్యప్రాణులపై తీవ్రమైన ప్రభావం చూపొచ్చని అంటున్నారు.

2లో..

## వినాయక నిమజ్జనాల్లో డీజే సౌండ్స్‌కు నో పర్మిషన్

- 2 రోజుల్లో గుండెపోటుతో ఐదుగురు మృతి
- గణేష్ నిమజ్జనాల్లో డీజే మోత
- తెలుగు రాష్ట్రాల్లో విషాద ఛాయలు
- జాగ్రత్తలు తీసుకోవాలి: రఘురామకృష్ణరాజు

7లో..

## విద్యా వ్యవస్థ రాజకీయాలకు దూరంగా ఉండాలి

- మంత్రి నారా లోకేష్ వెల్లడి
- కాకినాడ జిల్లాలో పర్యటించిన మంత్రి
- విద్యతో సమాజంలో మార్పు తీసుకురావొచ్చు
- విద్యా వ్యవస్థ రాజకీయాలకు దూరంగా ఉండాలి

2లో..



## రాష్ట్రంలో రాక్షస రాజ్యం వచ్చింది

- రైతు రాజ్యం పోయింది
- మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం
- రైతుల కష్టాలకు కాంగ్రెస్‌దే బాధ్యత అంటూ ఆరోపణలు
- విద్యుత్ కోతలపై కోమటిరెడ్డికి హరీశ్ సవాల్
- భూకబ్జాలు, కమీషన్లపై సంచలన ఆరోపణలు

2లో..



హైదరాబాద్, సెప్టెంబర్ 20,
అనంత జనశక్తి న్యూస్

యాదాద్రి భువనగిరి జిల్లా పర్యటనలో భాగంగా బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కేసీఆర్ హయాంలో ఉన్న రైతు రాజ్యం పోయి, ప్రస్తుతం రాక్షస రాజ్యం వచ్చిందని ఆయన మండిపడ్డారు.

## 10 మంది విద్యార్థినుల జడల కత్తిరించారు



7లో..

## భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

- జయలక్ష్మిని సీఐడీ సైబర్ క్రైమ్స్ ఐజీగా
- బి. రాజకుమారిని రైల్వే ఐజీగా బదిలీ
- విశాల్ గున్నికి ట్రైనింగ్ డీఐజీగా పోస్టింగ్

7లో..

అమరావతి, సెప్టెంబర్ 20,
అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ లో పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ తక్షణమే అమల్లోకి వచ్చేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ బదిలీలకు సంబంధించి అధికారులు, వారి కొత్త పోస్టింగ్ వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్పీఎఫ్ డీజీగా పనిచేస్తున్న సీహెచ్ త్రివిక్రమ వర్మను డైరెక్టర్ ఎఫ్‌ఎస్‌ఎల్‌గా ప్రభుత్వం నియమించింది.



## మేము అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 20,
అనంతజనశక్తి న్యూస్

కోస్గి వేదికగా నిర్వహించిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాంచజన్య సంకల్ప సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్ నియోజకవర్గంలో ఈ సభ నిర్వహించడం కూడా రాజకీయంగా ఆసక్తిని రేకెత్తించింది. కోస్గి జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన సభలో కవిత తన రాజకీయ ప్రయాణం, బహుజన రాజకీయాలపై మాట్లాడటంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కోస్గి ఎన్నికల ప్రచారానికి సంబంధించిన పాత జ్ఞాపకాలను ఈ సభలో కవిత ప్రస్తావించారు.

7లో..





## రాష్ట్రంలో రాక్షస రాజ్యం వచ్చింది

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం పూర్తిగా మిల్లర్లు, దళారుల చేతిలో కీలుబొమ్మగా మారిందని, కాంగ్రెస్ పాలనా వైఫల్యం , నిర్లక్ష్యం వల్లే ఎక్కడికక్కడ పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో "ఆంధ్రప్రదేశ్ కు నీళ్లు.. తెలంగాణకు కన్నీళ్లు" అనే దుస్థితి దాపురించిందని విమర్శించారు.

**విద్యుత్ కోతలతో ఎండుతున్న పంటలు.. మంత్రి కోమటిరెడ్డికి సవాల్**

బొగ్గు కొరత ఉందనే నెపంతో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తిని ప్రభుత్వం కావాలనే నిలిపివేసిందని హరీష్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా విద్యుత్ కోతలు పెరిగిపోయి రైతులకు తీవ్ర శాపంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ప్రతిపక్ష ఎంపీగా ఉన్న సమయంలో విద్యుత్ సబ్‌స్టేషన్లకు వెళ్లి లాగ్ బుక్‌లను తనిఖీ చేసిన ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి, ఇప్పుడు సొంత ప్రభుత్వ హయాంలో జరుగుతున్న కోతలపై లాగ్ బుక్‌లను చూసే దమ్ము, ధైర్యం ఉన్నాయా అని హరీష్ రావు నేరుగా సవాల్ విసిరారు.

**భూకబ్జాలు, కమీషన్ల పాలన.. ఎంపీలకు హితవు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు రాష్ట్రంలో యథేచ్ఛగా భూకబ్జాలకు పాల్పడుతున్నారని హరీష్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ కబ్జాలను తాము నిలదీస్తున్నందుకే తమపై తప్పుడు ఆరోపణలు చేస్తూ విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. రాజ్యంలో భూమి క్లియరెన్స్ కావాలంటే 30 శాతం, కాంట్రాక్ట్ బిల్లులు పాస్ కావాలంటే 15 శాతం కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఎంపీలు పొలాల్లో తిరుగుతూ డ్రామాలు చేయడం మాని, రీజినల్ రింగ్ రోడ్డు , మెట్రో రెండో దశ నిధులు, కృష్ణా నదిలో తెలంగాణ నీటి వాటా సాధన కోసం ఢిల్లీ వేదికగా పోరాటాలు చేయాలని హితవు పలికారు.

**ఆరు గ్యారంటీలపై నిలదీస్తాం.. కేసీఆర్ కంటే గొప్పగా పనిచేయాలి**

తమకు ఉద్యమాలు, పోరాటాలు, జైలు కేసులు కొత్తేమీ కాదని, రేవంత్ రెడ్డి ఎన్ని బెదిరింపులకు దిగినా భయపడే ప్రసక్తే లేదని హరీష్ రావు తేల్చిచెప్పారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని, నిరంతరం నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. నాయకులు కేసీఆర్ చావును కోరుకోవడం మాని, చేతనైతే కేసీఆర్ సాధించిన అభివృద్ధి కంటే గొప్పగా పనిచేసి చూపించాలని హరీష్ రావు సవాలు విసిరారు.

## సచివాలయ ఉద్యోగులకు గుడ్‌న్యూస్

### 6 ఏళ్ల సర్వీస్ పూర్తి చేస్తే.. 11 పీఆర్సీ ప్రయోజనాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లోని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆరు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన అర్హులైన ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (ఏఏఎస్) కింద ప్రత్యేక గ్రేడ్ పోస్టు స్కేల్ వర్తింపజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు సంబంధిత ఉత్తర్వులు జారీ అయ్యాయి. 11వ వేతన సవరణ సంఘం (11వ పీఆర్సీ)లో పేర్కొన్న నిబంధనలు, విధివిధానాల ప్రకారం ఈ ప్రయోజనాన్ని అమలు చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఒకే కేడర్‌లో 6 ఏళ్ల సర్వీసును పూర్తి చేసినట్లయితే.. నిర్ణీత నిబంధనల ప్రకారం వారికి స్పెషల్ గ్రేడ్ పోస్టు స్కేల్ మంజూరు చేయనున్నారు. దీనివల్ల అర్హత పొందిన ఉద్యోగుల పే స్కేల్‌లో మార్పు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే ఇది సాధారణ పదోన్నతి కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఉద్యోగి అదే పోస్టులో కొనసాగుతున్నప్పటికీ.. నిర్దిష్ట కాలం సర్వీసు పూర్తి అయిన తర్వాత ఆర్థిక ప్రయోజనం కల్పించే విధానమే ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ అని పేర్కొన్నారు.

తాజా నిర్ణయంతో ముఖ్యంగా 2019, 2020లో నియమితులైన స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ సిబ్బందికి ప్రయోజనం కలగనుంది. అప్పుడు ఉద్యోగంలో చేరిన ఉద్యోగులు ఆరు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకోనున్నారు. అయితే కేవలం నియామక సంవత్సరం ఆధారంగా కాకుండా.. ప్రతి ఉద్యోగి సర్వీస్ రికార్డు, అర్హతలు, వర్తించే నిబంధనలను పరిశీలించిన తర్వాతే స్పెషల్ గ్రేడ్ స్కేల్ మంజూరు చేయనున్నారు. ఈ మేరకు సంబంధిత సిబ్బంది సర్వీసు వివరాలను పరిశీలించి, అర్హత ఉన్న ఉద్యోగులను గుర్తించి తదుపరి ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది.

ఒకే పోస్టులో ఎక్కువకాలం పనిచేసే ఉద్యోగులకు పదోన్నతి అవకాశాలు అందుబాటులో లేకపోయినా ఆర్థికంగా కొంత పురోగతి కల్పించేందుకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (ఏఏఎస్) అమలు చేస్తారు. ఈ విధానంలో నిర్ణీత సంవత్సరాల సర్వీసు పూర్తయిన తర్వాత ఉద్యోగులకు వరుసగా ఆర్థిక ప్రయోజనాలు కల్పించే అవకాశం ఉంటుంది. సాధారణంగా ఆరు ఏళ్ల సర్వీసు పూర్తయిన తర్వాత స్పెషల్ గ్రేడ్ ప్రయోజనం, అనంతరం నిబంధనలకు అనుగుణంగా 12, 18, 24 సంవత్సరాల సర్వీసు దశల్లో తదుపరి ప్రయోజనాలు కల్పించే విధానం ఉంది. 11వ పీఆర్సీ నిబంధనల ప్రకారం ఈ విధానాన్ని వర్తింపజేయనున్నారు.

ఏఏఎస్ కింద లభించే స్పెషల్ గ్రేడ్ పోస్టు స్కేల్‌ను ఉద్యోగి సాధారణ ప్రమోషన్‌గా భావించకూడదని అధికారులు చెబుతున్నారు. ఉద్యోగి హోదా, కేడర్‌లో మార్పు లేకుండానే నిర్దిష్ట సర్వీసు కాలాన్ని పూర్తి చేసినందుకు లభించే ఆర్థిక ప్రయోజనంగా దీనిని పరిగణిస్తారని పేర్కొంటున్నారు. సచివాలయ ఉద్యోగులకు పరిమితమైన ప్రమోషన్ అవకాశాల నేపథ్యంలో ఈ విధానం ఆర్థిక పురోగతికి ఉపయోగపడుతుందని ఉద్యోగ వర్గాలు భావిస్తున్నాయి. తాజాగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతో ఆరు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన అర్హులైన సిబ్బందికి ఈ ప్రయోజనం పొందేందుకు మార్గం సుగమమైంది. ఇక సంబంధిత శాఖలు ఉద్యోగుల సర్వీస్ రికార్డులను పరిశీలించి..నిబంధనల ప్రకారం అర్హత ఉన్న వారికి స్పెషల్ గ్రేడ్ పోస్టు స్కేల్ మంజూరు చేసే ప్రక్రియను చేపట్టనున్నాయి. దీంతో 2019, 2020 బ్యాచ్‌లకు చెందిన అర్హులైన సచివాలయ ఉద్యోగుల్లో ఈ ఉత్తర్వులపై ఆసక్తి నెలకొంది.

## సీసీటీవీ ఫుటేజ్ పరిశీలిస్తే మరిన్ని వివరాలు వెలుగులోకి

**- మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు**

**- విద్యార్థుల జుట్టు కత్తిరింపు వ్యవహారం**

భీమిలిలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం వసతి గృహంలో విద్యార్థుల జుట్టు కత్తిరించిన ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరగాలని స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ ఘటనపై ఆయన స్పందించారు. ఆదివారం విశాఖపట్నంలో గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ ఘటనపై ఇప్పటికే విద్యార్థులతో పోలీసులు మాట్లాడి వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. బయట నుంచి ఎవరైనా వచ్చి ఈ పని చేసే అవకాశం లేదని అన్నారు. వసతి గృహంలోని సీసీటీవీ ఫుటేజ్ పరిశీలిస్తే మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

భీమిలి నీటి సమస్యపై కూడా ఆయన మాట్లాడారు. నగరంలో నెలకొన్న నీటి సమస్యను ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. హెలిప్యాడ్ వద్దే అధికారులకు, ప్రజాప్రతినిధులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. దీంతో భీమిలికి నీటి సరఫరా చేసినట్లు వివరించారు. అవసరమైన ప్రాంతాల్లో బల్క్ వాటర్ అందించే చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. నీటి సమస్య పరిష్కారానికి చర్యలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు.

**అలాగే పట్టాల పంపిణీపై మాజీ మంత్రి గంటా స్పందించారు. 2014 -19 మధ్య 60 వేల పట్టాలు ఇచ్చామని తెలిపారు. ప్రస్తుతం మరో 20 వేల పట్టాలు అందించామని వెల్లడించారు. దాదాపు 30 వేల కుటుంబాలకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. బీమునిపట్నంలో కేజీబీవీలో 38 మంది విద్యార్థులు 9వ తరగతి చదువుతున్నారు. ఆ విద్యార్థినులకు రెండు గదులు కేటాయించారు. సెప్టెంబర్ 16వ తేదీ రాత్రి 12 గంటల తర్వాత విద్యార్థినులు నిద్రపోయారు. మరుసటి రోజు ఉదయం నిద్ర నుంచి లేచిన అనంతరం 20 మంది విద్యార్థులు నిద్రించిన గదిలో ఆరుగురికి,18 మంది నిద్రించిన గదిలో నలుగురు విద్యార్థులకు జడలు కత్తించారు. ఈ విషయాన్ని గుర్తించిన సదరు విద్యార్థులు.. వెంటనే హాస్టల్ సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.**

# యూపీఐ వ్యాపార లావాదేవీలపై ఎండీఆర్ మార్గదర్శకాలు

### తెలుసుకోవాల్సిన 15 ముఖ్యాంశాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**

0.4 శాతం ఎండీఆర్ (ఎండీఆర్ ) ఛార్జీ అనేది ₹2,000 కంటే ఎక్కువ ఉన్న కొన్ని నిర్దిష్ట వ్యాపార లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుంది. పీటూపీ (పీ2పీ) విధానంలో ఒకరి నుంచి మరొకరికి జరిగే సాధారణ డబ్బు బదిలీలు పూర్తిగా ఉచితం.

ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకారం.. ₹2,000 వరకు ఉండే చెల్లింపులు, జీరో ఎండీఆర్ కింద ఉండే లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయి. దీనివల్ల దాదాపు 96 శాతం వ్యాపార లావాదేవీల (పీ2ఎం) పై ఎలాంటి ప్రభావం ఉండదు.

ఎండీఆర్ అనేది వ్యాపారుల చెల్లింపుల వ్యవస్థకు సంబంధించిన రుసుము. దీనిని నేరుగా సాధారణ యూపీఐ వినియోగదారులపై బాదుడుగా వేయడం లేదు.

పీటూపీ ద్వారా ఒక వ్యక్తికి ₹5,000, ₹50,000 లేదా అంతకంటే ఎక్కువ మొత్తం పంపినా ఈ ఎండీఆర్ వర్తించదు.




**₹2,000 లేదా అంతకంటే తక్కువ ఉండే వ్యాపార లావాదేవీలు ఎండీఆర్ పరిధిలోకిరావు. ₹2,000 దాటిన నిర్దిష్ట లావాదేవీలకు మాత్రమే ఇది వర్తిస్తుంది. ఉదాహరణకు.. ₹5,000 పై 0.4 శాతం అంటే ₹20, ₹10,000 పై ₹40 ఎండీఆర్ పడుతుంది. అయితే లావాదేవీ మొత్తం ₹75,000 దాటితే మాత్రం ఎండీఆర్ గరిష్టంగా ₹300 మాత్రమే ఉంటుంది.**

**సాధారణంగా సగటు పీటూఎమ్ లావాదేవీ విలువ ₹577 మాత్రమే ఉంటుంది. కాబట్టి దాదాపు వ్యాపార లావాదేవీలన్నీ అనుకున్న ₹2,000 పరిమితి కంటే చాలా తక్కువగానే ఉంటాయి.**

**0.4 శాతం లెక్కన చూస్తే.. ₹3,000 వ్యాపార చెల్లింపుకు ₹12, ₹5,000 చెల్లింపుకు ₹20, ₹10,000 లావాదేవీకి ₹40 ఎండీఆర్ అవుతుంది.**

**నిర్దిష్ట పీటూపీఎమ్ (పీ2పీఎం) కేటగిరీ కింద నెలకు ₹1 లక్ష వరకు యూపీఐ క్యూఆర్ (క్యూఆర్) ద్వారా పొందే చిన్న వ్యాపారులకు జీరో ఎండీఆర్ వర్తిస్తుంది. వారిపై ఎలాంటి ఛార్జీలు ఉండవు.**

**రైల్వేలు, టెలికాం, ఇన్సూరెన్స్, ఫ్యూయల్, వ్యవసాయ రంగానికి చెందిన చెల్లింపుల్లో ₹2,000 దాటిన లావాదేవీలపై 0.4 శాతానికి బదులుగా కేవలం ₹5 ఫ్లాట్ ఎండీఆర్ మాత్రమే వర్తిస్తుంది.**

**మ్యూచువల్ ఫండ్స్, సెక్యూరిటీస్, స్టాక్ బ్రోకర్లు, డీలర్లకు సంబంధించిన నిర్దిష్ట చెల్లింపులపై 0.02 శాతం (గరిష్టంగా ₹300 వరకు) ఎండీఆర్ వర్తిస్తుంది.**

**ఎండీఆర్ అనేది ప్రభుత్వం లేదా ఎన్‌పీసీఐ (ఎన్‌పీసీఐ) వసూలు చేసే పన్ను కాదు. ఇది చెల్లింపుల వ్యవస్థలో భాగస్వాములుగా ఉన్న సంస్థల మధ్య పంపిణీ అవుతుంది.**

**ఎండీఆర్ అనేది వ్యాపారికి వచ్చే మొత్తం నుంచి మినహాయించుకుంటారు. కస్టమర్ నుంచి దీనిని విడిగా వసూలు చేయరు.**

**యూపీఐ సాంకేతిక వ్యవస్థ సజావుగా నడవడానికి, భవిష్యత్తులో దాని సేవలను మరింత విస్తరించడానికి ఈ విధానం తోడ్పడుతుంది.**

**జీరో-ఎండీఆర్ డిజిటల్ చెల్లింపులను కొనసాగించడానికి ప్రభుత్వం ఆర్థికంగా మద్దతు ఇస్తోంది. అందులో భాగంగానే చిన్న విలువ గల యూపీఐ పీటూఎమ్ లావాదేవీల కోసం మార్చి 2025లో ప్రభుత్వం ₹1,500 కోట్ల ప్రోత్సాహక పథకాన్ని ఆమోదించింది.**

**సాధారణ యూపీఐ వినియోగంపై పూర్తిస్థాయి రుసుము వేయడానికి, దీనికి చాలా తేడా ఉంది. రోజువారీ తక్కువ విలువ గల చెల్లింపులు, వ్యక్తిగత బదిలీలు ఈ ఎండీఆర్ పరిధిలోకి రావు.**

# 'ఇది నీచమైన చర్య'

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**

కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై బీజేపీ వర్గాలు మండిపడుతున్నాయి. 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమానికి సంబంధించిన వీడియో బీజేపీ నేతల ఆగ్రహానికి దారి తీసింది. ఇండోర్‌లో శనివారం జరిగిన ఆ కార్యక్రమంలో ఓ విద్యార్థి రాహుల్ గాంధీతో వేదిక పంచుకుంటూ.. నరేంద్ర మోదీని అనుకరించారు. అనంతరం మోదీని విమర్శిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఇందులో వీరి వ్యాఖ్యలు, హావభావాలు ప్రధానిని కించపరిచేలా ఉన్నాయని బీజేపీ నాయకులు భావిస్తున్నారు. రాహుల్‌ను



తీవ్రంగా విమర్శిస్తున్నారు.

రాహుల్ గాంధీ పరిధి దాటి మోదీ వ్యక్తిగత జీవితంపై కామెంట్లు చేశారని బీజేపీ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రధానిపై, ఆయన తల్లిపై అసభ్య వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. దీనిపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కూడా స్పందించారు. ఈ మొత్తం వ్యవహారాన్ని ఆయన 'నీచమైన చర్య'గా పేర్కొన్నారు. ప్రధాని మోదీని, ఆయన తల్లిని అవమానించడానికే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని ఆరోపించారు. పెద్దలు, తల్లిదండ్రులపై ద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం నిజమైన భారతీయులకు రాదని ఫైరయ్యారు. ప్రత్యర్థులను ఎదుర్కొనేందుకు వ్యక్తిగత దాడి మార్గం కాదని ప్రహ్లాద్ జోషి ధ్వజమెత్తారు.

ఈ వివాదంపై ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి స్పందిస్తూ.. రాహుల్ గాంధీపై విరుచుకుపడ్డారు. ప్రధాని తల్లిపై ద్వేషపూరిత కామెంట్లు చేయడం క్షమించరాని తప్పని విమర్శించారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ వివాదంపై తీవ్రంగా స్పందించారు.

# వచ్చే రోజుల్లో దేశంపై తీవ్ర ప్రభావం

(మొదటి పేజీ తరువాయి)

నష్టం జరిగిన తర్వాత దానిని అధ్యయనం చేయడానికి బదులు, ముందుగానే పర్యవేక్షించేందుకు వీలుగా, ప్రభుత్వాలు, పరిశోధనా సంస్థలు వెంటనే సిద్ధం కావాలని సూచించారు.

''సూపర్ ఎల్ నినో: 2026/2''పై ఒక పరిశోధన జెనోడోలో ప్రచురితమైంది. ఎల్‌నినో అనేది సహజ వాతావరణ దృగ్విషయం. పసిఫిక్ మహాసముద్రంలో భూమధ్యరేఖకు సమీపంలోని ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా పెరుగుతాయి. దీని వల్ల రుతుపవన వ్యవస్థ దెబ్బతింటుది. ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షపాతంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ప్రపంచవాతావరణ సంస్థ నివేదిక ప్రకారం.. ఎల్ నినో ఇప్పటికే బలపడుతున్నట్లు చెప్పింది. 2027 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం దాదాపుగా 100 శాతం ఉంటుందని పేర్కొంది.




2026 నవంబర్ నుంచి వచ్చే ఏడాది వరకు భారత్‌లోని అనేక ప్రాంతాల్లో సాధారణం కన్నా వేడి, పొడి వాతావరణం ఉండొచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. తగ్గిన వర్షపాత నీటి కొరతను పెంచి వ్యవసాయం, అడవులు, పశుపోషణపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇప్పటికే నీటి కొరత ఎదుర్కొంటున్న ప్రాంతాలపై వేడి, కరువు ప్రభావం ఉంటుందని అంచనా. ఎడారి ప్రాంతాలు, ఎత్తైన పర్వత ప్రాంతాల్లో నివసించే మొక్కలు, జంతువుల మనుగడ కష్టంగా మారొచ్చు. నీటి వనరులపై ఒత్తిడి పడితే అది వ్యవసాయంపై, గ్రామీణ వ్యవస్థపై ఒత్తిడి పెంచొచ్చు. నగరాల్లో వేడి తీవ్రం కావచ్చు. కాంక్రీట్, రోడ్ల కారణంగా పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాల కన్నా అధిక వేడి ఉండే అవకాశం ఉంది. అడవుల్లో కార్చిచ్చు వృక్ష, వన్యప్రాణాలకు గణనీయమైన నష్టాన్ని కలిగించొచ్చని అంచనా. వాతావరణ మార్పులు జంతువుల ఆహారం, సంతానోత్పత్తిని దెబ్బతీసే అవకాశాలు ఉన్నాయి.

# విద్యా వ్యవస్థ రాజకీయాలకు దూరంగా ఉండాలి

**అమరావతి, సెప్టెంబర్ 20, అనంతజనశక్తి న్యూస్**

విద్యార్థుల భవిష్యత్, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, పిల్లల మానసిక ధైర్యంపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. కాకినాడ జిల్లాలో నిర్వహించిన 'భారతీయం' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. విద్యతో సమాజంలో మార్పు సాధ్యమని, వైఫల్యాలను చూసి కుంగిపోకుండా వాటినే విజయానికి బలంగా మార్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కాకినాడ జిల్లాలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్ 'భారతీయం' కార్యక్రమంలో పాల్గొని విద్యా వ్యవస్థ, ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల భవిష్యత్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. విద్య ద్వారా సమాజంలో గణనీయమైన మార్పు తీసుకురావచ్చని పేర్కొన్న ఆయన.. విద్యా వ్యవస్థ రాజకీయాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. విద్య, ప్రభుత్వ పాఠశాలలు అంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎంతో ఇష్టమని తెలిపారు.

ఇదే సందర్భంలో రంపచోడవరం బాలిక ఆత్మహత్య ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని మంత్రి నారా లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు.. పిల్లలు ఎలాంటి పరిస్థితుల్లోనైనా క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలు ఎంత క్లిష్టంగా అనిపించినా వాటిని పరిష్కరించుకునే మార్గాలు ఉంటాయని, ఇబ్బందులు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలతో మాట్లాడాలని చెప్పారు. పిల్లలు క్షణికావేశంలో తీసుకునే కొన్ని నిర్ణయాలు వారి జీవితాలను మాత్రమే కాకుండా తల్లిదండ్రులకు జీవితాంతం కడుపుకోత మిగిల్చే పరిస్థితి తీసుకొస్తాయని లోకేశ్ అన్నారు. విద్యార్థుల్లో మానసిక ధైర్యం, సమస్యలను ఎదుర్కొనే సామర్థ్యం పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్య అనేది కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా మంచి సమాజాన్ని నిర్మించే శక్తిగా మారాలని, అందుకోసం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేయాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు.

ఏపీ విద్యావ్యవస్థను నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతాం

ప్రభుత్వ కృషికి నైతిక విలువలు తోడైతే దేశంలోనే నంబర్ వన్‌గా ఏపీ విద్యావ్యవస్థ మారుతుందని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. క్లాస్ రూం నుంచే సమాజంలో మార్పు సాధ్యమని.. అందుకే విద్యాశాఖ ఎంచుకున్నానని పేర్కొన్నారు. కాకినాడలో మంత్రి నారా లోకేశ్ ఆదివారం పర్యటించారు. చాగంటి కోటేశ్వరరావు గోశాల ప్రాంగణంలో విద్యార్థులతో వ్యక్తిత్వ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లోకేశ్ పాల్గొని ప్రసంగించారు.



**ఈ ఏడాది 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని లోకేశ్ ప్రస్తావించారు. ఇంటర్‌లో కూడా 10 వేల మంది విద్యార్థుల అడ్మిషన్స్ పెరిగాయని తెలిపారు. చాగంటి ద్వారా విలువల విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. రాజకీయాలకు దూరంగా విద్యావ్యవస్థ ఉండాలని ఆకాంక్షించారు. యూనిఫాం, బుక్స్, బ్యాగ్స్, బెల్ట్స్ , షూస్ ఎక్కడా నో పొలిటికల్ పార్టీ కలర్స్ ఉండకూడదనే ఎక్కడా కూడా ముఖ్యమంత్రి, తన ఫొటోలు ముద్రించలేదని స్పష్టం చేశారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో తాను రాజకీయాల్లోకి వచ్చానని లోకేశ్ ఉద్ఘాటించారు. 2019లో పోటీ చేసి ఓడిపోయానని.. తొలిసారి ఫెయిల్ అయినా.. నిరాశకు లోను కాలేదని చెప్పారు. చాలామంది మంగళగిరి టీడీపీ సీటు తనకు సరికాదని... టీడీపీకి కంచుకోట లాంటి సీట్లలో పోటీ చేయాలని సలహా ఇచ్చారని అన్నారు. తాను పడిపోయిన చోటే నిలబడతానని ఛాలెంజ్ చేసి చూపించానని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.**

# పొదుపుతోపాటు సామాజిక భద్రత




తప్పనిసరి ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్)వేతన పరిమితిని రూ.15,000 నుంచి రూ.25,000కు పెంచడాన్ని ఈపీఎఫ్‌వో తెలంగాణ జోనల్ కార్యాలయం, రాష్ట్రంలోని ప్రాంతీయ కార్యాలయాలు స్వాగతించాయి. ఈనెల 17 నుంచి అమల్లోకి వచ్చిన ఈ వేతన పరిమితి పెంపుదల చట్టబద్ధ సామాజిక భద్రతా స్వరూపంలో ఒక ముఖ్యమైన విస్తరణతోపాటు తప్పనిసరి ఈపీఎఫ్ఓ పరిధిలోకి దేశవ్యాప్తంగా మరో 51 లక్షల మందికిపైగా ఉద్యోగులను తీసుకువచ్చే గొప్ప మార్పని తెలంగాణ జోనల్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొన్నది.

తప్పనిసరి ఈపీఎఫ్‌వో పరిమితి సవరణ చివరిసారి 2014 సెప్టెంబర్‌లో జరిగిందని, అప్పుడు పరిమితిని రూ.15,000కు పెంచడం జరిగిందని ఈపీఎఫ్‌వో పేర్కొన్నది. ఆ తర్వాత వేతనాలు, ఆదాయాలు, కనీస వేతనాలు, జీవన వ్యయం గణనీయంగా పెరిగాయని, అదే సమయంలో వ్యవస్థీకృత రంగంలో ఉద్యోగుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని తెలిపింది. వేతన పరిమితి పెంపుదలతో తప్పనిసరి ఈపీఎఫ్ పరిధిలోకి రూ.15,000రూ.25,000 వేతనాలు పొందుతున్న ఉద్యోగులు కొత్తగా వస్తారని, ఇది వారికి మరింత ఎక్కువ సామాజిక భద్రతను కల్పిస్తుందని ఈపీఎఫ్‌వో తెలిపింది.

ప్రావిడెంట్ ఫండ్ ఖాతా అంటే కేవలం పొదుపు ఖాతా మాత్రమే కాదని, ఈపీఎఫ్‌వో నిర్వహించే మూడు ప్రధాన పథకాల ప్రయోజనాలు కూడా పొందవచ్చని తెలిపింది. దీర్ఘకాలిక రిటైర్‌మెంట్ పొదుపును సమకూర్చే ఉద్యోగుల భవిష్య నిధి(ఈపీఎఫ్), పింఛను సంబంధించిన సామాజిక భద్రతా రక్షణను కల్పించే ఉద్యోగుల పింఛను పథకం(ఈపీఎస్), ఉపాధితో ముడిపడిన బీమా రక్షణ కల్పించే ఉద్యోగుల డిపాజిట్ లింక్డ్ బీమా పథకం(ఈడీఎల్ఐ) వంటి ప్రయోజనాలకు కొత్తగా ఈపీఎఫ్ఓ పరిధిలోకి వచ్చే సభ్యులు అర్హులవుతారని ఈపీఎఫ్ఓ పేర్కొన్నది..

అందువల్ల వేతన పరిమితి పెంపు ఉద్యోగికి చెందిన శాలరీ స్లిప్పులో నెలవారీ పీఎఫ్ చెల్లింపు మొత్తంగా మాత్రమే గాక రిటైర్‌మెంట్ పొదుపు, పింఛన్ రక్షణ, బీమా భద్రతను కల్పించే విస్తృత సామాజిక భద్రతా వ్యవస్థగా ప్రతిబింబిస్తుందని పేర్కొన్నది.. ప్రతినెలా తప్పనిసరిగా ఉద్యోగి జీతం నుంచి చెల్లించే పీఎఫ్ మొత్తంతోపాటు యాజమాన్యం చెల్లించే మొత్తం కూడా కలుపుకుంటే రిటైర్మెంట్ సమయానికి వడ్డీతో కలుపుకుని పెద్దమొత్తంగా చేతికి అందుతుందని ఈపీఎఫ్‌వో తెలిపింది. జీవితంలో ఎదురయ్యే అస్థిర పరిస్థితులకు సామాజిక భద్రతగా పీఎఫ్ చెల్లింపు నిలుస్తుందని పేర్కొన్నది. ఈ సందర్భంగా అర్హులైన ఉద్యోగులను ఈపీఎఫ్‌వో పరిధిలోకి తీసుకురావడంలో యాజమాన్యాలు సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

# దసరా పండుగకు దక్షణమధ్య రైల్వే ఏర్పాట్లు



దసరా పండుగ దగ్గరపడుతుండటంతో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణమధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రద్దీని నివారించేందుకు చర్లపల్లిశ్రీకాకుళం మధ్య 16 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. అదేవిధంగా చర్లపల్లినాగర్‌కోయిల్ మార్గంలోనూ 10 ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ రైళ్లను అందుబాటులోకి తీసుకురానున్నారు.

చర్లపల్లిశ్రీకాకుళం మధ్య నడిచే 16 ప్రత్యేక రైళ్ల షెడ్యూల్ ఈ విధంగా ఉన్నది. రైలు నంబర్ 07037 (చర్లపల్లిశ్రీకాకుళం) అక్టోబర్ 6, 13, 20, 27 తేదీలతోపాటు నవంబర్ 3, 10, 17, 24 తేదీల్లో నడవనుంది. తిరుగు ప్రయాణంలో రైలు నంబర్ 07038 (శ్రీకాకుళంచర్లపల్లి) అక్టోబర్ 7, 14, 21, 28 తేదీల్లో, నవంబర్ 4, 11, 18, 25 తేదీల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి స్టేషన్లలో ఆగుతాయి.

వీటితోపాటు చర్లపల్లినాగర్‌కోయిల్ మార్గంలోనూ 10 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. రైలు నంబర్ 07535 సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 23 వరకు ప్రతి శుక్రవారం, రైలు నంబర్ 07536 సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 25 వరకు ప్రతి ఆదివారం నడవనున్నాయి. పండుగ సీజన్‌లో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు ఈ ప్రత్యేక సర్వీసులను వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

# యూకేలో భారత సంతతి వ్యక్తిపై యెమెన్ జాతీయుడి దాడి..!





యూకే లో భారత సంతతికి చెందిన సిక్కు బస్సు డ్రైవర్ పై అమానుష దాడి జరిగింది. 33 ఏళ్ల యెమెన్ జాతీయుడు సిక్కు డ్రైవర్‌పై దాడిచేసి అతని బస్సును దొంగిలించాడు. ఆ బస్సును రాంగ్ రూట్‌లో నడుపుతూ బీభత్సం సృష్టించాడు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం టెల్ఫోర్డ్‌లోని మేడ్లీ ప్రాంతంలో ఉన్న కోర్ట్ స్ట్రీట్‌లో చోటుచేసుకుంది. ఈ దాడి మొత్తం కెమెరాలో రికార్డ్ అవ్వగా, ఆ వీడియో ఇప్పుడు కలకలం రేపుతోంది.

అలీ బల్హాద్ అనే యెమెన్ జాతీయుడు సిక్కు డ్రైవర్ గడ్డాన్ని పట్టుకుని లాగడం, అతని తలతో డ్రైవర్ తలను బలంగా బాదడం స్పష్టంగా కనిపిస్తోంది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఒక మహిళ.. "అతడిని ఎందుకు అలా కొడుతున్నావ్..?" అని అడగటం కూడా వీడియోలో వినిపించింది. బాధితుడైన డ్రైవర్.. "దయచేసి పోలీసులకు ఫోన్ చేయండి. ఈ వ్యక్తిని నా దగ్గరి నుంచి తీసుకుపోండి" అని ఆమెను వేడుకున్నాడు. అయినా ఆగని నిందితుడు, బస్సులోని కొన్ని భాగాలను ధ్వంసం చేశాడు.

బస్సు క్యాబిన్‌లోని ఒక లైట్‌ను బయటకు లాగి.. దానితో డ్రైవర్‌పై దాడి చేస్తానని బెదిరించాడు. బస్సును తనకు ఇచ్చేయాలని పదేపదే డిమాండ్ చేశాడు. దాదాపు నిమిషంపాటు ఈ దాడి కొనసాగింది. చివరకు నిందితుడు బల్హాద్ డ్రైవర్‌ను బలవంతంగా బస్సులో నుంచి కిందకు తోసేసి, స్టీరింగ్ ఎక్కాడు. ఆ తర్వాత బస్సును రాంగ్ రూట్‌లో పార్క్ వే నుంచి హై స్ట్రీట్ వైపు వేగంగా నడుపుతూ పలు వాహనాలను ఢీకొట్టాడు. ఆ సమయంలో ఒక మహిళ 'ఓ మై గాడ్' అని అరుస్తూ.. పక్కకు జరగమని ప్రజలను హెచ్చరిస్తూ బస్సు వెనుక పరిగెత్తడం వీడియోలో కనిపించింది.

ఈ ఘటనపై సాయంత్రం 6:37 గంటలకు పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న 10 నిమిషాల్లోనే వెస్ట్ మెర్సియా పోలీసులు, సాయుధ బలగాలతో సహా ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బస్సును నిలిపివేసి.. దోపిడీ, ప్రమాదకరంగా వాహనం నడపడం వంటి ఆరోపణలపై అలీ బల్హాద్‌ను అరెస్ట్ చేశారు. ఈ దాడిలో బస్సు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయని, వేరే ఎవరికీ ఎలాంటి హాని జరగలేదని పోలీసులు తెలిపారు.

సమాచారం అందిన వెంటనే మా అధికారులు స్పందించి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు దర్యాప్తు చేస్తున్నారు. డిటెక్టివ్ సార్జెంట్ తైగ్ లానీ మాట్లాడుతూ.. ఈ ఘటన స్థానికంగా ఆందోళన కలిగించిందని, అయితే పోలీసులు వేగంగా చర్యలు తీసుకున్నారని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఘటనను చూసిన వారు లేదా తమ వద్ద డాష్‌క్యామ్, సీసీటీవీ ఫుటేజ్ ఉన్నవారు దర్యాప్తుకు సహకరించాలని పోలీసులు కోరారు. గత వారం రోజులుగా టెల్ఫోర్డ్ ప్రాంతంలోనే ఉంటున్నట్లు భావిస్తున్న నిందితుడు అలీ బల్హాద్‌పై పోలీసులు తీవ్రమైన అభియోగాలు నమోదు చేశారు.

# 'వ్యవస్థ' గుప్పిట్లో దేశం: రాహుల్ గాంధీ

ఇండోర్: యావద్దేశం 'వ్యవస్థ' గుప్పిట్లో ఉందని, విద్యార్థులు ప్రశ్నించడాన్ని అది కోరుకోవట్లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశం నుంచి ద్వేషాన్ని తరిమిగొట్టగలిగేది 'అంధ భక్తులు' కాదని, ఆ పని కేవలం విద్యార్థులవల్లే అవుతుందని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ, భాజపాలకు మద్దతుగా నిలుస్తున్న వారిని అంధ భక్తులుగా ఆయన అభివర్ణించారు. శనివారం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో 'ఛాత్రోం కీ గూంజ్' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. రాహుల్ ప్రసంగిస్తూ.. ఏ దేశానికైనా యువతే భవితవ్యమని, వారు లేకుండా దేశాలేవీ బలపడలేవని చెప్పారు. ''అదానీ, అంబానీ, జై షా సహా వ్యవస్థ గురించి విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. కానీ వారిని 'అంధ భక్తులు' వ్యతిరేకిస్తున్నారు. కుతూహలం, ప్రేమ, అణకువ, సహనం, నిజాయతీ.. ఇవన్నీ విద్యార్థుల్లో ఉంటాయి. అంధ భక్తుల్లో ఇవేవీ ఉండవుగానీ ద్వేషాన్ని చిమ్ముతుంటారు. దేశంలో 10 లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. లక్ష పాఠశాలలు మూతపడ్డాయి. యూపీఏ సర్కారు ఉన్నప్పుడు విద్య కోసం 4.6% బడ్జెట్‌ను కేటాయిస్తే ఇప్పుడు అది 2.6 శాతానికి పడిపోయింది'' అని రాహుల్ విమర్శించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్ భాగవత్, పారిశ్రామికవేత్తలు ముకేశ్ అంబానీ, గౌతం అదానీలు వ్యవస్థను నాశనం చేస్తున్నారని ఆరోపించారు.



# కాలుష్య కారకులే నిందలేయడమా?

దిల్లీ: భారత్‌తో పోల్చి చూసినప్పుడు.. అభివృద్ధి చెందిన దేశాలు వెలువరించే తలసరి కర్బన ఉద్గారాలు 6 రెట్లు ఎక్కువని, ప్రపంచ వేదికలపైనా దీనిని గట్టిగా చెబుతున్నామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అయినప్పటికీ వాతావరణ మార్పులకు వర్ధమాన దేశాలదే బాధ్యతన్నట్లు నిందిస్తుండటం అసమంజసమని అభిప్రాయపడ్డారు. పర్యావరణం, వాతావరణ మార్పులపై రెండ్రోజులపాటు జరిగే అంతర్జాతీయ సదస్సును శనివారం దిల్లీలో ఆయన ప్రారంభించారు. ''ప్రపంచంలో తలసరి కర్బన ఉద్గారాల్లో భారత్ వాటా చాలా స్వల్పమనేది చారిత్రక సత్యం. పారిస్ ఒప్పందం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువుకంటే ముందే చేరుకున్న జీ 20 దేశం భారత్ మాత్రమే'' అని మోదీ వివరించారు.

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ.. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ అనేవి కలిసి సామరస్యంగా ఎలా ముందుకు వెళ్లగలవనేదే ఇప్పుడు దేశంలో న్యాయస్థానాల ముందున్న ప్రశ్న అని చెప్పారు. పర్యావరణ న్యాయాన్ని కాపాడేందుకు సుప్రీంకోర్టు మర్రిచెట్టులా నిలుస్తోందన్నారు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో యువతకు ఉద్యోగావకాశాలు: మోదీ

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచడానికి ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నిస్తోందని ప్రధాని మోదీ చెప్పారు. వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, నైపుణ్య కార్యక్రమాలు, రూ.లక్ష కోట్ల ఉపాధి ప్రోత్సాహక పథకాలవల్ల 2 కోట్ల మంది యువతీయువకులు సంఘటిత కార్మికశక్తిగా మారనున్నారని వివరించారు. శనివారం దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహించిన 20వ రోజ్‌గార్ మేళాలో 51వేలకుపైగా నియామక పత్రాలను పంపిణీ చేశారు. వారిని ఉద్దేశించి మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు.





# డ్రైఫ్రూట్స్ తింటూ కరువు పరిస్థితులపై సమీక్ష

కరువు పరిస్థితులపై సమీక్షలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు డ్రైఫ్రూట్స్ తింటూ కనిపించడం బీజేపీ పాలిత మహారాష్ట్రలో దుమారం రేపింది. మరాఠ్వాడా ప్రాంతంలో దారుణమైన కరువు పరిస్థితులపై నాందేడ్‌లో వ్యవసాయ మంత్రి దత్తాత్రేయ భామే అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు జీడిపప్పు, బాదం లాంటి డ్రై ఫ్రూట్స్ పెట్టారు. అధికారులు ఓ వైపు కరువు పరిస్థితులపై వివరిస్తుంటే.. ఇంకోవైపు మంత్రులు అతుల్ సావే, మేఘనా బోర్డికర్, అలాగే కొందరు ఎంపీలు, ఎమ్మెల్యేలు జీడిపప్పు, బాదం తింటున్న వీడియోలు వైరల్ అయ్యాయి. దీనిపై శివసేన (యూబీటీ) ఎమ్మెల్యే అంబాదాస్ దాన్వే తీవ్ర విమర్శలు చేశారు. రైతులు, ప్రజల సమస్యలపై చిత్తశుద్ధి, కనీసం సానుభూతి లేకుండా వారి తీరు ఉందన్నారు. దీనిపై సీఎం ఫడ్నవీస్ స్పందిస్తూ.. ఇలాంటి సున్నితమైన అంశాలపై చర్చిస్తున్నప్పుడు సున్నితత్వాన్ని ప్రదర్శించేలా ఏర్పాట్లు ఉండాలన్నారు.

# మోదీ బర్త్‌డేకు గైర్హాజరైన విద్యార్థులకు రూ.500 జరిమానా!




ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించే దీపారాధన కార్యక్రమానికి గైర్హాజరైన విద్యార్థులను ఐఐఎం జమ్ము శిక్షిస్తున్నదని కాంగ్రెస్‌కు చెందిన రాజ్యసభ ఎంపీ సయ్యద్ నాసీర్ హుస్సేన్ ఆరోపించారు. ఈ కార్యక్రమానికి హాజరుకాని విద్యార్థులు రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని, లేదా రూ.500 జరిమానా చెల్లించాలని ఐఐఎం జమ్ము విద్యార్థి కౌన్సిల్ నోటీసులు ఇచ్చిందని చెప్పారు. దీనికి శుక్రవారం డెడ్‌లైన్ విధిస్తూ జారీ చేసిన నోటీస్‌ను ఆయన సామాజిక మాధ్యమంలో షేర్ చేశారు.

అసలు ప్రధాని పుట్టిన రోజు వేడుకకు విద్యార్థులు తప్పనిసరిగా ఎందుకు హాజరుకావాలని ఆయన ఎక్స్‌లో ప్రశ్నించారు. 'ఇది ఐఐఎంలో ఏర్పాటు చేసిన ఒక విద్యాపరమైన బాధ్యతా? లేదా మోదీ ప్రచారాన్ని క్యాంపస్‌లో నిర్వహించడం తప్పనిసరి కార్యక్రమమా? విద్యా సంస్థల్లోని విద్యార్థుల్లో స్వతంత్ర భావాలను పెంపొందించాలే తప్ప వారిని రాజకీయ కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించడం, లేకపోతే జరిమానాలు విధిస్తామని బెదిరించడం తగదు.

బీజేపీ ప్రచార విన్యాసాలను మన అత్యున్నత విద్యాసంస్థలకు దూరంగా ఉంచాలి' అని ఆయన అన్నారు. కాగా దీనిపై ఐఐఎం జమ్ము స్టూడెంట్ అఫైర్స్ చైర్‌పర్సన్ బ్రిగేడ్ నీరజ్ సోని వివరణ ఇస్తూ కార్యక్రమానికి హాజరుకాని ఏ విద్యార్థికి కూడా జరిమానా విధించ లేదని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుక మాదిరిగానే ఇది కూడా సాధారణంగా తీసుకునే చర్యేనని పేర్కొన్నారు.

# ఆస్తిపన్నుతో పాటు సాఫ్ట్‌వేర్ చార్జీ




'పౌరులపై ఎన్నిరకాల పన్నులు వేసి పీడించవచ్చు?' అనే అంశంపై కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం రీసెర్చి చేస్తున్నట్టు కన్పిస్తున్నది. ఐదు నగర కార్పొరేషన్లతో ఉన్న గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ)ఇళ్ల యజమానుల నుంచి కొత్తరకం పన్నును వసూలు చేయడం ప్రారంభించింది. వారు ఇక నుంచి ఆస్తిపన్నుతో పాటు రూ.200 'సాఫ్ట్‌వేర్ చార్జీ' కూడా చెల్లించాలి. దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకుండానే ఆర్థిక సంవత్సరం మధ్యలో ప్రజలపై నిశ్శబ్దంగా విధిస్తుండటం పట్ల జీబీఏపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది. వాణిజ్య భవనాలపై ఈ చార్జీ రూ.1000 ఉండచ్చునని సమాచారం. కాగా, జీబీఏ చర్యను విపక్ష బీజేపీ, జేడీ(ఎస్)లు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఇది పట్టపగలు దోపిడీ అని వ్యాఖ్యానించాయి.

# ప్రారంభించాల్సింది నేను కాదు.. ఆయన!

కొట్టాయం: పనులు చేయించింది, నిధులు సాధించింది ఎవరైనప్పటికీ ప్రారంభోత్సవ గౌరవం తాజా ప్రజాప్రతినిధికి దక్కడం సాధారణమే. కానీ కేరళలో దీనికి భిన్నమైన ఘటన జరిగింది. తాను ఇటీవలే ఎమ్మెల్యేనైనా.. ఓ ఊరి వంతెన సాకారం అయ్యేందుకు మునుపటి ఎమ్మెల్యే కారణం కాబట్టి ఆయనే దానిని ప్రారంభించాలని పట్టుబట్టి మరీ అలాగే చేయించారు. పూజార్ నియోజకవర్గం నుంచి ఇటీవలి ఎన్నికల్లో పోటీ చేసిన సెబాస్టియన్ కులథుంకాల్‌ను (ఎల్‌డీఎఫ్‌లో భాగమైన కేరళ కాంగ్రెస్‌ఎం నేత) కాంగ్రెస్ అభ్యర్థి ఎం.జె.సెబాస్టియన్ ఓడించారు. ఎరుమేలిఅమకున్ను మధ్య వంతెన నిర్మించేందుకు రూ.80 లక్షల నిధులను నియోజకవర్గ అభివృద్ధి నిధి నుంచి కులథుంకాల్ ఇదివరలో మంజూరు చేశారు.

**ప్రారంభోత్సవ ఏర్పాట్లు జరుగుతుండగా సెబాస్టియన్ స్థానిక అధికారుల్ని ఒప్పించి.. మాజీ ఎమ్మెల్యేను శుక్రవారం నాటి కార్యక్రమానికి ఆహ్వానించేలా చూశారు. వంతెన పనికి పూర్తి ఖ్యాతి ఆయనదేనని సభాముఖంగా చెప్పారు. "నాకు ఇది అవమానమో, అగౌరవమో కాదు. అలాంటి ఆలోచనే నాకు రాదు. నిధులు ఇచ్చినందుకు ఆయన్ని గౌరవించాల్సిందే. రాజకీయమంటే అదే. సమాజాభివృద్ధికే రాజకీయాలు ఉండాలి. అభివృద్ధి పనులపై వాస్తవాలేమిటో ప్రజలకు తెలియాలి" అని సెబాస్టియన్ పేర్కొన్నారు. తర్వాత వంతెనను కులథుంకాల్ లాంఛనంగా ప్రారంభించారు. శిలాఫలకంపై సెబాస్టియన్ పేరు కూడా లేదు.**

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
సోమవారం | అనంతపురం
21.09.2026
EDITORIAL NEWS ఎడిటోరియల్




# అంకెల వెనుక అసలు నిజం!

ఆగస్టు 31న, కేంద్ర ప్రభుత్వం, దేశంలో సంపద పెరుగుదలకి సంబంధించి, కొన్ని గణాంకాలు విడుదల చేసింది. వాటి సారాంశం ఏమిటంటే: 'కిందటి సంవత్సరం (2025లో), ఏప్రిల్ నెలకీ–జూన్ నెలకీ మధ్య, దేశంలో (డొమెస్టిక్).. వస్తువుల రూపంలో గానీ, 'సేవల' రూపంలో గానీ, తయారైన ఉత్పత్తి ('ప్రోడక్ట్')కి వచ్చిన మొత్తం డబ్బు ('గ్రాస్') విలువ కన్నా, ఈ 2026వ సంవత్సరంలో, అవే 3 నెలల్లో వచ్చిన మొత్తం డబ్బు విలువ (జి.డి.పి.) ఎక్కువ' అని ఆ లెక్కలు చెప్పాయి. అసలు డబ్బు లెక్కలుకట్టే పనికి ప్రభుత్వంలో ఒక డిపార్టుమెంటు ఉంటుంది; గణాంకాలశాఖ అనో, ఆర్థికశాఖ అనో, ఏదో ఒక పేరుతో! ఆ శాఖలో వున్న ఆర్థికశాస్త్రవేత్తలు ప్రతి ఏటా, దేశం మొత్తంలో 3 నెలల్లో జరిగిన మొత్తం ఉత్పత్తికి సంబంధించిన వివరాలు సేకరించి, వాటిని తాము సరైనది అనుకున్న పద్ధతి ('మెథడాలజీ') ప్రకారం అర్థం చేసుకుని, ఆ లెక్కల్ని పత్రికలకీ, టీవీ చానళ్లకీ విడుదల చేస్తారు. అలా, ఇటీవల బైటికి వచ్చిన లెక్కల్ని చూసి, దేశ ప్రధాని తెగ మురిసిపోతూ చెప్పిన మాటల్లో కొన్ని: "నా ప్రభుత్వ పాలనలో, ఎంత ఆర్థికాభివృద్ధి జరిగిందో చూశారా? కానీ, ప్రతిపక్షం వాళ్లు ఉన్నారు చూశారూ? వాళ్లు నిరాశావాదులు! వినాశనం జరుగుతుందని జోస్యం చెప్పేవాళ్లు! వాళ్లకు ఈ అభివృద్ధి మింగుడుపడడం లేదు. వినాశనాన్ని కోరే ప్రతిపక్షాలు నశించాయి లెండి! భారతదేశం మాత్రం వికసించింది." ('డూమ్ సేయర్స్ ఆర్ డూమ్డ్! ఇండియా బ్లూమ్డ్!')– ఇలా సాగింది ప్రధానమంత్రి ఆత్మస్తుతీ, పరనిందా!

ప్రధాని ఇలా అంటే, ప్రతిపక్షాలు ఊరుకుంటాయా? వారికీ వారి పడికట్టు పదాలు ఉంటాయిగదా? వారేం అన్నారంటే.. "ప్రభుత్వం చెప్పే జి.డి.పి.కి అర్థం: 'జి' అంటే 'గ్రేట్లీ', 'డి' అంటే 'డిస్టార్టెడ్', 'పి' అంటే 'పిక్చర్'! ('గొప్పగా వక్రీకరించిన చిత్రం') అనీ; ప్రభుత్వం చెప్పే లెక్కలన్నీ, గణాంక క్రీడా విన్యాసాలు అనీ; అంకెల్ని తారుమారు చేయడం అనీ; కావాలని తయారుచేసిన సమాచారం అనీ– ఇలా సాగాయి ప్రతిపక్ష పార్టీల పదాల విన్యాసాలు. ప్రభుత్వంతో విభేదించే వాళ్లు ఇంకా ఇలా ఆశ్చర్యపోతున్నారు: 'గత కొన్ని సంవత్సరాలుగా, ప్రపంచంలో రెండుచోట్ల పెద్ద యుద్ధాలు జరుగుతూవుంటే, అనేక దేశాలలో వృద్ధిరేటుకి ఆటంకాలు ఎదురవుతూవుంటే, ఇక్కడ వృద్ధి రేటు గతం కంటే కూడా పెరిగిపోవడం ఎలా సాధ్యం?' అని!

అయితే, అటు అధికార పక్షం అయినా, ఇటు ప్రతిపక్షం అయినా, ప్రతిసారీ ఇలాగే, చెప్పిందే చెబుతారనుకోండి. అధికారంలో వున్నప్పుడేమో, 'చూశారా, మా పాలనలో ఎంత ఆర్థికాభివృద్ధిని సాధించామో?' అంటారు. అధికారంలో లేనప్పుడేమో, 'ఏడిసింది మీ అభివృద్ధి. నిరుద్యోగాన్నీ, దారిద్ర్యాన్నీ, ధరల పెరుగుదలనీ తగ్గించని అభివృద్ధి ఏమి అభివృద్ధి?' అంటారు. అలాగే, ఆ పక్షాల ఆర్థిక శాస్త్రవేత్తలు కూడా, జి.డి.పి. లెక్కల విషయంలో, పరస్పరం వ్యతిరేకమైన వాదనలు చేస్తారు. ఒక పక్షం ఆర్థికవేత్తలేమో, "ఫ్యాక్టరీలో తయారవడానికి ఎంత డబ్బు అయిందో, దాన్నిబట్టి మీరు లెక్కపెట్టలేదు. ఆ ఉత్పత్తికే, చివరికి అమ్మకాలు అయ్యాక ఎంత డబ్బు వచ్చిందో, ఆ పద్ధతిలో లెక్క పెట్టారు. అందుకే, ఎక్కువ ఉత్పత్తి జరిగినట్టు కనిపిస్తున్నది" అని వాదన.

దానికి అధికారపక్షం వాళ్లేమో, "తేడా ఏమీ లేదు. ఉదాహరణకి, ఒక మనిషి బరువుని 150 పౌండ్లు అన్నా, 70 కిలోలు అన్నా పెద్ద తేడా అవుతుందా? ఒక రకం కొలతలో అంకెలు ఎక్కువగానూ, ఇంకో రకం కొలతలో అంకెలు తక్కువగానూ ఉండడం వల్ల మీకు అలా అనిపిస్తుంది" అని వాళ్లకి మాత్రమే అర్థమయ్యే పోలిక తెస్తారు. కానీ, రెండు రాజకీయ పక్షాలూ, వారి ఆర్థికవేత్తలూ కూడా, శ్రామిక ప్రజలకు అసలు రహస్యం చెప్పరు. అసలు రహస్యం తెలుసుకోవాలంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని, శ్రామికవర్గ ప్రయోజనాల దృష్టితో, పరిశోధించిన మార్క్స్ వైపు కళ్లు తిప్పవలిసిందే! పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు చెప్పే జి.డి.పి. ('స్థూల దేశీయ ఉత్పత్తి') అనే మాట మార్క్స్ కాలంలో లేదు. మార్క్స్ పోయిన తర్వాత ఎప్పుడో 50 ఏళ్లకి, ఒక పెట్టుబడిదారీ ఆర్థికవేత్త ఆ మాటని ప్రవేశపెట్టాడు. అయితే, ఆ మాట, 'శ్రమ దోపిడీ' అనే అసలు రహస్యాన్ని మరుగుపరిచి, పెట్టుబడిదారులకి లాభాల రూపంలో ప్రతి 3 నెలలకీ, లేదా సంవత్సరానికి, కొత్తగా సమకూరిన సంపద ఎంతా?– అనే డబ్బులెక్కల మీదే దృష్టి పెడుతుంది. 'ఆ తయారైన ఉత్పత్తి శ్రామిక జనాలకు ఎంత వరకు అందిందీ, ఆ ఉత్పత్తుల గుట్టల్లో ఆరోగ్యానికి హాని చేసే సిగిరెట్లూ, బ్రాందీ విస్కీలూ వంటి వస్తువులు ఎన్ని ఉన్నాయో; తుపాకులూ బాంబులూ, యుద్ధ ట్యాంకులూ, ఖండాంతర క్షిపణులూ లాంటి మారణాయుధాలు ఎన్నివున్నాయో– ఇలాంటి సంగతులు ఏవీ పట్టవు వృద్ధి రేటును లెక్కపెట్టేవారికి. 'ఎన్ని లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థో మనది!'– అని గప్పాలు కొట్టుకోవడానికి పనికి వచ్చే మాటలే మాట్లాడతారు ప్రభుత్వాధినేతలూ, వారి ఆర్థికవేత్తలూ!

పెట్టుబడిదారుల ఉమ్మడి వ్యవహారాల్ని చూసే కమిటీగా పనిచేసే ప్రభుత్వం, ఉత్పత్తి విలువలో పెరుగుదలను చూపించి, జబ్బలు చరుచుకుంటోంది. ఆ పెరుగుదల ఎవరి శ్రమల విలువ వల్ల జరిగిందో మాత్రం ఆర్థికవేత్తలూ చెప్పరూ, ప్రభుత్వమూ చెప్పదు. అది మనం తెలుసుకోవాలి. 'ఆ ఆర్థిక విషయాల గోల మనకెందుకు?' అని ఊరుకోకూడదు. ఎందుకంటే, ఆ ఆర్థిక విషయాలే మన నిత్యజీవితాల్ని శాసిస్తాయి, ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ!

మార్క్స్ సిద్ధాంతం ప్రకారం చూసినప్పుడు, ఏ కాలంలోని ఉత్పత్తి (జి.డి.పి) విలువ అయినా, 3 భాగాలుగా వుంటుంది. (1) ఉత్పత్తి సాధనాల మీద పెట్టిన డబ్బు. ఇది, పెట్టినంతే వెనక్కి తిరిగి వస్తుంది కాబట్టి, ఇది 'స్థిర' పెట్టుబడి. (2) సాధనాల్ని ఉపయోగించి, ఉత్పత్తి చేసే శ్రామికులు పొందే జీతాల మీద పెట్టే డబ్బు. (3) ఈ డబ్బుని జీతాలుగా తీసుకునే కార్మికులు, జీతాల విలువకన్నా అదనంగా విలువని (డబ్బుని) ఇస్తారు కాబట్టి, జీతాల మీద పెట్టే డబ్బుని 'అస్థిర' పెట్టుబడి అంటారు.

అంటే, జి.డి.పి. అనే దానిలో స్థిర పెట్టుబడి+అస్థిర పెట్టుబడి+అదనపు విలువ ఉంటాయి. ఇదీ, జి.డి.పి. అసలు రహస్యం. మరి, ఆర్థికవేత్తలు ఈ రహస్యం గురించి ఎందుకు చెప్పరు? ఎందుకంటే, వాళ్లు పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు కాబట్టి! వాళ్లు చెప్పేదే గొప్ప ఆర్థిక శాస్త్రంగా ఎందుకు చలామణీ అవుతున్నది? దీనికి జవాబు తన 'పెట్టుబడి' పుస్తకంలో, ఒక ముందుమాటలో, మార్క్స్ ఇలా చెప్పాడు: "వర్గ పోరాటం, ఇంకా తగినంతగా పైకి కనిపించనంత కాలమూ, లేదా, అది అక్కడక్కడా, అప్పుడప్పుడూ మాత్రమే బయట పడుతున్నంత కాలమూ, రాజకీయ ఆర్థికశాస్త్రం ఒక శాస్త్రంగా చలామణీ అవుతుంది." ఈ సంగతి అసలు ఉత్పత్తిదారులైన శ్రామిక ప్రజలు తెలుసుకోగలిగినప్పుడు, ఇప్పుడున్న అధికార–ప్రతిపక్ష రాజకీయ పార్టీలూ, వారి ఆర్థిక శాస్త్రవేత్తలూ చెప్పే దాని వెనక ఉన్న అసలు సత్యం బోధపడుతుంది.

# అవకాశాల కల్పనే ప్రగతికి ఆలంబన

**ఏటా లక్షలమంది భారతీయ విద్యార్థులు ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్తున్నారు. అలా పెద్దమొత్తంలో డబ్బులూ, ప్రతిభా నైపుణ్యాలు తరలిపోతున్నాయి. కానీ యుద్ధాలు, కఠిన వీసా విధానాలు విదేశీ చదువుల మార్గాన్ని, స్థిరపడే అవకాశాల్ని అనిశ్చితిలోకి నెట్టేస్తున్నాయి. మరోవైపు, భారతీయ విశ్వవిద్యాలయాల స్థాయి కూడా పెరుగుతోంది. విదేశీ వర్సిటీలు సైతం ఇండియాకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో విదేశీ చదువుల విషయంలో అందరూ పునరాలోచన చేయాలి.పిల్లల్ని విదేశాల్లో చదివించాలనేది చాలామంది తల్లిదండ్రుల ఆరాటం. అప్పులకూ వెనకాడరు. పిల్లల భవిష్యత్తు బాగుండాలనే ఆశతో తల్లిదండ్రులు చేసే ఈ త్యాగం గొప్పదే. అయితే, విదేశీ చదువులు మాత్రమే విజయానికి మార్గాలవుతాయా? ప్రపంచ పరిస్థితులు ఇప్పటికీ ఒకప్పటిలాగే ఉన్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గత కొన్నేళ్లుగా పరిస్థితులు మారుతున్నాయి. విదేశీ విద్యకు వెళ్లే మార్గాలు, వీసా విధానాలు, అక్కడి ఉద్యోగ అవకాశాలు వంటివన్నీ మారాయి. అదే సమయంలో మన ఉన్నత విద్యారంగంలోనూ వేగంగా మార్పులు కనిపిస్తున్నాయి. అందుకే విదేశీ చదువులపై నిర్ణయం తీసుకునే ముందు స్వదేశంలో మారుతున్న వాస్తవ పరిస్థితులను కూడా పరిశీలించడం అవసరం.**



గణాంకాలు చెప్పేదేంటి?

దేశాంగశాఖ గణాంకాల ప్రకారం 2024లో సుమారు 13.35 లక్షల భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదువుకున్నారు. చదువుల కోసం భారత్ నుంచి ఏటా సుమారు రూ.29వేల కోట్లు విదేశాలకు వెళ్తున్నట్లు రిజర్వు బ్యాంకు గణాంకాలు సూచిస్తున్నాయి. నీతిఆయోగ్ ఇటీవలి నివేదిక ప్రకారం భారత ప్రభుత్వం ఉన్నత విద్యకు కేటాయించే బడ్జెట్‌లో దాదాపు 53 శాతానికి సమానమైన మొత్తం విదేశీ చదువుల కోసం బయటకు వెళ్తోంది. విదేశీ వర్సిటీలో విద్య, తర్వాత ఉద్యోగం, అక్కడే స్థిరపడటం అనేది ఇప్పటి దాకా చాలా కుటుంబాల ప్రణాళిక. కానీ, ఇప్పుడు ప్రపంచ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఆ మార్గం గతంలో మాదిరిగా తేలికగా లేదు. కెనడా ప్రభుత్వం 2024లో స్టూడెంట్ పర్మిట్ల సంఖ్యను దాదాపు సగానికి తగ్గించింది. ఫలితంగా భారత విద్యార్థుల సంఖ్య ఒక్క ఏడాదిలోనే 41శాతం తగ్గిపోయింది. అమెరికాలో వీసా విధానాలు కఠినతరమయ్యాయి. హెచ్1బీ వీసా ఫీజులు పెరిగాయి. విద్యార్థి వీసాల పరిశీలన మరింత కఠినంగా మారింది. యూకే, ఆస్ట్రేలియా కూడా వీసా ఖర్చులు పెంచి, కొన్ని పోస్ట్‌స్టడీ అవకాశాలను పరిమితం చేశాయి. ఫలితంగా విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్యపై ప్రభావం పడుతోంది. మరోవైపు, భారతీయ వర్సిటీలు ప్రపంచ ర్యాంకింగ్స్‌లో క్రమంగా మెరుగవుతున్నాయి. క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్2026 ప్రకారం ఐఐటీ దిల్లీ ప్రపంచంలో 123వ స్థానం, ఐఐటీ మద్రాస్ 180వ స్థానం పొందాయి. ఇంజినీరింగ్ విభాగంలో ఐఐటీ దిల్లీ ప్రపంచంలో 26వ స్థానం దక్కించుకోవడం విశేషం. వ్యాపార విద్యలో ఐఐఎం అహ్మదాబాద్ ప్రపంచ టాప్30లో స్థానం సంపాదించింది. ఇప్పటిదాకా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 54 భారతీయ వర్సిటీలు చోటుసంపాదించాయి. అమెరికా, యూకే, చైనా తర్వాత నాలుగో స్థానంలో ఇండియా నిలవడం గమనార్హం. ప్రైవేట్ వర్సిటీలు కూడా ఈ మార్పులో కీలకపాత్ర పోషిస్తున్నాయి. ప్రపంచస్థాయి విద్యాసంస్థల్లో చదివిన అధ్యాపకులను నియమించడం, పరిశ్రమలతో బలమైన అనుబంధం నెలకొల్పడం, ఆధునిక ప్రయోగశాలల ఏర్పాటు, విదేశీ వర్సిటీలతో అకడమిక్ సహకారం పెంచడం వంటి చర్యలతో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నాయి. ప్లేస్‌మెంట్ అవకాశాలు, నైపుణ్య కోర్సులు కూడా అనేక ప్రైవేట్ యూనివర్సిటీల ప్రత్యేకతలుగా మారాయి. ఇటీవల ప్రపంచస్థాయి వర్సిటీల్లో కొన్ని ఇండియాలో క్యాంపస్‌ల ఏర్పాటుకు ముందుకొస్తున్నాయి. ఈ క్రమంలో నాణ్యమైన ఉన్నత విద్యావకాశాలను మరింతగా విస్తరించగలిగితే ప్రతిభా నైపుణ్యాలను దేశంలోనే నిలబెట్టుకోవడం సాధ్యమే.

**మార్పును ముందుకు తీసుకెళ్లాలి...**

నీతి ఆయోగ్ విశ్లేషణ ప్రకారం, ఒక విదేశీ విద్యార్థి ఇండియాకు వస్తే, సుమారు 25మంది భారతీయ విద్యార్థులు విదేశాలకు వెళ్తున్నారు. అంటే, మన దేశంలోని ప్రతిభాపాటవాలు, మన పన్నులతో రూపుదిద్దుకున్న నిపుణ మానవ వనరులు ఇతర దేశాల అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. దీనికి పరిష్కారంగా ప్రపంచస్థాయి అవకాశాలను భారత్‌లోనే అందించడం ముఖ్యం. ఇందుకోసం ఆర్అండ్‌డీ రంగంలో పెట్టుబడులు గణనీయంగా పెరగాలి. భారత్‌లోకి వస్తున్న విదేశీ వర్సిటీల క్యాంపస్‌ల నాణ్యతను కఠినంగా పర్యవేక్షించాలి. తల్లిదండ్రులు కూడా విదేశాల్లో అస్థిరతలను గుర్తిస్తూ, స్వదేశంలో మారుతున్న విద్యావ్యవస్థ తీరుతెన్నులనూ పరిగణనలోకి తీసుకోవాలి. మన విద్యార్థుల ప్రతిభకు తగిన చదువు, పరిశోధన, ఉద్యోగ అవకాశాలను స్థానికంగా ఎంతమేర కల్పిస్తున్నామనేది దేశాభివృద్ధిని ప్రభావితం చేసే ప్రధానాంశం. ఆ దిశగా మార్పు ప్రారంభమైంది. దాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రభుత్వం, వర్సిటీలు, పరిశ్రమలపై ఉంది.

# సామాన్యుల సింహ దాహాలు!!

**మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) విభాగం ఇటీవల ఇస్కాన్ (కృష్ణ చైతన్య ఉద్యమ సంస్థ) నిర్వహించే ఈటరీ (మెస్‌లు, టిఫిన్ సెంటర్లు, హోటళ్లు మొదలైనవి)లపై దృష్టి పెట్టింది. ఇస్కాన్ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదు. అదొక అంతర్జాతీయ మత, ఆధ్యాత్మిక ఉద్యమం. లక్షలాది అనుయాయులు ఉన్న ఉద్యమమది. అయితే ఎఫ్‌డీఏ కమిషనర్ తుకారామ్ ముండే లక్ష్యం స్పష్టంగా ఉన్నది: ఆహార కల్తీని నిరోధించడం. ఆయన దృష్టిలో ఎవరూ చట్టం కంటే ఉన్నతులు కాదు. ఇస్కాన్ సైతం అందుకు మినహాయింపు కాదు. అందుకే ఆ సంస్థ నిర్వహించే ఈటరీలపై దాడులు. ఎఫ్‌డీఏ కమిషనర్‌గా తుకారామ్ ముండే బాధ్యతలు చేపట్టిన 100 రోజుల్లో వెలుగులోకి వచ్చిన ఆహార కల్తీ ఉదంతాలు, అంతకు ముందు 18 నెలల్లో బహిర్గతమైన అటువంటి మొత్తం ఉదంతాల కంటే చాలా చాలా అధికంగా ఉన్నాయి.మరి ప్రజలు ముండేను ఒక సింహంలా భావిస్తుండడంలో ఆశ్చర్యమేముంది? ఒక సూపర్–కాప్ కథ ఆధారంగా రూపొందిన బాలీవుడ్ సినిమా 'సింఘమ్' ప్రేరణతో ముండేను ఒక నిజ జీవిత సింహం అని ప్రజలు పిలుస్తున్నారు. వినియోగదారుల ఆరోగ్యానికి హాని చేసే కల్తీ ఆహారపదార్థాల విక్రయాన్ని అరికట్టేందుకు ఆయన చేపట్టిన చర్యల పట్ల ప్రజల ప్రతిస్పందనలో ఒక నిజం వెల్లడయింది. నిబంధనలు సరిగా పాటించని వ్యాపార సంస్థలు లైసెన్స్‌లు కోల్పోతామేమోనని భయపడుతున్నాయి. చట్టం తమకు సహాయకారిగా ఉన్నదనే ఆశాభావం ప్రజల్లో నిండుగా ఉదయించింది. ప్రభుత్వం ఎప్పుడో అడగవలసిన ప్రశ్నను ఒక అధికారి ఎట్టకేలకు అడుగుతున్నాడని వారు భావిస్తున్నారు: అసలు మీరు మాకు ఎటువంటి ఆహారాన్ని అందిస్తున్నారు?**

అనునిత్యం ఫలహారాలు, భోజనాలు ఇంటిలో కాక బయట హోటళ్లలో చేసేందుకు మనం అలవాటు పడిపోయిన రోజులివి. మిఠాయిలు, మాంసాహార వంటకాలకు ఆన్‌లైన్ ఆర్డర్లు ఇవ్వడానికి మనం బాగా అలవాటుపడిపోయాం. అవి భద్రమైనవని మనం విశ్వసిస్తున్నాం, నిరభ్యంతరకరంగా భుజిస్తున్నాం. అయితే ముండే నేతృత్వంలో ఎఫ్‌డీఏ సిబ్బంది నిర్వహిస్తున్న దాడుల్లో ఆహార భద్రతా నిబంధనలు



ఎంతగా ఉల్లంఘనకు గురవుతున్నాయో దిగ్భ్రాంతికరంగా తేటతెల్లమవుతోంది. చట్టాలు లేకపోవడం వల్లనా ఈ పరిస్థితి? కాదు. చట్టాలు ఉన్నాయి. వాటిని అమలుపరచకపోవడమే అసలు సమస్య. మరి చట్టాలను అమలుపరుస్తున్న తుకారామ్ ముండే ప్రజలకు ప్రేమాస్పదుడు కావడంలో ఆశ్చర్యమేముంది?

ఆయన ఒక అసాధారణ వ్యక్తిగా కనిపిస్తున్నారు. నిబంధనలను సాధారణంగా వక్రీకరించే లేదా పూర్తిగా ఎంపిక చేసిన వాటిని మాత్రమే అమలుపరిచే, అసలు పూర్తిగా ఉపేక్షించే వ్యవస్థలో నిర్భయంగా చట్టాలను ఉపయోగించి సత్పరిపాలనను అందిస్తున్న అధికారి ఒక విప్లవశీలిగా కన్పించడం కద్దు. ముండే విషయంలో జరిగింది ఇదే. తన విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తిస్తున్న అధికారిని ఒక సూపర్ హీరోగా ఎందుకు భావిస్తున్నారు? ముండేకు అత్యున్నతస్థాయి అధికారాలు లేవు. అయినా తన పరిమిత అధికారాల వినియోగంతోనే సింహంగా పేరు పొందారు. పెద్ద మనుషులుగా చలామణీ అవుతున్నవారు వ్యవస్థలోని లోపాలను వాడుకుని తప్పించుకోవడాన్ని నిత్యం చూస్తున్న ప్రజలకు చట్టోల్లంఘనలను ఉపేక్షించని అధికారి ఒక హీరోలా కనిపించడం అసహజమేమీ కాదు. ప్రజా శ్రేయస్సుకై స్వార్థపర శక్తులను ఎదుర్కోవడం ముండేకు ఇదే కొత్త కాదు. తన ఉద్యోగ జీవితం ఆరంభం నుంచీ ఆయన ఈ ధర్మ మార్గంలోనే నడుస్తున్నారు. ఎప్పుడూ ఎక్కడా రాజీపడకపోవడం వల్లే 21 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో 25సార్లు బదిలీ అయ్యారు!

ఒక అధికారి తన బాధ్యతల నిర్వహణలో ఎదురయ్యే సంక్లిష్ట పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొని ఉద్యోగ సోపానాలను అధిరోహించగలడు. అయితే ఉద్యోగ విధులు నిర్వర్తించడంలో అనివార్యంగా తీసుకోవల్సిన ప్రతి నిర్ణయం విషయంలోనూ దాని పర్యవసానాలు ఎలా ఉంటాయోనని ముందుగా బాగా ఆలోచించవలసిన అగత్యమున్న వ్యవస్థలో నిజాయితీపరుడైన అధికారి మనుగడ సాగించగలగడం చాలా కష్టం. తాను తీసుకోబోయే నిర్ణయంతో ఎవరు ఆశాభంగం చెందుతారు? ఒక రాజకీయవేత్త ఆక్షేపణ తెలుపుతాడా? ధనబలం దండిగా ఉన్న వ్యాపారవేత్త ఎవరైనా అసంతృప్తితో ఫోన్ చేస్తాడా? ఏదైనా ఒక మత వర్గం వారు నిరసనకు దిగుతారా? పలుకుబడి ఉన్న వ్యక్తులు ఉన్నత స్థాయిలో తమకు ఉన్న సంబంధాలను ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉపయోగించుకుంటారా? అసలు నిర్ణయాన్ని పూర్తిగా అమలుపరచకముందే బదిలీ ఉత్తర్వు వస్తుందేమో?! ఇటువంటి ప్రశ్నలు, సందేహాలతో సతమతమవ్వక తప్పని పరిస్థితులలో ఏ అధికారి అయినా దీక్షాదక్షతలతో ఎలా వ్యవహరించగలడు?

ప్రభుత్వ వ్యవస్థలు తమ స్వతంత్రతను క్రమంగా కోల్పోతున్నాయి. ఎందుకని? ప్రతి ప్రభుత్వాధికారీ అవినీతిపరుడు అయినందువల్లకాదు. అలా భావించడం ఒక మూస పద్ధతిలో ఆలోచించడమే అవుతుంది. స్వతంత్ర నిర్ణయాలు తీసుకునేవారిని శిక్షిస్తూ, చెప్పినట్లు చేసే వారిని అందలాలు ఎక్కిస్తున్న ఒక వ్యవస్థ సంబంధిత వ్యక్తులందరికీ ఒక శక్తిమంతమైన సందేశాన్ని పంపుతున్నది. 'స్వతంత్రంగా వ్యవహరించి అపాయాన్ని కొనితెచ్చుకోవద్దు' అని ఒక తీవ్ర హెచ్చరిక చేస్తున్నది. ప్రభుత్వ వ్యవస్థలో తరచూ అతి సులువుగా చేయగలిగే పని... అసలు ఏమీ చేయకపోవడమే. కష్టమైన పని ఏమిటంటే... చేయవలసిన పని చేయడమే!

చేయవలసిన పని చేస్తున్నాడు కాబట్టే తుకారామ్ ముండేను ప్రజలు మౌనంగా మెచ్చుకుంటున్నారు. ఆయనకు మద్దతుగా ఒక పెద్ద రాజకీయ ఉద్యమానికి వారు ఉపక్రమించలేదు. ఇది గమనార్హం. తుకారామ్‌కు మరొక ఉన్నత బాధ్యతను అప్పగించాలని ఎవరూ డిమాండ్ చేయడం లేదు. అయితే ముండే నిర్వహిస్తున్న ప్రతి తనిఖీకి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రచారంలోకి వచ్చినప్పుడు, పేరు ప్రతిష్ఠలు ఉన్న ఒక సంస్థను ఆయన ప్రశ్నించినప్పుడు ప్రజలు ప్రతిస్పందిస్తున్నారు. వారిలో నిబిడీకృతంగా ఉన్న ధర్మాగ్రహం పురిగొల్పిన ప్రతిస్పందన అది, సందేహం లేదు.

అవును, ఎట్టకేలకు ఎవరో ఒకరు ఏదో ఒకటి చేస్తున్నారు. భారతీయులు నియమ నిబంధనలను స్వతహాగా ఇష్టపడరని కాదు. వాటి అమలులో పక్షపాతాన్ని వారు కచ్చితంగా ఇష్టపడరు. ఈ సంస్థ ఎవరిది? ఎవరికి ఎవరు తెలుసు? ఆ సంస్థకు ఎంత పలుకుబడి ఉంది? దానిపై చర్య తీసుకుంటే ఏ రాజకీయపక్షం లేదా మత సమూహం అది తమకు వ్యతిరేకంగా తీసుకున్నదేనని నొచ్చుకుంటుంది? అన్న ప్రశ్నలే తలెత్తకూడదు. చట్టం అర్థవంతంగా ఉండాలంటే దానిని నిష్పాక్షికంగా అమలుపరచాలి. అందరికీ సమానంగా వర్తింపజేయాలి.

ఇదే తుకారామ్ ముండే సంచలనశీలత నిజమైన పాఠం. ఆయన తన బాధ్యతల నిర్వహణలో ఒక సింహంలా వ్యవహరిస్తున్నారని ప్రజలు భావిస్తున్నారు. 'నిజ జీవిత సింహం' అని ఆయనను పిలుస్తున్నారు. అయితే ఈ ప్రశంసే ఆయన కథలో ఆశ్చర్యకరమైన విషయం కాదు. అసలు ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే– అలాంటి వ్యక్తులే అన్ని అధికార స్థానాలలో ఉండాలని ప్రజలు ఎంతగానో పరితపిస్తుండడమే. ఆహార భద్రత అనేది తుకారామ్ ముండే ఎఫ్‌డీఏ ప్రధానాధికారిగా ఉండడంపై ఆధారపడి ఉండకూడదు. రెస్టారెంట్లు శుచి, శుభ్రత ఉన్న ఆహారాన్ని అందించడమనేది ఒక నిర్దిష్ట అధికారి దాడులు, తనిఖీలు చేస్తున్నాడనే విషయంపై ఆధారపడి ఉండకూడదు. కఠిన వైఖరితో వ్యవహరించే అధికారి ఉన్నప్పుడు మాత్రమే ఆహార కల్తీదారులు భయపడడం జరగకూడదు. ఆ అధికారి బదిలీ అయిన తరువాత కూడా వ్యవస్థ సక్రమంగా పనిచేయాలి. ఇదే ఒక హీరోకు, ఒక వ్యవస్థకు మధ్య వ్యత్యాసం. హీరో ఒక నిర్దిష్ట సమయం లేదా సందర్భంలో మాత్రమే పరిస్థితులను మార్చగలడు. వ్యవస్థ అనేది నిరంతరం నడుస్తుంది. సదా ప్రజాహితంగా నడుస్తుండాలి. అటువంటి వ్యవస్థ ప్రజల దైనిక జీవితాన్ని మెరుగ్గా మార్చివేయగలదు. మన వ్యవస్థలు లేదా సంస్థలు సదా సక్రమంగా పనిచేస్తూ ప్రజల విశ్వసనీయతను పొందగలిగే దాకా ముండే లాంటి వ్యక్తులు అమితంగా ప్రాధాన్యం పొందడమనేది కొనసాగుతూనే ఉంటుంది.

తుకారామ్ ముండే తానేదో మానవాతీత కార్యాన్ని నిర్వహిస్తున్నట్టు ఏ కోశానా భావించరు. తన విధ్యుక్త ధర్మాన్ని నిర్వహిస్తున్నట్టు మాత్రమే చెబుతారు. మరి ప్రతి ప్రభుత్వోద్యోగి కూడా ఎలాంటి ఆర్భాటాలు లేకుండా, పక్షపాతానికి తావివ్వకుండా, తన పై అధికారులకు భయపడకుండా తన విధులను తాను నిర్వహిస్తే మన ప్రభుత్వ వ్యవస్థల్లోను, సమాజంలోను పరిస్థితులు ఎలా ఉంటాయో ఆలోచించండి. మన దేశంలో చట్టాలు, విధానాలు, పథకాలు, కమిటీలకు కొరత లేదు. అయితే వాటిని సరిగ్గా అమలుపరచకపోవడమే దేశం అనునిత్యం ఎదుర్కొంటున్న ఒక పెద్ద సమస్య. ప్రభుత్వ సిబ్బంది తమ విధులను నిజాయితీగా స్వచ్ఛందంగా స్వతంత్రంగా నిర్వహిస్తే ఎలా ఉంటుందో కదా. భారతదేశ పాలనా సంక్షోభం గణనీయంగా తగ్గుతుంది, సందేహం లేదు. ఇదే జరిగితే తుకారామ్ ముండే లాంటి నిజ జీవిత సింహాలను అన్వేషించవలసిన అవసరం మనకు ఉండదు. ఎందుకంటే ప్రతి ఒక్కరూ తమ విధ్యుక్త ధర్మాన్ని చిత్తశుద్ధితో నిర్వహిస్తే అసాధారణ వ్యవహారశైలికి ఆస్కారముండదు. అంతా సాధారణంగానే ఉంటుంది. పరిస్థితులు సజావుగా ఉంటాయి. అందరికీ సమన్యాయం సమకూరుతుంది.

తాజా కలం: తుకారామ్ ముండే గురించి మీ అభిప్రాయం ఏమిటి? అని ఒక మహారాష్ట్ర మంత్రివర్యుడిని ప్రశ్నించాను. 'అతడొక పిచ్చివాడు' అని ఆయన ఘాటుగా సమాధానమిచ్చారు. నిజానికి తమ రాజకీయ యజమానులకు భయపడకుండా ప్రజల శ్రేయస్సు కోసం నిబద్ధతతో పనిచేసే ముండే లాంటి 'ఉన్మాద' అధికారులు ఇప్పుడు మన దేశానికి చాలా చాలా అవసరం కదూ?!

# అగ్రరాజ్య పెత్తందారీతనం!

సర్వసత్తాక సార్వభౌమ రాజ్యాల సమాహారమే ప్రపంచం. దేశాలన్నీ పరస్పరం సార్వభౌమత్వాన్ని గౌరవించుకోవడం విశ్వశాంతికి ప్రాథమిక అవసరం. అంతర్జాతీయ వ్యాపార, దౌత్య సంబంధాల నిర్వహణలో ప్రతి దేశమూ స్వీయ ప్రాథమ్యాలకు అనుగుణంగా వ్యవహరించడం సహజం. దాన్ని ఓపలేని అమెరికా అందరూ తన అడుగుజాడల్లోనే నడుచుకోవాలని భీష్మిస్తుంటుంది. ఆ పెత్తందారీతనంతోనే సైనిక జోక్యాలు, వాణిజ్య యుద్ధాలతో ప్రపంచాన్ని సంక్షోభాల్లోకి నెట్టడం అగ్రరాజ్యానికి రివాజైంది. ట్రంప్ అధ్యక్షతన టారిఫ్‌ల బాదుడుతో ఇప్పుడు విశ్వవాణిజ్యాన్ని అతలాకుతలం చేస్తోంది. ఈ క్రమంలోనే ఇరాన్, రష్యాలను మరింతగా చక్రబంధంలో ఇరికించడంతో పాటు వాటితో వ్యాపారం చేసే చైనా, భారత్ వంటి దేశాలపై సుంకాల మోతకు అధ్యక్షుడికి అధికారమిచ్చే బిల్లుకు అమెరికన్ కాంగ్రెస్ తాజాగా ఆమోదముద్ర వేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల మూలంగా ఇంధన మార్కెట్లు ఇప్పటికే తీవ్ర ఒత్తిడిలో ఉన్నాయి. అది చాలదన్నట్లు రష్యా చమురుకు అమెరికా మోకాలడ్డితే ధరలు ఇంకా పైకి ఎగబాకే ప్రమాదముంది. మాస్కో నుంచి మరెవ్వరూ ఆయిల్ కొనకూడదంటూ కన్నెర్ర చేస్తున్న అమెరికా తన అణు పరిశ్రమ అవసరాలకు మాత్రం అక్కడి నుంచే యురేనియం కొనుగోళ్లకు సై అంటోంది. స్వార్థ ప్రయోజనాలే పరమావధిగా అగ్రరాజ్యం ఆడుతున్న ఆధిపత్య క్రీడలు ప్రపంచ శ్రేయస్సుపై క్రీనీడలను ప్రసరింపజేస్తున్నాయి!

ఇచ్చిన మాట మేరకు రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని ట్రంప్ ఆపలేకపోయారు. పైగా సమరానికి దిగకుండా ఉండాల్సిందని కీవ్‌నే తప్పుపట్టారు. తన విపరీత ధోరణితో ఆయన పాశ్చాత్య దేశాలను ఒకపక్క విస్మయానికి గురిచేస్తే అదే సమయంలో ఆర్థిక ఆంక్షల సవాళ్లను రష్యా చాకచక్యంగా ఎదుర్కొంది. మార్కెట్లు, సరఫరా గొలుసుల వైవిధ్యీకరణ, షాడో ఫ్లీట్ వంటి వాటి ద్వారా ఇక్కట్లను అధిగమించింది. ఈ పరిస్థితుల్లో యుద్ధానికి ముగింపు పలికే నెపంతో మాస్కోపై మళ్లీ కొరడా ఝుళిపిస్తున్న ట్రంప్ ఎంతవరకు నెగ్గుకురాగలరన్నది ప్రశ్నార్థకమే! రష్యా చమురును కొనుగోలు చేస్తూ యుద్ధరక్కసి కోరలకు పదును పెడుతున్నారని ఇతర దేశాలపై గుడ్లురుముతున్న ట్రంప్ ఇజ్రాయెల్‌తో కలిసి చేసిందేంటి? ఇరాన్‌పై దండెత్తి హర్మూజ్ జలసంధి మూసివేతకు కారణమై ఇంధన కల్లోలాన్ని సృష్టించారు. ఆయుధాలతో ఇరాన్‌పై గెలవలేక ఇప్పుడు ఆ దేశాన్ని మరిన్ని ఆంక్షల చట్రంలోకి నెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఇక శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న చైనా డాలర్ ఆధిపత్యానికి గండికొట్టాలని చూస్తోంది. గతంలో ట్రంప్ టారిఫ్‌లకు ప్రతిసుంకాలతో గట్టిగా బదులిచ్చిన బీజింగ్ కీలక ఖనిజ సరఫరాలను నియంత్రించి అగ్రరాజ్యం వెనక్కి తగ్గేలా చేసింది. కాబట్టి ప్రతిపాదిత నూతన సుంకాలతో చైనాను నిలువరించడమూ అమెరికాకు అంత సులభసాధ్యం కాదు! ఇండియాఅమెరికా వాణిజ్య ఒప్పందం త్వరలో ఒక కొలిక్కి రానుందన్న కథనాలు వెలువడుతున్నాయి. అందులో తనకు అనుకూలమైన నిబంధనల కోసం భారత్‌పై ఒత్తిడి పెంచాలన్న అగ్రరాజ్య కుటిల తలంపే తాజా బిల్లులో కనిపిస్తోంది. అమెరికాతో ఒప్పందం వల్ల దేశీయ రైతులు, వ్యాపారులు, చిన్న పరిశ్రమలకు ఎలాంటి నష్టం కలగకుండా చూస్తామని కేంద్రం ఇప్పటికే స్పష్టంచేసింది. విదేశాల నుంచి చమురు కొనుగోళ్ల విషయంలో భారతావని ఇంధన భద్రతకే ప్రాధాన్యమిస్తామని మొన్న కూడా తేల్చిచెప్పింది. ఆ మేరకు అమెరికాతో సంప్రదింపులు సాగిస్తూనే కీలక రంగాల్లో స్వావలంబన సాధనపై ప్రభుత్వం మరింతగా దృష్టిసారించాలి.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
సోమవారం | అనంతపురం | 21.09.2026 | 01


# క్యూఆర్ కోడ్ ద్వారా సమస్యల పరిష్కార అభిప్రాయాలను తెలపాలి.

**- జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్....**

**పుట్టపర్తి రూరల్, సెప్టెంబర్ 20 అనంత జన శక్తి న్యూస్.**



ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై తమ అభిప్రాయాలను, స్పందనను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ నిర్వహణలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంతో పాటు ప్రజా సంతృప్తిని నిరంతరం సమీక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నూతన విధానాన్ని తీసుకొచ్చిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా, మండల స్థాయిలోని అన్ని పీజీఆర్ఎస్ కేంద్రాల వద్ద, వివిధ శాఖల ద్వారా అర్జీలు, సర్వేలు, దరఖాస్తు స్వీకరణ కౌంటర్ల వద్ద ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారులు పీజీఆర్ఎస్ సేవలు పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సేవలపై ఫీడ్‌బ్యాక్ సమర్పించవచ్చని తెలిపారు. ప్రతి సోమవారం రేవెన్యు భవన్తో పాటు మండల కార్యాలయాల్లో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో అర్జీలు సమర్పించి, అనంతరం ఫీడ్‌బ్యాక్ అందించడం ద్వారా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. దరఖాస్తుల స్థితిగతులను తెలుసుకునేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు కాల్ చేయవచ్చని సూచించారు.

# డిసెంబర్ నాటికి .... రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయడమే లక్ష్యం

**- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**

**- వర్షాన్నిసైతం లెక్కచేయకుండా క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన మంత్రి**

**- రింగ్ రోడ్డు పూర్తితో బనగానపల్లె పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం: మంత్రి**

**బనగానపల్లె సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**



బనగానపల్లె రింగ్ రోడ్డు నిర్మాణ పనులను రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాయిబాబా ఆలయం నుంచి రవ్వలకొండ వరకు కొనసాగుతున్న రింగ్ రోడ్డు పనులను పరిశీలించిన మంత్రి.. పనుల పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రింగ్ రోడ్డు నిర్మాణ పనులు ఇప్పటికే దాదాపు 80 శాతం పూర్తయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. రూ.56 కోట్ల అంచనా వ్యయంతో 10.68 కి.మీ. పొడవున నిర్మిస్తున్న ఈ రింగ్ రోడ్డు పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. మిగిలిన పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తయితే బనగానపల్లె పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా భారీ వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి రావడంతో పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని పేర్కొన్నారు.అనంతరం మంత్రి బనగానపల్లె పట్టణంలోని ప్రధాన కూడళ్లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీకి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలు, వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.బనగానపల్లె పట్టణ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రింగ్ రోడ్డు పూర్తితో పట్టణానికి మెరుగైన రహదారి అనుసంధానం ఏర్పడటంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ట్రాఫిక్ నిర్వహణ మరింత సులభతరం కానుందని పేర్కొన్నారు.

# మంత్రిపై అవాకులు చెవాకులు పేలితే సహించేది లేదు-గిరిధర్ రెడ్డి.



**- ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి స్వీట్ వార్నింగ్**

**నెల్లూరు సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**

పేదల కోసం పనిచేస్తున్న మంత్రి నారాయణపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేసిన ఆరోపణలకు ఆయన ఘాటుగా కౌంటర్ ఇచ్చారు.నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడండి,అవాకులు, చెవాకులు పేలడం మానకపోతే ప్రజలే బుద్ధి చెబుతారంటూ స్వీట్ వార్నింగ్ ఇచ్చారు.వైఎస్ఆర్సీపీ లో తన పదవిని కాపాడుకునేందుకే చంద్రశేఖర్‌రెడ్డి ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.చెత్తపై పన్ను వసూలు చేసిన ఘనత వైసీపీదేనన్నారు.ఐదేళ్ల పాలనలో అభివృద్ధిని గాలికి వదిలేశారని ఆరోపించారు.మంత్రి నారాయణ వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతుంటే ఓర్వలేక విషప్రచారం చేస్తున్నారని అన్నారు.వైసీపీ హయాంలో ప్రతీ పనికి 50 శాతం కమీషన్లు తీసుకునేవారని,అదే విధానం ఇప్పుడు కూడా ఉంటుందని అనుకోవడం పొరపాటని గిరిధర్‌రెడ్డి అన్నారు.మంత్రి నారాయణపై ఆరోపణలు చేసే ముందు అవి ప్రజలు నమ్ముతారా లేదా అన్నది ఆలోచించుకోవాలని సూచించారు. నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలు మానుకుని వాస్తవాలు మాట్లాడాలని హితవు పలికారు.త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఎవరి పనితీరును ఎలా అంచనా వేస్తారో ఫలితాల్లో తెలుస్తుందని అన్నారు.

# అల్జీమర్స్: తొలిదశలో గుర్తిస్తే ఎంతో మేలు

**- "త్వరగా తెలుసుకుంటే.. మరింత చేయగలం"**

**- డా. పి. కార్తీక్ రెడ్డి**

**- కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్**

**- కిమ్స్ సవీర, అనంతపురం**

**అనంతపురం సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**

అల్జీమర్స్ వ్యాధి మెదడుకు సంబంధించిన క్రమంగా తీవ్రమయ్యే సమస్య. ఇది మతిమరుపు, ఆలోచనా శక్తి, ప్రవర్తనతో పాటు రోజువారీ పనులు చేసుకునే సామర్థ్యాన్ని కూడా క్రమంగా ప్రభావితం చేస్తుంది. డిమెన్షియాకు అల్జీమర్స్ ప్రధాన కారణం. ఇది వృద్ధాప్యంలో సహజంగా వచ్చే మతిమరుపు కాదు. అల్జీమర్స్‌పై అవగాహన కల్పించడం, అపోహలను తొలగించడం, బాధితులు సకాలంలో వైద్య సహాయం పొందేలా ప్రోత్సహించడం కోసం ప్రతి సెప్టెంబరులో ప్రపంచ అల్జీమర్స్ మాసాన్ని నిర్వహిస్తున్నారు. సెప్టెంబరు 21న ప్రపంచ అల్జీమర్స్ దినోత్సవాన్ని పాటిస్తారు. ''ది ఎర్లియర్ యూ నో, ది మోర్ యూ కెన్ డూ: ఎ డిమెన్షియా డయాగ్నోసిస్ మ్యాటర్స్'' అనేది 2026 నాటి ప్రధాన సందేశం. వ్యాధిని తొలిదశలోనే గుర్తించి, సకాలంలో అవసరమైన సహాయం అందించాల్సిన ప్రాధాన్యాన్ని ఇది తెలియజేస్తోంది.

**మతిమరుపును వయసు ప్రభావంగా కొట్టిపారేయొద్దు**

వయసు పెరిగేకొద్దీ అప్పుడప్పుడు ఒకరి పేరు గుర్తుకు రాకపోవడం, వస్తువులను ఎక్కడో పెట్టి వెతుక్కోవడం వంటివి జరగొచ్చు. అయితే మతిమరుపు తరచుగా రావడం, రోజురోజుకూ పెరుగుతుండటం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు. ఒకే విషయాన్ని పదేపదే అడగడం, ఇటీవల జరిగిన సంభాషణలు లేదా సంఘటనలను మర్చిపోవడం, తేదీలు లేదా పరిచయమైన ప్రదేశాల విషయంలో గందరగోళానికి గురికావడం, గతంలో అలవాటైన పనులు చేయడంలో ఇబ్బంది పడటం, డబ్బు వ్యవహారాల్లో అసాధారణ నిర్ణయాలు తీసుకోవడం, వ్యక్తిత్వం లేదా ప్రవర్తనలో మార్పులు రావడం వంటివి హెచ్చరిక సంకేతాలు కావచ్చు. ఇలాంటి లక్షణాలు కొన్ని నెలలుగా కొనసాగుతున్నా, రోజువారీ పనులపై ప్రభావం చూపుతున్నా.. ''వయసు వల్లే'' అని వదిలేయకుండా న్యూరాలజిస్టును సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

**మతిమరుపుతో పాటు ఇతర సమస్యలూ..**

అల్జీమర్స్ అంటే కేవలం మతిమరుపు మాత్రమేనని చాలామంది భావిస్తారు. అయితే వ్యాధి ముదిరే కొద్దీ మాట, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, సమస్యలను పరిష్కరించే శక్తి, ప్రవర్తన, స్వతంత్రంగా జీవించే సామర్థ్యం కూడా ప్రభావితమవుతాయి. గతంలో ఇంటి ఆర్థిక వ్యవహారాలను చక్కగా చూసుకునే వ్యక్తి అకస్మాత్తుగా లెక్కల్లో తప్పులు చేయవచ్చు. ఒంటరిగా ప్రయాణాలు చేసేవారు పరిచయమైన ప్రదేశాల్లోనే దారి మర్చిపోవచ్చు. రోజూ చేసే సాధారణ పనులు కూడా కష్టంగా అనిపించవచ్చు. ఈ మార్పులు బాధితులతో పాటు వారిని చూసుకునే కుటుంబ సభ్యులకూ ఇబ్బందికరంగా ఉంటాయి.

**ఎవరికి ముప్పు ఎక్కువ?**

వయసు పెరగడం అల్జీమర్స్‌కు ముఖ్యమైన ప్రమాద కారకం. జన్యుపరమైన అంశాలు, కుటుంబ చరిత్ర కూడా ప్రభావం చూపవచ్చు. అయితే కొన్ని ఆరోగ్య, జీవనశైలి అంశాలను నియంత్రించుకోవచ్చు. మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం, శారీరక శ్రమ లేకపోవడం, ధూమపానం, తలకు గాయాలు కావడం వంటి అంశాలు జ్ఞాపకశక్తి తగ్గడం, డిమెన్షియా ముప్పుతో సంబంధం కలిగి ఉన్నాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అందువల్ల రక్తపోటు, రక్తంలో చక్కెరను అదుపులో ఉంచుకోవడం, ఆరోగ్యకరమైన బరువును కొనసాగించడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, పొగతాగడం మానేయడం, తలకు గాయాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం మెదడు ఆరోగ్యానికి ఉపయోగపడతాయి.

**వ్యాధిని ఎలా గుర్తిస్తారు?**

అల్జీమర్స్‌ను గుర్తించడానికి అందరికీ వర్తించే ఒకే ఒక్క పరీక్ష లేదు. ముందుగా వ్యక్తి ఆరోగ్య చరిత్ర, లక్షణాలు, రోజువారీ పనితీరును వైద్యులు పరిశీలిస్తారు. అవసరాన్ని బట్టి జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యానికి సంబంధించిన పరీక్షలు, నరాల వ్యవస్థ పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఎంఆర్ఐ లేదా సీటీ స్కాన్, అవసరమైన రక్త పరీక్షలను సూచించవచ్చు.మతిమరుపు, ఆలోచనా సామర్థ్యం తగ్గడానికి ఇతర వైద్య కారణాలు కూడా ఉండొచ్చు. వాటిలో కొన్ని ప్రత్యేక చికిత్సతో మెరుగుపడే అవకాశముంది. అందుకే తొలిదశలోనే వైద్య పరీక్షలు చేయించుకోవడం ముఖ్యం.

**చికిత్సతో ప్రయోజనం ఉంటుందా?**

అల్జీమర్స్‌ను పూర్తిగా నయం చేసి, వ్యాధిని తిరగదోడే సార్వత్రిక చికిత్స ప్రస్తుతం లేదు. అయితే సరైన వైద్య సంరక్షణతో లక్షణాలను నియంత్రించడంలో, సాధ్యమైనంత కాలం స్వతంత్రంగా జీవించేలా చేయడంలో, బాధితులు మరియు వారిని చూసుకునే కుటుంబ సభ్యుల జీవన నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడవచ్చు.నిపుణుల సూచన మేరకు మందులు, జ్ఞాపకశక్తి మరియు ప్రవర్తనకు సంబంధించిన చికిత్సా విధానాలు, ఇతర ఆరోగ్య సమస్యలకు తగిన చికిత్స అందించవచ్చు.జీవనశైలిలో మార్పులూ ముఖ్యమే. క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం, తగినంత నిద్రపోవడం, సమతుల ఆహారం తీసుకోవడం, పుస్తకాలు చదవడం, పజిల్స్ వంటి మానసిక ఉద్దీపన కలిగించే కార్యకలాపాల్లో పాల్గొనడం, హాబీలను కొనసాగించడం, ఇతరులతో సామాజిక సంబంధాలను కొనసాగించడం మెదడు ఆరోగ్యానికి తోడ్పడతాయి.

**ముందుగానే గుర్తిస్తే ఎందుకు ముఖ్యం?**

అల్జీమర్స్ నిర్ధారణ కుటుంబానికి ఆందోళన కలిగించవచ్చు. అయితే వ్యాధి తొలిదశలోనే గుర్తిస్తే పరిస్థితిని అర్థం చేసుకునేందుకు, భవిష్యత్తులో అవసరమయ్యే సంరక్షణపై ప్రణాళిక చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇతర ఆరోగ్య సమస్యలను నియంత్రించుకోవడం, భవిష్యత్తుకు సంబంధించిన వ్యక్తిగత, ఆర్థిక నిర్ణయాలను తీసుకోవడం వంటి విషయాల్లోనూ ఇది ఉపయోగపడుతుంది.ముఖ్యంగా బాధితుడు నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం ఉన్నప్పుడే కుటుంబంతో కలిసి అవసరమైన ప్రణాళికలు



చేసుకునే అవకాశం ఉంటుంది. అదే సమయంలో వైద్యులు తొలిదశలోనే తగిన చికిత్స, సహాయక చర్యలను పరిగణనలోకి తీసుకోవచ్చు.

**మతిమరుపు కనిపిస్తే.. నిర్లక్ష్యం వద్దు**

ప్రతి చిన్న మతిమరుపునూ అల్జీమర్స్‌గా భావించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అదే సమయంలో మతిమరుపు క్రమంగా పెరుగుతుంటే మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు.కుటుంబంలో వృద్ధులు ఇటీవల జరిగిన విషయాలను పదేపదే మర్చిపోతున్నా, ఒకే ప్రశ్నను మళ్లీ మళ్లీ అడుగుతున్నా, పరిచయమైన ప్రదేశాల్లో దారి తప్పుతున్నా, రోజూ చేసే సాధారణ పనులు చేయడంలో ఇబ్బంది పడుతున్నా.. వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించాలి. తొలిదశలో గుర్తించడం అంటే మతిమరుపు ఉన్న ప్రతి ఒక్కరికీ అల్జీమర్స్ ఉందని కాదు. అసలు సమస్య ఏమిటో తెలుసుకుని, బాధితుడికి, కుటుంబానికి సరైన సమయంలో తగిన చర్యలు తీసుకునే అవకాశం కల్పించడమే.

# ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధికి ప్రాధాన్యత



**- రూ.40 లక్షలతో అయోధ్య రామ మందిర నిర్మాణానికి భూమిపూజ చేసిన మంత్రి సవిత**

**సోమందేపల్లి సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**

పెనుకొండ నియోజకవర్గంలో ఆధ్యాత్మిక, ధార్మిక క్షేత్రాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. సోమందేపల్లి మండల కేంద్రంలో టీటీడీ నిధులతో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న అయోధ్య రామ మందిరానికి ఆదివారం మంత్రి సవిత భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం సాకారం కావడం దేశ ప్రజలందరికీ గర్వకారణమన్నారు. అదే స్ఫూర్తితో పెనుకొండ నియోజకవర్గంలోనూ ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా టీటీడీ నిధులతో నాలుగు మందిరాలు మంజూరయ్యాయని, అందులో భాగంగా సోమందేపల్లిలో రూ.40 లక్షలతో రామ మందిర నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు తెలిపారు. 10 సెంట్ల స్థలంలో రామ మందిరం నిర్మాణం చేపడుతున్నామని, టీటీడీ ద్వారా రామ మందిర నిర్మాణానికి భూమిపూజ నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా టీటీడీ ద్వారా త్వరలో 16 భజన మందిరాలకు అనుమతులు రానున్నాయని, అనుమతులు వచ్చిన వెంటనే వాటి నిర్మాణాలను పూర్తి చేస్తామని చెప్పారు.నియోజకవర్గంలోని పలు ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు మంత్రి వివరించారు. పరిగి వెంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.1.08 కోట్లు, వడిగేపల్లి అమ్మవారి గోపురం నిర్మాణానికి రూ.20 లక్షలు, మరువపల్లి ఆంజనేయస్వామి ఆలయానికి రూ.20 లక్షలు, పెనుకొండ ఐముఖేశ్వర స్వామి దేవాలయానికి రూ.3 కోట్లు, వానవోలు రంగనాథ స్వామి దేవాలయానికి రూ.2 కోట్లు, రాగిమేకలపల్లి ఆంజనేయస్వామి ఆలయానికి రూ.80 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. సోమందేపల్లి మండల కేంద్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని, త్వరలో రూ.3 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేస్తామని మంత్రి సవిత తెలిపారు. అదేవిధంగా చాలకూరు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిను నవంబర్ నాటికి అంతా పూర్తి చేసి ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

**- ఈనెల 21వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ**

**- సోమవారం ఉదయం 10 గంటల నుండి పిజిఆర్ఎస్ నిర్వహణ..**

**- రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలి**

**- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**

**అనంతపురం, సెప్టెంబర్ 20 : అనంత జనశక్తి న్యూస్**



మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

**ఈనెల 21వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ :**

ఈనెల 21వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 10:00 నుండి నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. సోమవారం ఉదయం 10:00 నుండి పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ డేను నిర్వహించడం జరుగుతుందన్నారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం 10:00 నుండి పూర్తి అయ్యే వరకు డివిజన్, మండల మరియు ఎస్.జి.ఎస్.డబ్ల్యూ స్థాయిలలో పి.జి.ఆర్.ఎస్. గ్రీవెన్స్ డేను నిర్వహించాలని ఆర్.డి.ఓలు, తహసీల్దార్లు మరియు పి.డి.ఓలకు సూచించడమైనది.

# 21 న రేవెన్యు భవన్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక .

**- కలెక్టర్ శ్యాం ప్రసాద్...**

**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 20 అనంత జన శక్తి న్యూస్.**

**శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలో గల రెవెన్యూ భవన్ (ఎస్.ఆర్. శంకరన్ హాల్) లో రేపు జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుంది.ప్రజలు ఈ మార్పును గమనించి సంబంధిత వేదికకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ కోరారు.ఈ నెల 21న సోమవారం ఉదయం శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ దరఖాస్తులను జిల్లా రేవెన్యు భవన్కు వచ్చే అవసరం లేకుండా "meekosam.ap.gov.in" లో ఆన్లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చునన్నారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో ప్రస్తుత సమాచారం ఆన్లైన్లో తెలుస్తుందని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు.**

# ఉపాధ్యాయుని వివాహానికి హాజరైన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



- మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించిన అక్రమ్ బాషా
- ప్రత్యేక ఆహ్వానం మేరకు బాషా వివాహానికి హాజరైన ఎమ్మెల్యే
- ఉద్యోగం వచ్చాక తన వివాహం ఖరారు అయిందన్న అక్రమ్ బాషా
- కూటమి ప్రభుత్వానికి, నారా లోకేష్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ఉపాధ్యాయుడు బాషా

**అనంతపురం సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**

మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన అభ్యర్థి వివాహానికి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హాజరయ్యారు.అనంతపురం నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డుకు చెందిన ఎంఎస్ అక్రమ్ బాషా బిటెక్ తో పాటు డిఎడ్ చదివారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపికయ్యారు.ఉపాధ్యాయ పోస్టు వచ్చిన తర్వాత బాషాకు మంచి సంబంధం కుదిరింది. వీరి వివాహానికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈనేపథ్యంలో శిల్పారామంలో జరిగిన అక్రమ్ భాష వివాహానికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హాజరయ్యారు. వధూవరులను ఆయన ఆశీర్వదించారు. మెగా డీఎస్సీలో ఉద్యోగం వచ్చిన తర్వాతనే నాకు వివాహం నిశ్చమైందని ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో అక్రమ్ బాషా తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ మెగా డీఎస్సీ ద్వారా 16వేల 347మందికి ఉద్యోగాలు వచ్చాయని.. ఇది మంత్రి నారా లోకేష్ వలనే జరిగిందన్నారు. ఇందులో ఉద్యోగాలు సంపాదించిన వారి జీవితాలు కూడా మారిపోయాయన్నారు.



# మంత్రి నారా లోకేష్ పర్యటన భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ

- రాప్తాడులో పలు ప్రాంతాలను పరిశీలించిన ఎస్పీ జగదీష్
- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత, జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజు, పరిటాల శ్రీరామ్
- బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపుపై ఎస్పీ సూచనలు
- అన్ని విభాగాలతో సమన్వయం ఏర్పాటు చేస్తున్నామన్న సునీత, శ్రీరామ్

**అనంతపురం సెప్టెంబర్ 20,అనంత జనశక్తి న్యూస్**

ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాప్తాడు పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ జగదీష్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈనెల 22న ఎన్టీఆర్, పరిటాల రవి కాంశ్య విగ్రహాల ఆవిష్కరణకు మంత్రి నారా లోకేష్ రానున్నారు. ఈ నేపథ్యంలోజిల్లా ఎస్పీ జగదీష్ రాప్తాడులోని పలు ప్రాంతాలను పరిశీలించారు. రాపాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్, శ్రీ సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎంఎస్ రాజులతో ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. విగ్రహాల ఆవిష్కరణ, కార్యకర్తల సమావేశ ప్రాంగణం, భోజన ఏర్పాటు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ.. మంత్రి పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కార్యక్రమానికి భారీగా ప్రజలు, పార్టీ శ్రేణులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రాకపోకలకు ఆటంకం కలగకుండా ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, ఎమ్.ఎస్.రాజు మాట్లాడుతూ విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవాన్ని దిగ్విజయం చేసేందుకు అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా కార్యకర్తలు, అభిమానులు తరలిరానున్న నేపథ్యంలో అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు...



# మండల వ్యాప్తంగా భారీ వర్షం.....

**యల్లనూరు సెప్టెంబరు 29, అనంత జనశక్తి న్యూస్;**

మండల వ్యాప్తంగా శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. అధికారుల రికార్డుల ప్రకారం 69.6 మిల్లీల వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. వర్షం రాకతో రైతుల్లో ఎనలేని ఆనందం నెలకొంది. సకాలంలో కురవాల్సిన వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్ లో సాగు చేయాల్సిన పంటలన్నీ సాగు చేయలేకపోవడం, సాగుచేసిన ఉద్యాన పంటలు అన్ని నీటి కొరతతో ఎండుముఖం పట్టడం రైతుల్లో తీవ్ర ఆందోళన గురి చేసింది. శనివారం రాత్రి ఏకధాటిగా ఒకే మోతాదులో 12 గంటల పాటు కురిసిన వర్షం రైతులకు ఊపిరిని పోసింది.



## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో

# అభివృద్ధి పథంలో రాష్ట్రం

- అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వైకాపా నుంచి టీడీపీలోకి 28 కుటుంబాలు చేరిక
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో జగన్నాధపురం నుంచి భారీ చేరికలు

**కోటబొమ్మాళి సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వైకాపాను వీడి టీడీపీలో చేరుతున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు, సంతబొమ్మాళి మండలం జగన్నాధపురం పంచాయతీకి చెందిన 28 కుటుంబాలు వైకాపాను వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వ పాలనలో జరుగుతున్న మార్పులు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా గమనించిన ప్రజలు టీడీపీ వైపు వస్తున్నారని అన్నారు, జగన్నాధపురం మాజీ సర్పంచ్ పుక్కళ్ల శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షుడు మెండ అప్పారావు, ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సంతబొమ్మాళి మండల టీడీపీ అధ్యక్షుడు సుగ్గు శాంతిస్వరూప్‌రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ టీడీపీ కుటుంబంలోకి చేరిన 28 కుటుంబాలకు స్వాగతం పలికారు. “పార్టీలో చేరిన ప్రతి కుటుంబానికి అండగా ఉంటాం. ఎలాంటి సమస్య వచ్చినా మీకు భరోసాగా నిలుస్తాం. పార్టీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా పనిచేద్దాం” అని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు,చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. రైతులు, మహిళలు, విద్యార్థులు, పేదలు, వృద్ధులకు వివిధ సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రయోజనం కల్పించడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు, గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి వైకాపాను వీడి టీడీపీలో చేరుతున్నామని పార్టీలోకి వచ్చిన 28 కుటుంబాల ప్రతినిధులు తెలిపారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.అర్జాల బాలరాజు,అర్జాల అప్పలస్వామి,అర్జాల శివ,కోడ గురుమూర్తి,కోడ ధనరాజు,అడ్ల దాలయ్య,చోడిపల్లి ముసలయ్య,చోడిపల్లి,ధర్మారావు,పి. రామ్మూర్తి,గనగల్ల గురమ్మ,పుక్కళ్ల పొల్లమ్మ,కె. అప్పలస్వామి,భగవాన్ దాస్ చోడిపల్లి,కొడా గురుమూర్తి,అడ్ల లక్ష్మణరావు,కొమర రామారావు,మైలపల్లి లక్ష్మణరావు,ముట్టు లక్ష్మణరావు అనుపల్లి కామేశ్వరరావు,చోడిపల్లి రమారావు,సాహుకారి వెంకటరావు,అనుపల్లి కామరాజు,లండ సీతారాములు చోడిపల్లి యర్రయ్య,కె. ముసలయ్య,నైనమ్మ గంట ,వరది సత్యం, ఎం. నాయనమ్మ పార్టీలో చేరారు,

# చెత్తపై సమరం స్వచ్ఛాంధ్రే లక్ష్యం

- మంత్రి నారాయణ.
- దొంతాళి డంపింగ్ యార్డులో మంత్రి నారాయణ పర్యటన.
- ఏడాదిన్నరలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ పూర్తి చేయాలని ఆదేశం

**నెల్లూరు సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**



గత ప్రభుత్వ నిర్వాకంతో పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించి ఎపిని స్వచ్ఛాంధ్రగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ పరిధిలోని దొంతాళి డంపింగ్ యార్డును అదివారం ఆయన పరిశీలించారు. అక్కడ జరుగుతున్న చెత్త ప్రాసెసింగ్ పనులను పర్యవేక్షించారు. జిందాల్ కంపెనీ సౌత్ అండ్ వెస్ట్ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ ఎం.వి.చారి వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ డిజైన్, నిర్మాణ ప్రణాళికను మంత్రికి వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం చెత్త నిర్వహణలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజలపై చెత్తపన్ను వేసి, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 153 లక్షల టన్నుల చెత్తను కుప్పలుగా వదిలి వెళ్లిందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో గత ఏడాది అక్టోబర్ 2 నాటికి గ్రౌండ్ లెవల్‌లో ఉన్న 85 లక్షల టన్నుల చెత్తను తొలగించామని తెలిపారు. గ్రౌండ్ లెవల్ కంటే కింద ఉన్న చెత్తలో ఇప్పటివరకు 58 లక్షల టన్నులు తొలగించామని, మరో 10 లక్షల టన్నుల చెత్తను అక్టోబర్ 2లోపు పూర్తిగా క్లియర్ చేస్తామని చెప్పారు. మరో 10 లక్షల టన్నుల చెత్త ప్రస్తుతం ప్రాసెసింగ్ అవుతోందన్నారు.

**వేస్ట్ టు ఎనర్జీకి కొత్త ఊపు**

గుంటూరు, విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లలో రోజుకు సుమారు 2,800 టన్నుల చెత్తను బర్న్ చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని మంత్రి తెలిపారు. 2014లో మంజూరు చేసిన పలు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను గత పాలకులు రద్దు చేశారని, అవన్నీ పూర్తయి ఉంటే రాష్ట్రంలో రోజూ ఉత్పత్తయ్యే సుమారు 7 వేల టన్నుల చెత్తను అదే రోజు ప్రాసెస్ చేసే అవకాశం ఉండేదన్నారు.అవగాహన, దూరదృష్టి లేకపోవడం వల్ల గత పాలకులు చెత్త నిర్వహణకు అవసరమైన ప్లాంట్ల ఏర్పాటును నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి మరో ఆరు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లకు అనుమతులు ఇచ్చారని, వాటి పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా 107 ప్రాసెసింగ్ ప్లాంట్ల పనులు జరుగుతున్నాయని, ఇప్పటికే కొన్ని ప్లాంట్లను ప్రారంభించామని వెల్లడించారు. దొంతాళిలో జిందాల్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను ఏడాదిన్నరలో పూర్తి చేయాలని అధికారులను, సంస్థ ప్రతినిధులను ఆదేశించారు.ఈ ప్లాంట్ అందుబాటులోకి వచ్చిన తర్వాత 100 కిలోమీటర్ల పరిధిలోని చెత్తను రోజువారీగా సేకరించి అదే రోజు బర్న్ చేసి విద్యుత్ ఉత్పత్తి చేసే విధానం అమల్లోకి వస్తుందని తెలిపారు. చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో ఆంధ్రప్రదేశ్‌ను చెత్తరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గణేశా.. గంగమ్మ ఎక్కడ?

**అగళి సెప్టెంబర్ 20,అనంత జనశక్తి న్యూస్:**

ఈ ఏడాది వినాయక నిమజ్జనోత్సవాలు పెద్ద సమస్యగా మారాయి. ఎల్ నినో ప్రభావంతో వర్షాల్లేక చెరువులు ఎండిపోయాయి. నదులన్నీ చుక్కనీరు లేక వెలవెలబోతున్నాయి. విగ్రహాలను ఎక్కడ నిమజ్జనం చేయాలో తెలియక ఉత్సవ కమిటీలు తర్జబర్జన పడుతున్నాయి. అగళి మండలంలో అయాయ చెరువులలో వినాయక విగ్రహాలను గంగమ్మ ఒడికి చేర్చేవారు. వర్షాభావ పరిస్థితులతో ఈసారి చెరువులు నీరు లేక బోసిపోయాయి. ఎన్నడూ ఈ పరిస్థితి లేదు. వినాయక నిమజ్జనోత్సవాలకు చెరువులో నీరు లేకపోవడం భక్తులను కలవరపరుస్తోంది. ఏటా మాదిరిగానే ఈసారి కూడా వాడవాడలా విగ్రహాలు నెలకొల్పి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పూజలందుకుంటున్న భారీ వినాయక విగ్రహాలను ఎక్కడికి తీసుకువెళ్లి నిమజ్జనం చేయాలో తెలియక నిర్వాహకులు తర్జనభర్జన పడుతున్నారు. కొందరు తొట్టెలను ఆశ్రయిస్తున్నారు.



## శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం పట్టణంలో

# నిమజ్జనం నకు తరలిన విఘ్న వినాయకులు




















# మానవత్వం నుండి దైవత్వానికి...

- ప్రకృతి రక్షణతో పరమోత్కృష్ట స్థానానికి!
- రాతియోగి భాస్కర్ నాయుడు మాస్టర్ అనుభవసారం.
- తప్పక చదవండి షేర్ చేయండి.

**పుట్టపర్తి సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**



సృష్టిలో సమస్త జీవరాశి కంటే మానవ జన్మ అత్యుత్తమమైనది. కానీ, కేవలం జన్మించడమే గొప్పతనం కాదు; ఆ మానవ దేహంతో దైవత్వాన్ని సేవించి, దైవత్వాన్ని పొంది, అంతకంటే గొప్ప పరమోత్కృష్ట స్థానాన్ని చేరుకోవడమే మానవ జీవిత పరమార్థం.1. మానవ దేహంతో దైవత్వం పొందే మార్గం
భగవంతుడు మనకిచ్చిన ఈ మానవ దేహమే ఒక దేవాలయం. సర్వభూతములందు ఉన్న పరమాత్మను గుర్తించి, స్వార్థాన్ని వీడి నిష్కామ కర్మ చేయడం ద్వారా మానవుడు దైవత్వాన్ని పొందుతాడు. యోగం, ధ్యానం, సత్‌చింతనలతో ఆత్మశుద్ధి చేసుకున్న సాధకుడు దైవీ గుణాలైన దయ, కరుణ, అహింస, సమభావాన్ని పెంపొందించుకుని సజీవ దైవంగా మారగలడు.2. దైవత్వం కంటే గొప్ప స్థానం... ప్రకృతి రక్షకుడి స్థానం!దేవుడు సృష్టికర్త అయితే, ఆ సృష్టిని కాపాడేవాడు సృష్టికర్త కంటే గొప్పవాడవుతాడు. దైవాలయం లోపల ఉన్న విగ్రహానికి పూజలు చేయడం దైవభక్తి అనిపించుకోవచ్చు; కానీ, భగవంతుడు సృష్టించిన ఈ సమస్త ప్రకృతిని, పంచభూతాలను రక్షించడం పరమోత్కృష్టమైన సాధన.
వరుణ దేవునికి రక్షకుడు: నీరు జీవనాధారం. నీటిని కలుషితం కాకుండా కాపాడి, నదులను, జల వనరులను సమరక్షించే వ్యక్తి కేవలం నీటిని వాడే సామాన్యుడు కాదు... సాక్షాత్తు 'వరుణ దేవుడికే రక్షకుడు' అవుతాడు.
వాయు దేవునికి రక్షకుడు: మనం పీల్చే గాలిని కాలుష్యం కాకుండా నివారించి, స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందించేలా మొక్కలు నాటి ప్రకృతిని కాపాడే సాధకుడు, సాక్షాత్తు 'వాయు దేవుడికే రక్షకుడు'గా నిలుస్తాడు.

**భూమాతకు రక్షకుడు:**
సమస్త జీవులకు ప్రాణాధారమైన భూమిని రసాయనాలు, ప్లాస్టిక్ కాలుష్యం నుండి కాపాడి, పచ్చదనంతో నింపే పర్యావరణవేత్త కేవలం భూమిపై నివసించే వ్యక్తి మాత్రమే కాదు... ఈ 'భూమికే రక్షకుడు' అవుతాడు.ముగింపు
పంచభూతాలైన నీరు, గాలి, భూమిలను దేవతలుగా భావించి పూజించడం మన సంస్కృతి. అయితే, కాలుష్య కాసారంలో చిక్కుకున్న ఆ పంచభూతాలను రక్షించడం ద్వారా మానవుడు దేవతలకే రక్షకుడిగా, అనగా దైవత్వం కంటే ఉన్నతమైన,అత్యున్నతమైన స్థానాన్ని పొందుతాడు. పర్యావరణ రక్షణే అత్యుత్తమ రాజయోగం! ప్రకృతి సేవే పరమాత్మ సేవ!

# మధ్యదళారీలను చేనేత కార్మికులు నమ్మకండి

- నేరుగా జౌళి శాఖ ను సంప్రదించండి
- అనంతపురం జిల్లా జౌళి శాఖ ఎడి బసవరాజు

**యాడికి, సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్ :**



అనంతపురం జిల్లా లో ఉన్న చేనేత కార్మికులు మధ్య దళారీలను నమ్మకండి అని అనంతపురం జిల్లా జౌళి శాఖ ఎడి బసవరాజు తెలిపారు. ఆదివారం అనంతపురం జిల్లా జౌళి శాఖ ఎడి బసవరాజు మాట్లాడుతు మధ్య దళారీలు చేనేత కార్మికుల నుండి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని, చేనేత కార్మికులు ఎవరు మధ్య దళారీలకు డబ్బులు ఇవ్వరాదని,నేరుగా జౌళి శాఖ కార్యాలయం ను చేనేత కార్మికులు సంప్రదించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం "ఉచిత విద్యుత్ ", "నేతన్న సేవ పథకం "ను అమలు చేశారని,50 సంవత్సరాల నిండిన చేనేత కార్మికులు కోసం ఎన్టీఆర్ భరోసా పథకం కింద చేనేత కార్మికుల ఫించన్ ను రాష్ట్ర ప్రభుత్వం అందచేస్తున్నారని తెలిపారు. చేనేత కార్మికులు "చేనేత సర్టిఫికెట్" కోసం, ఉచిత విద్యుత్ కోసం కూడా నేరుగా చేనేత జౌళి శాఖ వచ్చి సంప్రదించాలని తెలిపారు. మీ దరఖాస్తులను పరిశీలించి, చేనేత సర్టిఫికెట్ ను మంజూరు చేస్తామని తెలిపారు. మధ్య దళారీలను నమ్మి మోసపోకండి అని తెలిపారు.

# రాయలసీమ జిల్లాలపై వరుణుడి కరుణ





- ఇన్నాళ్లకు గుర్తొచ్చానా వాన..!
- వర్షం రాకతో అన్నదాతల్లో ఆనందం
- పొంగిపొర్లిన వాగులు, వంకలు.. పలుచోట్ల పంటలకు నష్టం
- వర్షా భావంతో నష్టపోయిన రైతులకు కొంత ఊరట

**అనంతపురం సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**

"ఇన్నాళ్లకు గుర్తొచ్చావా వానా..!" అంటూ రాయలసీమ రైతులు, ప్రజలు వర్షాన్ని ఆహ్వానిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి రాయలసీమ జిల్లాల్లో కురిసిన విస్తారమైన వర్షాలు అన్నదాతల్లో ఆనందాన్ని నింపాయి. వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పలుచోట్ల జలకళ సంతరించుకుంది. వర్షానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేసుకుంటూ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నైరుతి రుతుపవనాలు సకాలంలో ప్రవేశించినప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా జూలై, ఆగస్టు నెలల్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా కంది, వేరుశనగ తదితర పంటలు సాగు చేసిన రైతులు నష్టాలను చవిచూశారు. అరటి, మొక్కజొన్న, టమాట, చీని, దానిమ్మ తదితర ఉద్యాన పంటలకు కూడా తగినంత నీరు అందక దిగుబడులు దెబ్బతిన్నాయి.భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోర్లు, బావులపై ఆధారపడిన రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడ్డారు. చెరువులు, వాగులు, వంకల్లో నీటి జాడ లేకపోవడంతో పలు ప్రాంతాల్లో వినాయక నిమజ్జనానికి సైతం అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాయలసీమలో వాతావరణం ఒక్కసారిగా మారింది. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, చిత్తూరు, తిరుపతి, ఉమ్మడి కడప జిల్లాల్లో పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో ఎండిపోయిన వాగులు, వంకలు మళ్లీ ప్రవహించడంతో రైతులు, ప్రజలు కొంత ఊరట పొందారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షం సగటు 43.5 కిలోమీటర్ల గా నమోదయింది. అత్యధికంగా యాడికి మండలంలో 97.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుగా , డి హీరేహాల్ , రాయదుర్గం , గుమ్మగట్ట, బ్రహ్మసముద్రం మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు. మొత్తం 32 మండలాలలో బొమ్మనహాళ్ , పామిడి , యాడికి మండలంలో అత్యధికంగా 80 మిల్లీమీటర్ల పైగా వర్షపాతం నమోదయింది.

**జలమయమైన పట్టణాలు**
అనంతపురం జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాల్లో భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. తాడిపత్రి, అనంతపురం, గుంతకల్లు, కళ్యాణదుర్గం, తదితర పట్టణాల్లో మంచి వర్షం కురిసింది. అనంతపురం నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలవడంతో విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుంతల్లో నీరు చేరడంతో వాహనదారులు అవస్థలు
పడ్డారు.నక్కలపల్లి, అంకంపల్లి గ్రామాల్లో వాగులు పొంగిపొర్లాయి. కంబదూరు మండలం తూర్పు భాగంలోని పెన్నానది పరివాహక గ్రామాల్లో కురిసిన వర్షానికి నదిలోకి వర్షం నీరు చేరింది. బత్తలపల్లి, పులివెందుల మండలాల్లో భారీ వర్షాల ప్రభావంతో అరటి తోటలు దెబ్బతిన్నాయి. యాడికి మండలం భోగాలకట్టలో పాత ఇల్లు కూలిపోవడంతో అశ్వత్థమ్మ అనే వృద్ధురాలు మృతి చెందింది. అదే మండలంలోని ఆలూరు కోన వద్ద భారీ వర్షంతో జలపాతం సందర్శకులను ఆకట్టుకుంటోంది.ఉరవకొండ, బళ్లారి పరిసర ప్రాంతాలతో పాటు వజ్రకరూరు, విడపనకల్ ప్రాంతాల్లో పలు పొలాల్లోకి వర్షపు నీరు చేరడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**100 ఎకరాల అరటి తోట నేలమట్టం**
ఆత్మకూరు మండలం సనప గ్రామంలో భారీ వర్షానికి సుమారు 100 ఎకరాల అరటి తోట నేలమట్టమైంది. ఆరు నెలల వయసున్న అరటి పంట పూర్తిగా దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పంటను కాపాడుకునేందుకు చేసిన పెట్టుబడులు నీటిపాలయ్యాయని రైతులు వాపోతున్నారు. గ్రామ రైతులతో కలిసి పొలాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తక్షణమే రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల పంట నష్టాన్ని రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే అంచనా వేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాలను నమోదు చేసి,
యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఇదిలా ఉండగా, చాలా రోజుల తర్వాత తమ గ్రామాల్లో వర్షం కురవడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. "మా ఊర్లో ఇంతకాలానికి వర్షం పడింది" అంటూ బంధువులు, స్నేహితులు ఫోన్‌లలో వర్షపు దృశ్యాలను పంచుకుంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా వర్షం రాక ఒకవైపు రైతులకు ఊరటనిస్తుండగా, మరోవైపు పంటలు, ఇళ్లు, రహదారులకు జరిగిన నష్టంపై ఆందోళన కూడా నెలకొంది.

# ఘనంగా 1995 – 96 పదవ తరగతి మిత్రుల అపూర్వ సమ్మేళనం




**యాడికి (ఉరవకొండ), సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్ :**

w96 పదవ తరగతి మిత్రులు 30 సంవత్సరాల తర్వాత అపూర్వ సమ్మేళన కార్యక్రమం ను పెన్నహోబిళంలో అదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రార్థన గీతం తో ప్రారంభించారు.మరణించిన మిత్రుల ఆత్మ శాంతి కోసం మౌనం పాటించారు. రోజువారీ జీవితంలో బిజీగా ఉండే ప్రతి ఒక్కరూ ఒకచోట చేరి తమ అనుభవాలను, జ్ఞాపకాలను పంచుకోన్నారు. పరస్పర పరిచయాలు, స్నేహభావం, ఆప్యాయ పలకరింపులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఆత్మీయ సమ్మేళనం ద్వారా ఐక్యత, సోదరభావం, పరస్పర సహకారం పెంపొందుతాయని, పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ కొత్త మధుర జ్ఞాపకాలను సృష్టించుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఆనాటి గురువుల జ్ఞాపకాలను గుర్తు చేసుకోని , సంతోషం ను వ్యక్తం చేశారు.మిత్రులు ఒక్కొక్కరిగా తమను పరిచయం చేసుకొని, వారి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకోన్నారు. భవిష్యత్తు కార్యాచరణ చేశారు. సాయంకాలం వందన సమర్పణతో కార్యక్రమం ముగించారు. మిత్రులందరికి భోజన సదుపాయం ను కల్పించారు.ఈ కార్యక్రమంలో 1995 -96 మిత్ర బృందం పాల్గొన్నారు.

# ఉరవకొండలో అన్నింటా పోటీ!

- వైసిపి ఎన్నికల సన్నాహక సమావేశంలో ప్రతిజ్ఞ!

**ఉరవకొండ సెప్టెంబర్ 20,అనంత జనశక్తి న్యూస్**



ఉరవకొండ నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని స్థానాలలో పోటీ చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం ఉరవకొండలో జరిగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం ఎప్పుడు జరగనంత అభివృద్ధి,సంక్షేమం, సంస్కరణలు జగన్ ఐదు సంవత్సరాల కాలంలో చేసి చూపించాడని,అదే నేడు వైసిపి కార్యకర్తలకు మనోధైర్యం,కొండంత బలం.కూటమి అనేక వాగ్దానాలు చేసి ఒక్కటి కూడా పూర్తిగా అమలు జరపకుండా ప్రజలను నట్టేట ముంచిందని,అందువల్ల వైసిపి శ్రేణులు ఉత్సాహంగా మనోబలంతో స్థానిక ఎన్నికలలో పోటీ చేయబోతున్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు జరపకపోవడం, ఉద్యోగులను, నిరుద్యోగులను మోసగించడం,ఎల్ నినో ప్రభావం ఉంటుందని సంవత్సరం ముందే తెలిసినా ముందస్తు చర్యలు తీసుకోకుండా ప్రజలను గాలికి వదిలేసి, జాతీయ విపత్తుగా మార్చేసి,రైతులు,కూలీల ఆత్మహత్యలు,వలసలతో రాష్ట్రమంతా అతలాకుతలమైంది.ఈ సందర్భంగా వైసీపీ సామూహికంగా,ఐక్యంగా పోటీ చేసి గెలవాలని పిలుపునిచ్చారు. ఎక్కడ చూసినా అవినీతి రాజ్యమేలు తున్నదని, అందులో ఉరవకొండ నియోజకవర్గం మంత్రి ఇలా కాలో అవధులు దాటిపోయిందని,ఎక్కడ చూసినా బెల్ట్ షాపులు, క్లబ్బులే కనపడతాయని ఒక్క హంద్రీనీవా పనులలోనే వందల కోట్లు దోచేసారు.నీటి నిర్వహణ చేతగాని దద్దమ్మ ప్రభుత్వం గత సంవత్సరం ఒక్క అనంతపురం జిల్లాకే హెచ్ ఎల్ సి ద్వారా 26 టీఎంసీలు,హెచ్ ఎన్ ఎస్ ఎస్ ద్వారా 30 టీఎంసీలు మొత్తం 56 టీఎంసీలు వస్తే ఏటిపాలు చేసి,నేడు బిక్క మొఖం వేస్తున్నారు. ఈసారి కూడా తుంగభద్ర కు 130 టిఎంసిలు శ్రీశైలం కు 230 టీఎంసీలు నీళ్లు వచ్చినా,సకాలంలో తెచ్చుకోలేక ఒకవైపు, మరోవైపు ఈ రాష్ట్ర పరువు పక్క రాష్ట్రానికి కుదువ పెట్టి,వారు చెప్పినట్లుగా నీటినంతా కిందికి వదిలేసారని,ఇక్కడ కనీసం తడి పంటలకు కూడా నీళ్ళు ఇవ్వలేని పరిస్థితిలో అటు అటు ఐఏబి ఇటు డి ఆర్ సి మీటింగ్ లు కూడా జరపలేక,దొడ్డి దారిలో పోయే పరిస్థితి కలిగింది. అందుకే ప్రజలు ఈ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

అనంతరం వైసిపి నాయకులకు,కార్యకర్తలకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు.తర్వాత ఈ నెల 28వ తేదీన పెద్ద ఎత్తున కరువు పరిస్థితులపై ఉరవకొండలో ధర్నా చేయాలని తీర్మానించారు.ఈ కార్యక్రమంలో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ ఇన్చార్జ్,వై విశ్వేశ్వర్ రెడ్డి.నియోజకవర్గ అబ్జర్వర్,గోవర్ధన్ రెడ్డి. రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి,కేవీ రమణ. జిల్లా అధికార ప్రతినిధి,సిపి వీరన్న. అన్ని మండలాల వైసిపి అధ్యక్షులు ప్రసంగించారు. ఈ సమావేశానికి సురేష్, జగదీష్ అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో ఐదు మండలాల నుంచి జిల్లా, మండల,గ్రామస్థాయి, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# గంగమ్మ ఒడికి ఆర్య వైశ్యుల గణనాథుడు

**అగళి సెప్టెంబర్ 20,అనంత జనశక్తి న్యూస్**



మండలంలోని ఆర్యవైశ్యుల ఆద్వర్యంలో వాసవి మహల్ లో కొలువుదీరిన లంబోదారుడు ఆదివారం గంగమ్మ వడిలోకి పయనమయ్యాడు. ఆర్యవైశ్యులు అందరూ ఏకతాటిపై ఏడు రోజుల పాటు వినాయకునికి వివిధ రకాల పూలతో, వంటలతో, ప్రత్యేక పూజ కార్యక్రమములు నిర్వహించారు. ఆదివారం ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో మేళతాళలతో ఆ గణనాథుని శోభాయమానంగా ఊరేగింపు వెళ్లారు. మడకశిర మార్కెట్ యార్డు డైరెక్టర్, ఆర్యవైశ్యుల ఎం.ఆర్.శివరాములు ప్రత్యేక పూజ కార్యక్రమములో పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణి చేశారు.

# ఏకంగా 2,931 ఏ4 షాపుల పునరుద్ధరణకు ఆసక్తి

- రూ.754.1 కోట్ల ఆదాయం.. 2,113 షాపుల నుంచి చెల్లింపులు
- పునరుద్ధరణ ప్రక్రియలో 1,076 షాపులు పూర్తి.. లక్ష్యం చేరుకుంటామని అధికారుల ధీమా

**అమరావతి, సెప్టెంబరు 20:అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రంలో 2026-27 ఎక్సైజ్ సంవత్సరానికి ఏ4 మద్యం షాపుల పునరుద్ధరణకు మంచి స్పందన లభించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 3,650 ఏ4 షాపుల్లో 2,931 షాపులు, అంటే దాదాపు 80 శాతం, పునరుద్ధరణకు ఆసక్తి చూపాయి. గడువు సెప్టెంబరు 21తో ముగియనుండటంతో అధికారులు మిగిలిన ప్రక్రియను వేగవంతం చేశారు.పునరుద్ధరణకు ముందుకొచ్చిన 2,931 షాపుల్లో 1,458 షాపులు పూర్తిగా చెల్లింపులు పూర్తి చేశాయి. మరో 655 షాపులు పాక్షికంగా చెల్లింపులు చేశాయి. అలాగే 382 షాపులు పూర్తి మొత్తాన్ని చెల్లించినప్పటికీ దరఖాస్తులు సమర్పించాల్సి ఉంది. ఇప్పటికే 798 దరఖాస్తులు సమర్పించగా, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు (డీపీఈవోలు) పరిశీలనలో ఉన్నాయి. మరో 278 షాపులకు డీపీఈవోలు ఆమోదం తెలిపారు. దీంతో
ఇప్పటివరకు మొత్తం 1,076 షాపుల పునరుద్ధరణ ప్రక్రియ పూర్తయింది.మొత్తం 3,650 షాపులతో పోలిస్తే ఇప్పటివరకు పునరుద్ధరణ పురోగతి గణనీయంగా ఉంది. మొత్తం 2,113 షాపుల నుంచి చెల్లింపులు అందగా, ఇప్పటివరకు రూ.754.1 కోట్లను ఎక్సైజ్ శాఖ వసూలు చేసింది. ఇంకా రూ.747.9 కోట్లు వసూలు కావాల్సి ఉంది. గడువు ముగియడానికి ఒక్కరోజు మాత్రమే సమయం ఉండటంతో పెండింగ్‌లో ఉన్న చెల్లింపులు, దరఖాస్తుల సమర్పణ, ఆమోద ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు వచ్చిన స్పందన ఆశాజనకంగా ఉందని, నిర్దేశించుకున్న లక్ష్యాన్ని గడువులోగా సాధిస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేశారు.



# అన్నదానంలో భక్తులతో మమేకమైన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**కోటబొమ్మాళి సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గణేష్ ఉత్సవాల సందర్భంగా తన స్వగ్రామమైన నిమ్మాడలో గ్రామ ప్రజలతో కొద్దిసేపు ముచ్చటించారు. ప్రజా సేవా కార్యక్రమాలతో నిత్యం బిజీగా ఉండే మంత్రి, స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా గ్రామ ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం గ్రామంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు ,శ్రీమతి విజయ మాధవి పాల్గొన్నారు. భక్తులకు స్వయంగా అన్నం వడ్డిస్తూ వారితో ఆప్యాయంగా మమేకమయ్యారు. అనంతరం భక్తులతో కలిసి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, నాయకులు, యువత, భక్తులు మంత్రిని కలుసుకుని ఉత్సవాల ఏర్పాట్లను వివరించారు. మంత్రి వర్యులు వారి కార్యక్రమాలను అభినందిస్తూ, భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్ ,కింజరాపు సురేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు,

# కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఏర్పాట్ల పరిశీలన



- కాన్వాయ్ ట్రయల్ రన్ భద్రతా ఏర్పాట్ల పరిశీలన
- పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ తుషార్ డూడి దిశానిర్దేశం

**కుప్పం సెప్టెంబర్ 20,అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 21, 22 తేదీల్లో కుప్పం పర్యటనకు రానున్న నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఇతర అధికారులు కుప్పం ప్రాంతంలో ఆదివారం పర్యటించారు. భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ ప్రయాణించే మార్గంలో కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. ముఖ్యమంత్రి దిగే హెలిప్యాడ్, పర్యటించే ప్రాంతాలు, బహిరంగ సభ జరిగే ప్రదేశం, సమావేశాలు నిర్వహించే వేదికలు, రైల్వే స్టేషన్, ఇతర ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో బందోబస్తు విధులు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ క్లియరెన్స్, జనసమ్మర్ధం నియంత్రణ తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన బందోబస్తులో విధులు నిర్వహించనున్న పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్పీ సమావేశమై వారికి దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, విధుల్లో అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, ప్రతి బందోబస్తు పాయింట్ వద్ద సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలు, జనసమ్మర్ధం నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనను సురక్షితంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల పోలీసు సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు.

# వైసీపీని వీడి టీడీపీలో చేరిన 26వ వార్డు ముస్లిం మైనార్టీ కుటుంబాలు



**కదిరి సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**

తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కదిరి పట్టణం 26వ వార్డుకు చెందిన ముస్లిం మైనార్టీలకు చెందిన 10 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు.కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో పార్టీలో చేరిన వారిని టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పట్ల విశ్వాసంతో తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పనిచేస్తున్నారని, ఆయన నాయకత్వంలో పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని పార్టీలో చేరిన వారు తెలిపారు.

# సమస్యలు చెప్పేందుకు క్యాంపు కార్యాలయానికి ప్రజలు

- కొత్తమ్మతల్లి ఉత్సవాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక దృష్టి
- శ్రీ కొత్తమ్మతల్లి ఉత్సవాల నిర్వహణపై ఉత్సవ కమిటీ సభ్యులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష

**కోటబొమ్మాళి సెప్టెంబర్ 20,అనంత జనశక్తి న్యూస్**



ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే దిశగా నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రజల నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వినతులు స్వీకరించారు. టెక్కలి నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు స్థానిక నాయకులతో కలిసి క్యాంపు కార్యాలయానికి చేరుకుని తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని పరిశీలించిన మంత్రి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం కొత్తమ్మతల్లి ఉత్సవాల నిర్వహణపై ఉత్సవ కమిటీ సభ్యులతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, గతంలో కంటే మరింత విస్తృతంగా, పకడ్బందీ ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.

**భక్తులకు మెరుగైన సౌకర్యాలు**

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, విద్యుత్ వెలుగులు, పార్కింగ్, రవాణా, వైద్య శిబిరాలు, అత్యవసర వైద్య సేవలు, పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని మంత్రి సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, క్యూ లైన్లు, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. అదేవిధంగా భక్తులకు అవసరమైన సమాచారం అందించేందుకు ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు, మహిళలు, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**మూడు రోజుల పాటు వైభవంగా ఉత్సవాలు**

వచ్చే నెల 13, 14, 15 తేదీల్లో మూడు రోజుల పాటు కొత్తమ్మతల్లి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రి తెలిపారు. ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం ఇస్తూనే స్థానిక సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను రూపొందించాలని చెప్పారు.ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద కళారూపాలు, స్థానిక కళాకారుల ప్రదర్శనలు, సంగీత కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు యువతను ప్రోత్సహించే విధంగా వివిధ క్రీడా పోటీలు నిర్వహించాలని సూచించారు. పిల్లలు, యువత, మహిళలు పాల్గొనేలా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించాలని కమిటీ సభ్యులకు తెలిపారు.

**త్వరలో జిల్లా స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం**

ఉత్సవాల నిర్వహణకు సంబంధించి త్వరలోనే జిల్లా స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి శాఖల వారీగా బాధ్యతలు అప్పగించి, సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. భక్తుల రద్దీ, భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు, విద్యుత్, రహదారులు, పార్కింగ్, ట్రాఫిక్ తదితర అంశాలపై ముందస్తు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేస్తామన్నారు. కొత్తమ్మతల్లి ఉత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించడంతో పాటు, ప్రాంతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచేలా అన్ని శాఖలు, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# గణేష్ శోభాయాత్రలో పాల్గొని ప్రారంభించిన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

**కదిరి సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**

కదిరి పట్టణంలో నిర్వహించిన గణేష్ శోభాయాత్రలో కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ ప్రాంగణంలోని వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గణనాథుని ఆశీస్సులు పొందారు.అనంతరం భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి గణేష్ శోభాయాత్రను ఎమ్మెల్యే ప్రారంభించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ శోభాయాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి ,ఆర్డీవో ఆవుల కళావతి ,డీఎస్పీ శివనారాయణ స్వామి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, ఉత్సవ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు కేశవరెడ్డి, కృష్ణమోహన్ నాయుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





# రూ.2.10 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

**పరిగి సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**

మండలంలోని ఊటుకూరు రోడ్డు నుంచి పైడేటి మీదుగా ఎర్రగుంట, తిరుమలదేవరపల్లి గ్రామాల వరకు రూ.2.10 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవితమ్మ భూమిపూజ చేశారు. ఎర్రగుంట క్రాస్ వద్ద ఆర్డీటీ ఇళ్ల సమీపంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.బీటీ రోడ్డు నిర్మాణంతో పైడేటి, ఎర్రగుంట, తిరుమలదేవరపల్లి గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. రైతులు, విద్యార్థులు, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.10 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి సవితమ్మ తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# స్వాతంత్ర్య సంగ్రామం గత చరిత్ర కాదు... అది మన వారసత్వ సంపద



- స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందిద్దాం
- వారు నడయాడిన ప్రదేశాలను సందర్శిస్తే దేశభక్తి పెరుగుతుంది
- త్యాగధనుల జీవితం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి
- భారతీయం కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు

**కాకినాడ సెప్టెంబర్ 20, అనంత జనశక్తి ప్రతినిధి**



దేశ స్వాతంత్ర్య సంగ్రామం గత చరిత్ర కాదు... అది మన భారతీయుల వారసత్వ సంపద అని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, ఏపీ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు కాకినాడ రూరల్ తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో 'భారతీయం' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ... "ఒక తండ్రి తన జీవితాంతం కష్టపడి ఇల్లు, పొలం, డబ్బు, బంగారం, ఆస్తులు సంపాదిస్తాడు. తాను వాటిని తనతో తీసుకెళ్లలేనని తెలిసినా, తన పిల్లలు వాటిని సద్వినియోగం చేసుకుని తనకంటే గొప్ప స్థాయికి ఎదగాలని కోరుకుంటాడు. అదే సమయంలో, ఆ సంపద వెనుక ఉన్న తన కష్టం, శ్రమ, విలువలు పిల్లలకు తెలియాలని కూడా కోరుకుంటాడు. లేదంటే తాము సంపాదించినదంతా కోల్పోయి, పిల్లలు తిరిగి మొదటి స్థితికి చేరుకుంటారని భయపడతాడు. మన దేశ స్వాతంత్ర్య సంగ్రామం కూడా అలాంటిదే. ఎందరో మహనీయులు తమ జీవితాలను త్యాగం చేసి మనకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను అందించారు. ఆ సంపదను అనుభవించడం మాత్రమే కాదు... దాని విలువను తెలుసుకుని, కాపాడుకోవడం మన బాధ్యత. మన వంశం గురించి మనం తెలుసుకున్నట్లే, మన దేశం కోసం త్యాగం చేసిన మహనీయుల గురించి కూడా తెలుసుకోవాలి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ జీవించాలి. దేశభక్తి అంటే కేవలం జాతీయ జెండాను ఎగురవేయడం కాదు. "నేను భారతీయుడిని" అని గర్వంగా చెప్పుకోగలిగే స్వేచ్ఛ వెనుక ఎందరో చేసిన త్యాగాలను గుర్తుంచుకోవడం అని తెలిపారు.

**స్వాతంత్ర్య సమయంలో పుట్టిన పదం భారతీయం**

"భారతీయం అనే మాట ఇప్పుడు పుట్టింది కాదు. భారతదేశం స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో పుట్టిన మాట భారతీయం. సైమన్ కమిషన్ వచ్చినప్పుడు "భారతదేశం గురించి నిర్ణయాలు భారతీయులే తీసుకోవాలి" అంటూ దేశవ్యాప్తంగా నిరసనలు జరిగాయి. "సైమన్ గో బ్యాక్" అంటూ నల్లజెండాలతో ప్రజలు ఉద్యమించారు. ఎందరో జైళ్లకు వెళ్లారు. "భారతీయం లేని సైమన్ మాకు వద్దు" అని నిరసనలు తెలిపారు. అప్పుడు పుట్టిందే "భారతీయం". భారతీయం గురించి ఎప్పుడూ చర్చిస్తూ ఉండాలి. అప్పుడే పిల్లలకు స్వాతంత్ర్యం గురించి తెలుసుకొని దేశభక్తి పొంది ఉంటారు. లేదంటే దేశభక్తి, నైతిక విలువలు నశించిపోతాయి" అని అన్నారు.

**త్యాగాల స్ఫూర్తితో దేశభక్తి భావనను పెంపొందిద్దాం**

"అండమాన్‌లోని కాలాపాని జైలు గురించి చదివితే స్వాతంత్ర్య సమర యోధులు అనుభవించిన కష్టాలు మనసును కదిలిస్తాయి. ఇరుకైన గదులు, ఒంటరితనం, శారీరక హింస... అయినా వారి సంకల్పం మాత్రం చెదరలేదు. గాంధీజీ, నెహ్రూ, లాలా లజపతిరాయ్, టంగుటూరి ప్రకాశం పంతులు, పొట్టి శ్రీరాములు వంటి అనేకమంది మహనీయుల జీవితాలను చదివితే స్వాతంత్ర్యం ఎంతటి త్యాగాల ఫలితమో అర్థమవుతుంది. టంగుటూరి ప్రకాశం పంతులు గారు బ్రిటిష్ పోలీసుల తుపాకీకి ఎదురు నిలిచి చూపిన ధైర్యం కారణంగానే ఆయనకు "ఆంధ్రకేసరి" అనే బిరుదు వచ్చింది. రైతులకు నీరు అందించాలనే ఆకాంక్షకు ప్రతీకగా నిలిచిన ప్రకాశం బ్యారేజీ కూడా ఆయన పేరును గుర్తుచేస్తుంది. ఘంటసాల వెంకటేశ్వర రావు గారు కేవలం గాయకుడిగా మాత్రమే కాకుండా స్వాతంత్ర్య ఉద్యమంలో కూడా పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు గారి అంతిమయాత్రలో పాల్గొని దేశభక్తి గీతాలు పాడుతూ చివరి వరకు వెంట ఉన్నారు. కళను కూడా దేశ సేవకు ఉపయోగించిన మహనీయుడు ఆయన. బంకించంద్ర ఛటర్జీ రచించిన "ఆనందమఠం" వంటి రచనలు దేశభక్తి, క్రమశిక్షణ, దేశం పట్ల బాధ్యత వంటి భావాలను ప్రజల్లో బలపరిచాయి. "వందేమాతరం" కూడా అదే భావజాలానికి ప్రతీకగా నిలిచింది. మనకు దేవాలయాలు ఎంత పవిత్రమో, స్వాతంత్ర్య సమరయోధులు జీవించిన జైళ్లు, స్మారకాలు, పోరాట ప్రదేశాలు కూడా అంతే ముఖ్యమైన చారిత్రక ప్రదేశాలు. వాటిని సందర్శించినప్పుడు ఆసక్తి పెరుగుతుంది. వాటి గురించి తెలుసు కున్నప్పుడు చరిత్ర అర్థమవుతుంది. చరిత్ర అర్థమైనప్పుడు దేశభక్తి మరింత బలపడుతుంది. అందుకే పిల్లలకు పుస్తకాలు బహుమతిగా ఇవ్వండి. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను చదివించండి. అండమాన్ వంటి చారిత్రక ప్రదేశాలకు తీసుకెళ్లండి. మనకు లభించిన స్వేచ్ఛ వెనుక ఉన్న త్యాగాలను వారికి తెలియజేయండి. ఎందుకంటే వారి త్యాగాలను తెలుసుకోవడమే మన వారసత్వాన్ని తెలుసుకోవడం. ఇలాంటి కార్యక్రమాల ద్వారా స్వాతంత్ర్యం మనకు సాధారణంగా రాలేదు, ఎందరో త్యాగాల ఫలితంగా వచ్చింది, ఆ త్యాగాలకు మనమే వారసులమని పిల్లలకు అర్థమవుతుంది. భారతదేశం మనది. ఈ దేశాన్ని గౌరవించడం, కాపాడడం మన బాధ్యత. దేశ సంగ్రామం గత చరిత్ర కాదు... అది మన వర్తమానానికి పునాది, మన భవిష్యత్తుకు వారసత్వ సంపద" అని పేర్కొన్నారు.

**దేశభక్తి ఉన్న లోకేష్ విద్యా శాఖ మంత్రి అవ్వడం విద్యార్థుల అదృష్టం**

**"పిల్లల్లో దేశభక్తి, నైతిక విలువలు, చరిత్ర పట్ల గౌరవం పెంపొందించాలనే ఉద్దేశంతో "భారతీయం" కార్యక్రమం నిర్వహించాలనే ఆలోచనను మంత్రి నారా లోకేష్ ఇంటికి వెళ్ళి చెప్పగానే, ఆయన వెంటనే స్పందించి కార్యక్రమానికి వస్తానని చెప్పారు. ఆయనతో మాట్లాడి తిరిగి వెళుతుంటే నా కారు వద్దకు వచ్చి పెద్దాయన జాగ్రత్త అని నా కారు డ్రైవర్‌కు చెప్పి మరీ వెళ్ళారు. కార్యక్రమం మొదలు సమయాన్ని చెప్పిన దానికంటే ముందుగానే వచ్చి కార్యక్రమంలో పాల్గొనడం ఆయన దేశం, చరిత్ర పట్ల చూపిన ఆసక్తికి నిదర్శనం. ఇటువంటి దేశభక్తి ఉన్న లోకేష్ వంటి నాయకుడు రాష్ట్ర విద్యామంత్రి కావడం విద్యార్థుల అదృష్టం" అని మంత్రి లోకేష్‌ను అభినందించారు చాగంటి కోటేశ్వరరావు గారు.**

# ఘనంగా సిద్ధి వినాయక ఉత్సవాలు

**- రూ.1.65 లక్షలకు లడ్డూ వేలం.. రూ.52 వేలకు స్వామివారి కలశం....**

**- లక్కీ డ్రాలో బుల్లెట్ బైక్, ఎలక్ట్రిక్ స్కూటీ, గోల్డ్ కాయిన్ బహుమతులు....**

**ధర్మవరం సెప్టెంబర్ 20 అనంత జనశక్తి న్యూస్ :**



ధర్మవరం పట్టణంలోని కొత్తపేటలో సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర అలంకార విఘ్నేశ్వర స్వామివారి ఉత్సవాలు ఏడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నిమజ్జనాన్ని పురస్కరించుకుని ఆదివారం స్వామివారి లడ్డూ, కలశం వేలంతో పాటు లక్కీ డ్రా నిర్వహించారు. రూ.1.65 లక్షలకు లడ్డూ..
చేనేత నాయకుడు సందా రాఘవ ముఖ్య అతిథిగా హాజరైన కార్యక్రమంలో నిర్వహించిన లడ్డూ వేలంలో సందా రవి రూ.1,65,000లకు లడ్డూను దక్కించుకున్నారు. అలాగే స్వామివారి కలశాన్ని ఉట్టి చంద్ర మౌళి రూ.52,000లకు వేలంలో దక్కించుకున్నారు. లక్కీ డ్రాలో బుల్లెట్.. స్కూటీ.. గోల్డ్ కాయిన్ భక్తుల నుంచి రూ.100 టోకెన్ తీసుకుని, ఆ మొత్తాన్ని స్వామివారి కార్యక్రమాలకు వినియోగించేలా లక్కీ డ్రా నిర్వహించారు. చిన్నారుల చేతుల మీదుగా లక్కీ డ్రా టోకెన్లు తీయించారు. ఇందులో మొదటి బహుమతిగా హంటర్ బుల్లెట్ బైక్‌ను భవ్యశ్రీ, రెండో బహుమతిగా ఎలక్ట్రిక్ స్కూటీని దివ్యశ్రీ గెలుచుకున్నారు. మూడో బహుమతిగా గోల్డ్ కాయిన్ అందజేశారు. 20 ఏళ్లుగా ఘనంగా ఉత్సవాలు ఈ సందర్భంగా చేనేత నాయకుడు సందా రాఘవ మాట్లాడుతూ.. సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ సభ్యులు దాదాపు 20 ఏళ్లుగా వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈసారి ఉత్సవాలు కొత్తపేటకే పరిమితం కాకుండా ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలను ఆకట్టుకోవడం ఆనందంగా ఉందన్నారు. కులమతాలకు అతీతంగా వేడుకలు త్రినేత్రి రెస్టారెంట్ యజమాని భానుప్రియ మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా సిద్ధి వినాయక ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. భక్తి, ఐక్యతకు ఈ వేడుకలు ప్రతీకగా నిలిచాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ సభ్యులు, భక్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్ ను కలిసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి

**రాజమహేంద్రవరం సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**

**కాకినాడలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'భారతీయం' కార్యక్రమానికి హాజరయ్యేందుకు విమానంలో మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ను రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్‌తో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం కాకినాడలో జరగనున్న భారతీయం కార్యక్రమానికి మంత్రి లోకేష్ తో కలిసి బయలుదేరారు.**



# బాధితుడికి అభయం.. పార్టీకి గర్వకారణం

**- గుండిగానిపల్లిలో టీడీపీ నాయకుల మానవతా సాయం**

**- వికలాంగుడైన కార్యకర్తకు ₹13,000 రేషన్, ₹5,000 నగదు పంపిణీ**

**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 20 అనంత జనశక్తి న్యూస్**




నియోజకవర్గ పరిధిలోని బ్రహ్మసముద్రం, మండలంలో కష్టాల్లో ఉన్న కార్యకర్తను కంటికి రెప్పలా చూసుకోవడమే నిజమైన నాయకత్వమని బ్రహ్మసముద్రం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు నిరూపించారు.
అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం గుండిగానిపల్లి గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త హరిజన తిప్పేస్వామి ఇటీవల అనారోగ్య కారణాలతో ఎడమ కాలును పూర్తిగా తొలగించుకోవాల్సి వచ్చింది. దీంతో ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడింది.
ఈ విషయం తెలుసుకున్న మండల టీడీపీ అధ్యక్షులు శ్రీరాములు ఆధ్వర్యంలో, సీనియర్ నాయకుడు రామచంద్రప్ప స్పందించి మానవత్వాన్ని చాటుకున్నారు. సురేంద్రబాబు స్ఫూర్తితో బాధిత కుటుంబానికి ₹13,000 విలువైన రేషన్ సరుకులు, వైద్య, ఇంటి ఖర్చుల నిమిత్తం ₹5,000 నగదును అందజేశారు. అలాగే నాయకుడు ఏ.సి.చంద్రన్న బాధితుడికి పండ్లను అందజేసి పరామర్శించారు.
కార్యకర్తే పార్టీకి వెన్నుముక. అలాంటి కార్యకర్త కష్టంలో ఉంటే చూస్తూ ఊరుకోలేం" అని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో స్టేట్ డైరెక్టర్ నీలస్వామి, రైతు కార్యదర్శి కురుగౌడ, మాజీ డైరెక్టర్ నాగిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు శివలింగప్ప, డీలర్ కేశవర్ధన్ గౌడ్, ఐటీడీపీ మండల అధ్యక్షుడు బజ్జన్నగౌడ, సీనియర్ నాయకుడు భీమరెడ్డి, యువ నాయకులు రాజశేఖర్ రెడ్డి, చాకలి గిరీష్, దళిత నాయకులు రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, రాజన్న తదితరులు పాల్గొని తిప్పేస్వామికి ధైర్యం చెప్పి, ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రామచంద్రప్ప చేసిన ఈ సాయంపట్ల గ్రామ ప్రజలు, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

# నెల్లూరు సిటీలో పరుగులు పెడుతున్న అభివృద్ధి

**- ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నాం: మంత్రి నారాయణ**

**- డిసెంబర్ నాటికి పొర్లుకట్టలో మిగిలిన పనులు పూర్తి**

**నెల్లూరు, సెప్టెంబర్ 20: అనంత జనశక్తి న్యూస్**



నెల్లూరు సిటీ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. జాకీర్ హుస్సేన్ నగర్‌లో రూ.57.25 లక్షలతో ఆధునీకరించిన వాటర్ ట్యాంకును ప్రారంభించడంతో పాటు, అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద పాఠశాల ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. జెండావీధిలోని పీఎన్ఎం హైస్కూల్, మున్సిపల్ ఉర్దూ పాఠశాలల ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. పొర్లుకట్టలో సీసీ రోడ్డు పనులను పరిశీలించి, రూ.90 లక్షలతో చేపట్టనున్న సీసీ డ్రెయిన్ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమం జరిగిన ప్రతి ప్రాంతంలో స్థానికులు మంత్రికి ఘనస్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పొర్లుకట్ట ప్రజల సమస్యలను స్వయంగా విన్నానని, వాటిని పరిష్కరిస్తానని ఇచ్చిన మాట ప్రకారం సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. డిసెంబర్ నెలాఖరులోగా పొర్లుకట్టలో మరుగుదొడ్లు, కనెక్టివిటీ రోడ్లు, సంగం బ్యారేజ్ నుంచి మంచినీటి సరఫరా పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసి వెళ్లడం వల్ల కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి ఏడాదిలో అభివృద్ధి పనులకు కొన్ని ఆటంకాలు ఎదురయ్యాయని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అపార అనుభవంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టారని అన్నారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో రూ.43 వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంత పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టిన ప్రభుత్వం లేదని అన్నారు. నెల్లూరులో వాయు కాలుష్య నియంత్రణకు తీసుకున్న చర్యలకు గుర్తింపు లభించిందని తెలిపారు. తాను టైమ్‌పాస్ కోసం రాజకీయాల్లోకి రాలేదని, ప్రజాసేవే పరమావధిగా భావించి రాజకీయాల్లోకి వచ్చానని మరోసారి స్పష్టం చేశారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా పట్టించుకోకుండా నెల్లూరు నగరాన్ని రాష్ట్రంలోనే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతానని అన్నారు.

**పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య**

రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ నెల్లూరు సిటీ నియోజకవర్గంలో అభివృద్ధి పరంపర కొనసాగుతోందన్నారు. పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే లక్ష్యంతో మంత్రి నారాయణ ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మారుస్తున్నారని చెప్పారు. రోడ్లు, డ్రైన్లు, మంచినీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. పేదల అభ్యున్నతి కోసం మంత్రి నారాయణ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని, నగరంలోని పార్కులను ఆధునీకరించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ సుజాత, కమిషనర్ నందన్, డీఈఓ బాలాజీరావు, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతారెడ్డి, కార్పొరేటర్లు పోలంరెడ్డి లక్ష్మీ ప్రత్యూష, కరీముల్లా, పొట్లూరి రామకృష్ణ, స్థానిక టీడీపీ నేతలు మొయినుద్దీన్, దర్శి హరికృష్ణ, జమీర్, జాఫర్, పెంచలయ్య, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుమీద నిల్వ ఉన్న వర్షపు,నీరు



**- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారులు**

**అమడగూరు సెప్టెంబర్ 20 అనంత జనశక్తి న్యూస్**

**ఆమడగూరు ,మండలం కంచర వాండ్లపల్లి,ఎస్సీ కాలనీలో రోడ్డుమీద హర్షపనీరు గ్రామస్తులు బయటకు వెళ్లాలంటే చాలా కష్టంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు, విషయం ఏమంటే వర్షపు నీరు పడి బయట పొలాలకు వెళ్లేవి కానీ కొంతమంది పైనుండి కిందకు బయటకు వెళ్లకుండా రోడ్డుమీద మట్టి వేశారు ఆ మట్టి వేసిన ప్రదేశంలో వర్షం నీరు అధికంగా నిలిచి గ్రామస్తులకు బయట వెళ్ళటానికి చాలా కష్టంగా మారింది ఈ మధ్యన కొందరు స్వార్థంతో ఎవరి ఇంటి ముందర వారు అనగా (ప్రభుత్వ రోడ్డు మీద ) మట్టి తోలడం వలన వర్షపు నీరు ఈ విధంగా స్టాక్ నిలబడుతున్నది ప్రజలు కనీసం నడిచి వెళ్లడానికి కూడా దారి లేకుండా పోయింది టూవీలర్లు ఫోర్ వీలర్లు ఆ దారి నుండి పోవాలంటే భయపడుతున్నారు, కనుక పంచాయతి అధికారులు చోరవాతీసుకొని రోడ్డు మీద ఉన్నటువంటి మట్టిని తొలగించి ప్రమాదాలు జరగకుండా నివారించాలని గ్రామస్తులు వాపోతున్నారు ప్రభుత్వ అధికారులు పంచాయతీ అధికారులు,దీనిమీద ప్రత్యేక శ్రద్ధ పెట్టి మా కాలనీకి న్యాయం చేయగలరని గ్రామ ప్రజలు అహిస్తున్నారు**

## చాలా రోజుల తర్వాత కురిసిన భారీ వర్షం

**- రాంపురంలో పొంగిపొర్లుతున్న చెక్ డ్యామ్‌లు**

**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 20 అనంత జనశక్తి న్యూస్**

**నియోజకవర్గ పరిధిలోని కంబదూరు మండలం: చాలా రోజుల విరామం తర్వాత కంబదూరు మండల వ్యాప్తంగా ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రాంపురం గ్రామ పరిధిలోని చెక్ డ్యామ్‌లు పూర్తిస్థాయిలో నిండి అలుగుపారుతున్నాయి. పైనుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో చెక్ డ్యామ్‌ల మీదుగా నీరు దిగువకు పరవళ్లు తొక్కుతోంది. ఈ వర్షా ల వల్ల భూగర్భ జలాలు గణనీయంగా పెరగనుండటంతో పాటు పంటలకు జీవం రావడంతో స్థానిక రైతాంగం తీవ్ర హర్షం వ్యక్తం చేస్తోంది.**



## ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఢీకొన్న కారు

**- టోల్‌గేట్ సమీపంలో రోడ్డు ప్రమాదం.....**

**- నలుగురికి గాయాలు....**

**ధర్మవరం సెప్టెంబర్ 20**

**అనంత జనశక్తి న్యూస్ :**



ధర్మవరం టోల్‌గేట్ సమీపంలో ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం 8:15 గంటల సమయంలో ధర్మవరం నుంచి పులివెందుల వైపు పనిమీద వెళ్తున్న కారులో ఒక్కసారిగా టైర్ బరస్ట్ కావడంతో వాహనం అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఢీకొంది. ఈ ప్రమాదంలో ధర్మవరం కోర్టులో పనిచేస్తున్న నాగలక్ష్మి కుమారుడు, కారు డ్రైవర్ శ్రీకాంత్, ఆయన భార్య మౌనిక, శ్రీకాంత్ అవ్వ బయమ్మ గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.
వీరిలో ఇద్దరి పరిస్థితి తీవ్రంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేయగా.. మరో ఇద్దరు ప్రస్తుతం ప్రమాదం నుంచి బయటపడి, అవుట్ ఆఫ్ డేంజర్‌లో ఉన్నట్లు సమాచారం. ప్రమాద ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## శిథిలావస్థలో తాగునీటి ట్యాంకు:

**- కూలుతుందనే భయంలో స్థానికులు**

**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 20 అనంత జనశక్తి న్యూస్**

నియోజకవర్గ పరిధిలోని కంబదూరులోని తహశీల్దారు అతిథి గృహం వెనుక ఉన్న తాగునీటి ట్యాంకు పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. సిమెంట్ పెచ్చులు ఊడిపోయి లోపలి ఇనుప కడ్డీలు బయటపడుతుండటంతో పాటు, నిత్యం నీరు లీకవుతూ ట్యాంకు పాచిపట్టింది. ట్యాంకు చుట్టూ ఇళ్లు ఉండటంతో ఇది ఎప్పుడు కూలి ప్రాణనష్టం జరుగుతుందోనని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు పదేళ్ల నుంచి ఈ దుస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ట్యాంకుకు మరమ్మతులు చేయడమో లేదా పూర్తిగా తొలగించి కొత్తది నిర్మించడమో చేయాలని స్థానికులు కోరుతున్నారు.



## 27న కుందుర్పిలో మహిళా జాబ్ మేళా.

**- అరవింద్ గార్మెంట్స్‌లో వందలాది మంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు**

**కళ్యాణదుర్గం,కుందుర్పి సెప్టెంబర్ 20 అనంత జనశక్తి న్యూస్**

మండలంలోని 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల మహిళలకు అరవింద్ గార్మెంట్స్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఎస్కే చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు ఎస్.కె. లెనిన్ బాబు, టి. రాజు, దిలీప్, లక్ష్మణమూర్తి, బొమ్మలింగ ఒక ప్రకటనలో తెలిపారు. దొడ్డబళ్లాపూర్, చిత్రదుర్గ ప్రాంతాల్లోని గార్మెంట్స్ యూనిట్లలో ఉద్యోగాలకు ముందస్తు అనుభవం అవసరం లేదని, ఎంపికైన వారికి 21 రోజుల శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజనం, ప్రయాణ సౌకర్యం కల్పిస్తారని తెలిపారు. నెలకు రూ.15,000కు పైగా వేతనంతో పాటు ప్రాఫ్ , ఏసీ , గ్రాట్యుటీ వంటి ప్రయోజనాలు ఉంటాయని పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు ఈనెల 26వ తేదీలోపు 6304659980, 9701043369, 9493348824, 9963012129 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలి. నమోదు చేసుకున్న అభ్యర్థులు 27వ తేదీన కుందుర్పిలో జరిగే మహిళా జాబ్ మేళాకు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఆధార్ కార్డుతో హాజరుకావాలని కోరారు. గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు ఈ ఉద్యోగ అవకాశాలు దోహదపడతాయని తెలిపారు.

# కార్యకర్తలే టీడీపీకి కొండంత బలం



- మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి....

**కొత్తచెరువు రూరల్ సెప్టెంబర్ 20 అనంత జన శక్తి న్యూస్.**

టీడీపీకి కార్యకర్తలే కొండంత బలమని, కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం కొత్త చెరువు మండలంలో పర్యటించిన ఆయన బండ్లపల్లి పంచాయతీ చెన్నరాజుపల్లిలో ఇటీవల మృతి చెందిన టీడీపీ కార్యకర్త, స్టోర్ డీలర్ వెంకటేష్ తల్లి లక్ష్మీనరసమ్మ వైకుంఠ సమారాధన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం టీడీపీ కార్యకర్త సుబ్బిరెడ్డి కుటుంబాన్ని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు పార్టీకి వెన్నెముకగా నిలుస్తున్నారని, కార్యకర్తల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ భాగస్వాములమవుతామని పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కొత్త చెరువు మండలం టీడీపీ నాయకులు, కన్వీనర్లు వలిపి శ్రీనివాసులు, రామకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, రవి, రాజు, భాస్కర్, శ్రీనాథ్, హర్ష, నాయుడు, బాషా తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# రోడ్డుపై కూలిన వృక్షం



- భైరవుని గుడి వద్ద ఘటన......
- తృటిలో తప్పిన పెను ప్రమాదం.....

**ధర్మవరం సెప్టెంబర్ 20 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలో రాత్రి భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ధర్మవరం-రేగాటిపల్లి ప్రధాన రహదారిలోని భైరవుని గుడి సమీపంలో భారీ వృక్షం ఒక్కసారిగా నేలకొరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. వృక్షం కూలిన సమయంలో రోడ్డుపై వాహనాలు, ప్రజలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిసే సుధాకర్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులకు సమాచారం అందించి, రోడ్డుపై పడిన వృక్షాన్ని తొలగించి రాకపోకలను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

# గంధంతో గణనాథుడు



- అంగరంగ వైభవంగా ఊరేగింపు....
- పురవీధుల్లో కనువిందు చేసిన గంధం వినాయకుడు....
- సందడిగా నృత్యాలు చేసిన మహిళలు, యువకులు....

**ధర్మవరం సెప్టెంబర్ 20 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలోని కేశవనగర్‌కు చెందిన బీజేపీ నాయకులు ఎర్రజోడు లోకేష్, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన 1,116 కిలోల గంధం వినాయకుడి ఊరేగింపు వైభవంగా జరిగింది. వినాయక చవితి సందర్భంగా భారీ మొత్తంలో గంధంతో ప్రత్యేకంగా రూపొందించిన గణనాథుడిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణనాథుడిని పురవీధుల్లో ఊరేగించగా.. భక్తులు పాల్గొని స్వామివారికి ఘనంగా స్వాగతం పలికారు. ఊరేగింపులో మహిళలు, యువకులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. గణనాథుడి దర్శనానికి తరలివచ్చిన భక్తులతో పురవీధులు కిక్కిరిశాయి. భారీ పరిమాణంలో గంధంతో రూపొందించిన వినాయక విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

# రామనామ సంకీర్తనను మరింత విస్తృతం చేస్తాం

- ప్రతి హిందువు ఇంట్లో 108 సార్లు రామనామ జపం..
- 93వ వారానికి చేరుకున్న శ్రీరామనామ తారక మంత్ర కార్యక్రమం.....

**ధర్మవరం సెప్టెంబర్ 20 అనంత జనశక్తి న్యూస్ :**



ధర్మవరం ప్రతి హిందువు ఇంట్లో శ్రీ రామనామ తారక మంత్రాన్ని 108 సార్లు జపించే బృహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని ధర్మవరంలో మరింత విస్తృతం చేస్తామని శ్రీరామ దండు నిర్వాహకులు తెలిపారు. శ్రీరామ దండు ఆధ్వర్యంలో పట్టణంలో ప్రతి ఆదివారం ఒక హిందువు ఇంట్లో నిర్వహిస్తున్న శ్రీ రామనామ తారక మంత్ర కార్యక్రమం 93వ వారానికి చేరుకుంది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రామనామ సంకీర్తనలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. "శ్రీరామ నామస్మరణతో ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాం" అని నిర్వాహకులు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మంది భక్తులను భాగస్వామ్యం చేస్తూ రామనామ సంకీర్తనను పట్టణంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# బిజేపి అనంతపురం జిల్లా చేనేత సెల్ కన్వీనర్ గా చింతా చౌడయ్య

**యాడికి, సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్ :**

భారతీయ జనతా పార్టీ అనంతపురం జిల్లా చేనేత సెల్ కన్వీనర్ గా చింతా చౌడయ్య ను ఆదివారం బిజేపి జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ నియమించారు. బిజేపి జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ కు అనంతపురం జిల్లా చేనేత సెల్ కన్వీనర్ చింతా చౌడయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చేనేత సెల్ కన్వీనర్ గా చింతా చౌడయ్య మాట్లాడుతూ అనంతపురం జిల్లా చేనేతల సమస్యల పైన ఎప్పటికప్పుడు స్పందిస్తూ ,ప్రజా సమస్యల పరిష్కారానికి , పార్టీ సంస్థాగత నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. పలువురు చేనేత సెల్ కన్వీనర్ గా చింతా చౌడయ్య ను అభినందించారు.




# సమాజ శ్రేయస్సుకు ఆర్యవైశ్యులు అందిస్తున్న సేవలు అభినందనీయం

- మంత్రి నారాయణ
- నెల్లూరులో ఘనంగా అర్బన్ ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారం
- పాల్గొన్న మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే సోమిరెడ్డి, టీజీ వెంకటేష్
- ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గానికి మంత్రి నారాయణ చేతుల మీదుగా ఘన సన్మానం
- ఆర్యవైశ్య సంఘం సేవలు అభినందనీయం: నెల్లూరు ప్రమాణ స్వీకారంలో మంత్రి నారాయణ




**నెల్లూరు సెప్టెంబర్ 20 అనంత జనశక్తి న్యూస్**

నెల్లూరులోని 6వ డివిజన్ పప్పుల వీధి శ్రీ మహాలక్ష్మి అమ్మవారి గుడి వద్ద శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ముఖ్య అతిథిగా హాజరుకాగా, ఆయనకు ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి నారాయణతో పాటు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు..రాష్ట్ర ఆర్య వైశ్య గౌరవ చైర్మన్ టీజీ వెంకటేష్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అక్షయ్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొనగా, ప్రమాణ స్వీకారం చేసిన నూతన కార్యవర్గ సభ్యులను మంత్రి నారాయణ శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మునగా నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కోట రమేష్‌బాబు, కోశాధికారి సి ఏ జె.వి. చలపతిరావు, మహిళా విభాగ అధ్యక్షురాలు శేషాద్రి సువర్ణకుమారి, యువజన విభాగ అధ్యక్షులు సి ఏ వేముల హరిశంకర్‌లతో పాటు 100 మందికి పైగా సభ్యులతో ఏర్పాటైన ఈ భారీ కమిటీ సంఘ ఐక్యతకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ... రాష్ట్ర ఆర్థిక పురోగతికి జీఎస్టీ, ఇన్కమ్ టాక్స్ చెల్లించే వ్యాపారవేత్తలైన ఆర్యవైశ్యుల పాత్ర అత్యంత కీలకమని, నీతి నిజాయితీలతో వ్యాపారాలు చేస్తూ ప్రభుత్వానికి సహకరిస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నెల్లూరులో ఎస్పీ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వ్యాపారులకు పూర్తి ప్రశాంత, సురక్షిత వాతావరణం కల్పించామని స్పష్టం చేశారు. పేదల చదువులకు సాయం, కోవిడ్ సమయం నుండి నిత్య అన్నదానాల వరకు ఆర్యవైశ్యులు అందిస్తున్న సామాజిక సేవలు ప్రశంసనీయమన్నారు...ఆర్యవైశ్య సంఘం చేపట్టే అన్ని సేవా కార్యక్రమాలకు మునిసిపల్ శాఖ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార కమిటీ సమన్వయకర్తగా కందుల దుర్గేష్

**అమరావతి సెప్టెంబర్ 20 అనంత జనశక్తి న్యూస్**

స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార కమిటీ సమన్వయకర్తగా తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ కృతజ్ఞతలు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతను అంకితభావంతో నిర్వర్తిస్తానని ఆయన పేర్కొన్నారు. జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, క్షేత్రస్థాయి కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు కృషి చేస్తానన్నారు.పవన్ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో, పార్టీ నాయకత్వం నిర్దేశించిన విధానాలకు అనుగుణంగా ప్రతి స్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు తన వంతు కృషి చేస్తానని కందుల దుర్గేష్ తెలిపారు.

# ప్రకృతితో మమేకమైన అభివృద్ధికే భవిష్యత్తు

- గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు పడాలి
- ప్రతి భవనం వనరులను సృష్టించేలా ఉండాలి
- అభివృద్ధి ఆగకూడదు... పర్యావరణానికి గాయం చేయకూడదు
- బెంగళూరులో ది ఎర్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో కలిసి ది ఎర్త్ సెంటర్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు

**బెంగళూరు, సెప్టెంబర్ 20: అనంత జనశక్తి న్యూస్ :**

ప్రకృతికి ప్రాధాన్యమిస్తూ, భవిష్యత్ తరాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి సాగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లో నిర్మించిన ది ఎర్త్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆదివారం సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి సీఎం చంద్రబాబు ది ఎర్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభించారు. ప్రకృతి, సాంకేతికత, ఆధునిక పని వాతావరణాన్ని సమన్వయం చేస్తూ ది ఎర్త్ సెంటర్‌ను రూపొందించారు. సుస్థిర నిర్మాణం, ప్రకృతి అనుసంధానం, రీసైకిల్ చేసిన పదార్థాల వినియోగం వంటి అంశాలకు ఈ భవనంలో ప్రాధాన్యం ఇచ్చారు. ఈ భవన ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. కాంక్రీట్ జంగిల్స్ నుంచి పర్యావరణ హిత నిర్మాణాల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు వేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వనరులను అధికంగా వినియోగించే భవనాలు కాకుండా.. వనరులను తెలివిగా వినియోగించేలా నిర్మాణాలు చేపట్టాలన్నారు. భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ అభివృద్ధి సాగాలని సీఎం స్పష్టం చేశారు. అభివృద్ధి ఆగకుండా... పర్యావరణానికి గాయం చేయకుండా వినూత్న ఆలోచనలతో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

**ర్యావరణ సమస్యలను ఇప్పటికే ఎదుర్కొంటున్నాం**

వాతావరణ మార్పులతో కలిగే దుష్పరిణామాలు భవిష్యత్తులో ఎదురయ్యే సమస్య కాదని.. ఇప్పటికే మన ముందున్న సవాలని సీఎం అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని సూచించారు. భవన నిర్మాణాల్లో నెట్ జీరో విధానాన్ని అవలంభించాలని, సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని, నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అన్నారు. చెత్తను కంపోస్టుగా మార్చడంతో పాటు రీయూజ్ విధానాన్ని విస్తృతంగా అమలు చేయాలని చెప్పారు. వీటితోనే స్వచ్ఛ భారత్, స్వచ్ఛ కర్ణాటక, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లక్ష్యాలను సాధించగలమన్నారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ది ఎర్త్ సెంటర్ నిర్మాణం జరిగిందని చంద్రబాబు చెప్పారు. ఇలాంటి పర్యావరణ హిత భవనాలకే భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ప్రజల అవసరాలను తీర్చే క్రమంలో ప్రకృతి పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఇప్పుడు నిర్మించే భవనాలే రాబోయే దశాబ్దాల్లో నగరాల వాతావరణాన్ని నిర్దేశిస్తాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. దశాబ్దాలుగా నగరాల అభివృద్ధి గ్రే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆధారంగా సాగిందని సీఎం పేర్కొన్నారు. ఇకపై గ్రీన్ గ్రోత్, సర్క్యులర్ గ్రోత్, రీజెనరేటివ్ గ్రోత్ విధానాలు అవసరమన్నారు. స్వచ్ఛమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునేలా భవనాలను రూపొందించాలని సూచించారు. ప్రతి పైకప్పు ఒక పవర్ ప్లాంట్‌గా మారవచ్చు.. ప్రతి నీటి చుక్కను తిరిగి వినియోగించవచ్చు.. ప్రతి వ్యర్థ ప్రవాహాన్ని ఒక వనరుగా మార్చవచ్చు అని ముఖ్యమంత్రి అన్నారు. నీటిని, నేలను కాపాడటం అంటే సంపదను సృష్టించడమేనని చెప్పారు.

**వ్యవసాయంలోనే కాదు... అభివృద్ధిలోనూ ప్రకృతికే ప్రాధాన్యతివ్వాలి**

వ్యవసాయంలో జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తున్నామని, అదే స్ఫూర్తి పట్టణాభివృద్ధిలోనూ అవసరమని సీఎం అన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల నాన్‌ఫాసిల్ విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలనే జాతీయ లక్ష్యంలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామిగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 165 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని ప్రణాళిక చేస్తున్నామని చెప్పారు. అమరావతిని పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు తెలిపారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు సైబరాబాద్‌ను అభివృద్ధి చేశానని గుర్తుచేశారు. ఇప్పుడు మరో చక్కటి నగరాన్ని నిర్మించే అవకాశం తనకు దేవుడు ఇచ్చారని చెప్పారు. ప్రకృతి, సాంకేతికత, ఆధునిక మౌలిక వసతులతో అమరావతిని భవిష్యత్ తరాలకు అనువైన నగరంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను గుర్తిస్తూ... పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ఈ ప్రాజెక్టును రూపొందించిన రఘువీర్ వీరమాచనేని, ప్రవీణ్ కుమార్, విస్టా స్పేసెస్ బృందం, వెంకటరమణన్ అసోసియేట్స్ ప్రతినిధుల్ని ముఖ్యమంత్రి అభినందించారు.

# క్యాన్సర్ రోగులకు.. ఉచితంగా అధునాతన జన్యు పరీక్షలు

**అమరావతి సెప్టెంబర్ 20 అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా క్యాన్సర్ రోగులకు అధునాతన జన్యు పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి. గుంటూరు(Guntur) సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో 2 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.2.5 కోట్లతో ప్రత్యేక జన్యుపరీక్షల ప్రయోగశాలను ఏర్పాటు చేస్తున్నారు. అవసరమైన పరికరాలు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. తొలిదశలో రొమ్ము, ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగులకు పరీక్షలు నిర్వహించనున్నారు. క్యాన్సర్ రోగుల నుంచి సేకరించిన నమూనాలను ప్రత్యేకంగా పరీక్షించి కణాల్లోని జన్యు మార్పులను గుర్తిస్తారు. వాటి ఆధారంగా రోగికి ఏ చికిత్స అవసరమో వైద్యులు నిర్ణయించేందుకు వీలవుతుంది.

రోగ నిర్ధరణ నుంచి చికిత్స, తదుపరి పర్యవేక్షణ వరకు ఈ విధానాన్ని ఉపయోగించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆస్ట్రాజెనెకా సంస్థ, స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్ సంస్థల భాగస్వామ్యంతో చేపడుతున్నారు. గుంటూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఏర్పాటు చేస్తున్న ప్రయోగశాలను ఈ నెల 22న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించనున్నారు. ప్రస్తుతం సూక్ష్మస్థాయి జన్యు మార్పు పరీక్షల కోసం కొందరు రోగుల నమూనాలను బెంగళూరు, ముంబయి వంటి నగరాలకు పంపించాల్సి వస్తోందని, ఈ ఇబ్బందిని తొలగించి రాష్ట్రంలోనే అధునాతన పరీక్షలు అందుబాటులోకి తీసుకురావాలన్నదే లక్ష్యమని మంత్రి తెలిపారు. జన్యు పరీక్షలను రోగులకు ఉచితంగా అందించనున్నామని, బయట ప్రైవేటు కేంద్రాల్లో ఒక్కో పరీక్షకు రూ.20 వేల నుంచి 25 వేల వరకు, పూర్తి స్థాయి పరీక్షలకు రూ.75




వేల వరకు ఖర్చవుతున్న నేపథ్యంలో ఈ సదుపాయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.



## 10 మంది విద్యార్థినుల
# జడల కత్తిరించారు

- భీమిలి కేజీబీవీ బాలికల హాస్టల్‌లో కలకలం
- మిస్టరీగా మారిన ఘటన
- విచారణ జరుపుతున్న అధికారులు
- ఒక్క జడ వేసుకున్న బాలికల జడలే కత్తిరించారు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 20, అనంతజనశక్తి న్యూస్**

విశాఖపట్నంజిల్లా భీమిలి కస్తూర్బాగాంధీ (కేజీబీవీలో) బాలికల విద్యాలయం హాస్టల్‌లో కలకలం రేగింది. కొందరు విద్యార్థినుల జడల కత్తిరించడం కలకలం రేపింది. ఈ నెల 16న రాత్రి ఈ ఘటన జరగ్గా.. తాజాగా బయటపడింది. భీమిలి కేజీబీవీలో మొత్తం 38 మంది 9వ తరగతి విద్యార్థినులకు హాస్టల్‌లో రెండు గదులు కేటాయించారు. ఈ నెల 16న రాత్రి 12 గంటల వరకు ప్రమీల అనే టీచర్ ఆధర్వ్యంలో స్టడీ అవర్ నిర్వహించారు.. అనంతరం విద్యార్థినులు నిద్రపోయారు. ఆ మరుసటి రోజు ఉదయం విద్యార్థినులు నిద్రలేచి చూడగానే 10మంది విద్యార్థినిల జడలు కత్తిరించినట్లు గుర్తించారు. 20మంది విద్యార్థినులు ఒక గదిలో నిద్రించగా ఆరుగురు.. 18మంది నిద్రించిన గదిలో నలుగురు విద్యార్థినుల జడలు కత్తిరించించారు. వెంటనే బాధిత విద్యార్థినులు ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారు.

అంతేకాదు హాస్టల్‌లో రెండు జడలు వేసుకున్న వారివి కాకుండా ఒక జడ వేసుకున్న బాలికల జుత్తును మాత్రమే కత్తిరించారు. హాస్టల్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.. కాబట్టి బయట వ్యక్తులు లోపలికి ప్రవేశించే అవకాశం లేదని భావిస్తున్నారు. హాస్టల్‌లో తోటి విద్యార్థినులే ఈ ఆకతాయి పని చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై ఉన్నతాధికారులు, స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లామని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేస్తే విద్యార్థినులు ఎవరిపైనా అనుమానం వ్యక్తం చేయలేదంటున్నారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు ఎప్పుడూ జరగలేదని.. బాధిత విద్యార్థినుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఇవాళ బాధిత విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు ప్రిన్సిపల్.

భీమిలి కస్తూర్బాగాంధీ (కేజీబీవీలో) బాలికల విద్యాలయం హాస్టల్‌లో జరిగిన ఈ ఘటన చర్చనీయాంశమైంది. భద్రత ఉండే హాస్టల్‌లో ఇలాంటి ఘటనలు జరగడం సంచలనంగా మారింది. బయట నుంచి వ్యక్తులు వచ్చే అవకాశం లేదని చెబుతుండటంతో.. ఇంటి దొంగల పనిగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై అధికారులు మరింతగా ఆరా తీస్తున్నారు.. త్వరలోనే దీని వెనుక ఎవరున్నారో తెలిపోతుందంటున్నారు.

# వినాయక నిమజ్జనాల్లో డీజే సౌండ్స్‌కు నో పర్మిషన్

**అమరావతి, సెప్టెంబర్ 20, అనంతజనశక్తి న్యూస్**

చేతిలో పూలు.. నోట భక్తిగీతాలు.. చుట్టూ గణపతి నామస్మరణ.. ఆనందోత్సాహాలతో సాగాల్సిన వినాయక నిమజ్జన వేడుకలు కొన్ని చోట్ల విషాదంగా మారుతున్నాయి. విగ్రహాన్ని సాగనంపేందుకు రోడ్ల పైకి వచ్చిన కుటుంబాలు.. స్నేహితులు.. యువత.. కాసేపటి క్రితం వరకు ఉత్సాహంగా కనిపించిన వారిలో కొందరు ఒక్కసారిగా కుప్పకూలుతుండటం కలవరపెడుతోంది. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవలి రెండు రోజుల్లో నిమజ్జన కార్యక్రమాలకు సంబంధించిన సందర్భాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. నల్గొండ జిల్లా తిరుమలగిరి మండలంలో శనివారం జరిగిన గణేష్ శోభాయాత్రలో రాము (34) అనే వ్యక్తి డ్యాన్స్ చేశాడు. ఊరేగింపు తన ఇంటి ముందుకు వచ్చిన సమయంలో మెట్లపై కూర్చున్న ఆయన కొద్దిసేపటికే కుప్పకూలారు. కుటుంబ సభ్యులు, స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోనూ శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. గణేష్ నిమజ్జన ఊరేగింపులో కాకర్లమూడి ఈసు అనే వ్యక్తి ఇతరులతో కలిసి డ్యాన్స్ చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నిమజ్జన వేడుకల్లో భద్రతపై చర్చ మొదలైంది.

కర్నూలు రూరల్ మండలం ఇ.తాండ్రపాడు గ్రామంలో శుక్రవారం శివమ్మ (36) నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. డ్యాన్స్ చేసిన అనంతరం అస్వస్థతకు గురై కుప్పకూలారు. ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై స్థానికంగా డీజే శబ్దం గురించి చర్చ జరిగినప్పటికీ.. ఆమె మరణానికి అదే ప్రత్యక్ష కారణమని అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.



అదే రోజు నంద్యాల జిల్లా డోన్‌లో గణేశ్ గౌడ్ (23) నిమజ్జన వేడుకల్లో పాల్గొని ఇంటికి వెళ్లిన తర్వాత ఛాతిలో నొప్పి వచ్చినట్లు కుటుంబ సభ్యులకు చెప్పినట్టు సమాచారం. ఆస్పత్రికి తరలించేలోపే ఆయన మృతి చెందారు. ఇక ఉమ్మడి అనంతపురం జిల్లాలోనూ ఇలాంటి విషాదమే చోటుచేసుకుంది. శ్రీ సత్యసాయి జిల్లా సోమందేపల్లిలో శ్రీకాంత్ (35) ఊరేగింపులో పాల్గొంటూ కుప్పకూలారు. అనంతపురం జిల్లా గుత్తిలో అశోక్ కుమార్ (28) వినాయక మండపం వద్ద పాటలకు డ్యాన్స్ చేస్తూ కుప్పకూలినట్లు సమాచారం. ఈ రెండు ఘటనల్లోనూ ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఈ ఘటనలన్నీ దాదాపు ఒకే తరహాలో చోటుచేసుకోవడంతో డీజే శబ్దాలపై చర్చ మొదలైంది. అయితే ఒక వ్యక్తి గుండెపోటు, కార్డియాక్ అరెస్ట్‌కు కేవలం శబ్దమే కారణమని నిర్ధారించాలంటే వైద్యపరమైన పరీక్షలు, మృతదేహ పరీక్ష నివేదికలు, వ్యక్తి గత ఆరోగ్య పరిస్థితి వంటి అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. అయితే అధిక శబ్దానికి ఎక్కువసేపు గురికావడం ఆరోగ్యానికి హానికరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) స్పష్టం చేస్తోంది.

డబ్ల్యూహెచ్‌ఓ ప్రకారం సగటున 80 డెసిబుల్స్ శబ్దానికి వారానికి 40 గంటల వరకు సురక్షితంగా వినొచ్చని సూచించింది. శబ్ద తీవ్రత 90 డెసిబుల్స్‌కు చేరితే ఈ సమయం 4 గంటలకు.. 100 డెసిబుల్స్ వద్ద 20 నిమిషాలకు తగ్గుతుంది. శబ్ద తీవ్రత పెరిగే కొద్దీ సురక్షితమైన ఎక్స్‌పోజర్ సమయం వేగంగా తగ్గుతుంది. డబ్ల్యూహెచ్‌ఓ నిర్వహించే సేఫ్ లిజనింగ్ మార్గదర్శకాల్లో పెద్ద ఈవెంట్లకు సగటు శబ్ద స్థాయిని 100 డెసిబుల్స్‌కు మించకుండా పర్యవేక్షించడం, శబ్దాన్ని కొలిచే పరికరాలు వినియోగించడం, ప్రజలకు వినికిడి రక్షణ కల్పించడం వంటి సూచనలు ఉన్నాయి.

వినాయక చవితి వేడుకల్లో డీజేలు కొత్త విషయం కాదు. యువతకు డ్యాన్స్, భారీ సౌండ్, రంగురంగుల లైట్లు ఇవన్నీ వేడుకల్లో భాగమయ్యాయి. ఒక మండపం కంటే మరో మండపం భారీ సౌండ్‌తో ఉండాలనే పోటీ కూడా కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తోంది. కానీ ఆ కొన్ని గంటల ఉత్సాహం.. ఒక కుటుంబానికి జీవితాంతం మిగిలే విషాదంగా మారితే.. నిమజ్జనం కోసం బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాకపోతే.. డ్యాన్స్ చేస్తూ ఆనందించిన యువకుడు నిమిషాల వ్యవధిలో ప్రాణాలు కోల్పోతే.. ఆ కుటుంబం ఎదుర్కొనే వేదనను ఏ వేడుకా భర్తీ చేయలేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఈ పరిణామాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజును కొందరు యువకులు ఆదివారం కలిసి నిమజ్జనాల్లో డీజేలకు అనుమతి ఇవ్వాలని కోరినట్లు సమాచారం. అయితే ఉండి నియోజకవర్గ పరిధిలో వినాయక నిమజ్జనాల్లో డీజే సౌండ్స్‌కు అనుమతి ఇవ్వబోమని రఘురామ స్పష్టం చేశారు. డీజే శబ్దాలతో యువత ప్రాణాలు కోల్పోతున్న ఘటనలను ప్రస్తావిస్తూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఒక వార్తాపత్రికలో వచ్చిన డీజే శబ్దానికి సంబంధించిన మరణ వార్తను యువకులకు చూపించినట్లు సమాచారం. దీంతో డీజేలు లేకుండానే నిమజ్జనం నిర్వహిస్తామని యువకులు అంగీకరించినట్లు తెలుస్తోంది.

వినాయక నిమజ్జనం అంటే ఒక ఉత్సవానికి ముగింపు మాత్రమే కాదు.. కుటుంబం మొత్తం కలిసి పాల్గొనే ఆధ్యాత్మిక కార్యక్రమం. అందులో పిల్లలు, మహిళలు, వృద్ధులు, యువత.. అన్ని వర్గాలవారు ఉంటారు. అందుకే నిర్వాహకులు శబ్ద తీవ్రత, డ్యాన్స్ చేస్తున్న వారి ఆరోగ్య పరిస్థితి, గుంపుల నియంత్రణ, అత్యవసర వైద్య సదుపాయాలు వంటి అంశాలపై ముందుగానే దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. భక్తి పేరుతో మోత పెంచడం కంటే.. భక్తితోనే గణపతిని సాగనంపడం ముఖ్యమని.. ఒక పాట ఆపితే వేడుక ఆగదని.. డీజే సౌండ్ తగ్గిస్తే ఉత్సాహం తగ్గాల్సిన అవసరం లేదని.. కానీ ఒక కుటుంబంలో ప్రాణం ఆగిపోతే మాత్రం ఆ ఇంటి ఆనందం శాశ్వతంగా ఆగిపోతుంది.

# ఐఐటీ బాంబేలో విద్యార్థి ఆత్మహత్య

## కులవివక్షే కారణం.. యువకుడి తండ్రి ఆరోపణ

**అమరావతి, సెప్టెంబర్ 20, అనంతజనశక్తి న్యూస్**

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బాంబే లో బీటెక్ విద్యార్థి సాహిల్ వాకోడే (22) ఆత్మహత్య ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ కేసులో తాజాగా మరో కోణం వెలుగుచూసింది. కులవివక్ష కారణంగానే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని సాహిల్ తండ్రి ఆరోపిస్తున్నారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆయన కీలక అంశాలను ప్రస్తావించారు. ప్రొఫెసర్ సూర్యనారాయణ్ దుల్లా తన కుమారుడిపై కులానికి సంబంధించిన అవమానకర వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. అతడిని తప్పుడు కేసులో ఇరికిస్తానని బెదిరించారని ఆరోపించారు. సాహిల్ తండ్రి ఫిర్యాదు మేరకు దుల్లాపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఐఐటీ బాంబేకు చెందిన మరికొందరు అధికారులపైనా ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. మరోవైపు, సాహిల్ తల్లి కూడా తన కుమారుడు వేధింపులకు గురయ్యాడని ఆరోపిస్తూ న్యాయం చేయాలని కోరారు. 'నా కుమారుడిని వేధించారు. నేను ఫిర్యాదు చేస్తాను. నా బిడ్డకు న్యాయం కావాలి' అని ఆమె పేర్కొన్నారు. కాగా, విద్యార్థి మరణానికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర దర్యాప్తు కోసం ఉన్నతాధికారులు కేసును ముంబై క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. పరీక్ష ఘటన, అనంతరం జరిగిన పరిణామాలు, విద్యార్థి కుటుంబం చేసిన ఆరోపణలు సహా అన్ని అంశాలను పరిశీలించనున్నట్లు పోలీసులు తెలిపారు.

శుక్రవారం జరిగిన పరీక్షలో ప్రశ్నపత్రాన్ని చాట్ జీపీటీలో అప్‌లోడ్ చేసి సమాధానాలు పొందేందుకు ప్రయత్నించాడని సాహిల్‌పై ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగానే ప్రొఫెసర్ అతడిని మందలించారని ఐఐటీ బాంబే తెలిపింది. అనంతరం సాహిల్ తన హాస్టల్ గదికి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపింది. మరోవైపు, సాహిల్ మృతిపై విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. క్యాంపస్‌లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై ఐఐటీ బాంబే సమాధానం చెప్పాలని ఆందోళన చేపట్టాయి.

# సూపర్ ఎల్ నినోను కలిసి ఎదుర్కొందాం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే సిద్ధం చేసిన యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం రైతులపైనే కాకుండా అన్ని వ్యవస్థలపై ఉంటుందని స్పష్టం చేశారు. విపత్తుల సమయంలో వాటి ప్రభావం ప్రజలపై పడకుండా చూడటం ప్రభుత్వాల బాధ్యత అన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు, వినియోగదారులు ఇబ్బంది పడే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. ఖరీఫ్ సాగు పరిస్థితులపై సమీక్ష సందర్భంగా రాష్ట్రంలో వర్షపాతం లోటును సీఎం ప్రస్తావించారు. రాష్ట్రవ్యాప్తంగా 50.7 శాతం లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. ప్రకాశం, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో అత్యధిక లోటు ఉందని వెల్లడించారు. ఖరీఫ్‌లో 30.84 లక్షల హెక్టార్లలో సాగు జరగాల్సి ఉండగా 79 శాతం భూముల్లోనే సాగు పనులు ప్రారంభమయ్యాయని వివరించారు. పప్పు ధాన్యాల సాగు మెరుగ్గా ఉన్నప్పటికీ నూనెగింజల సాగు తక్కువగా ఉందన్నారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో పంటలపై ఎల్‌నినో ప్రభావం




ఎక్కువగా ఉందని తెలిపారు. ఇప్పటికే సిద్ధం చేసిన కంటింజెన్సీ ప్లాన్‌ను పరిస్థితులకు అనుగుణంగా సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు.

రాష్ట్రవ్యాప్తంగా 50.7 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా ప్రకాశం, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉందని సీఎం వెల్లడించారు. ఖరీఫ్‌లో 30.84 లక్షల హెక్టార్లలో సాగు జరగాల్సి ఉండగా, ఎల్ నినో కారణంగా 79 శాతం భూముల్లోనే పనులు ప్రారంభమయ్యాయి. కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఇప్పటికే రూ. 60 కోట్లతో కంటింజెన్సీ ప్రణాళిక సిద్ధం చేశామని, 1.31 లక్షల క్వింటాళ్ల విత్తనాలను 80 శాతం సబ్సిడీతో అందించామని తెలిపారు.

వర్షాధార పంటలు, ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యతనిస్తూ డిమాండ్ ఉన్న పంటల సాగుపై రైతులను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యాన పంటలను కాపాడేందుకు రూ. 190 కోట్లు కేటాయించామని, ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా, పశువులకు నీరు, తగినంత పశుగ్రాసం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

హంద్రీనీవా ద్వారా చివరి భూములకు, తాగునీటికి ఇబ్బంది లేకుండా నీటిని అందిస్తున్నామని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. విపత్తు సమయాల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి రాకూడదని, ఎల్ నినో సవాల్‌ను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు అండగా నిలవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# ముంబైలో ఘోర ప్రమాదం
# బ్రిడ్జిపై నుంచి పడిన బీఎండబ్ల్యూ,

**ముగ్గురి మృతి.. 20 ఏళ్ల యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు**



ముంబైలోని కోస్టల్ రోడ్డుపై ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న బ్లాక్ బీఎండబ్ల్యూ కారు అదుపుతప్పి బ్రిడ్జి గోడను ఢీకొట్టి కిందపడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, మరో 20 ఏళ్ల యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని నాయర్ ఆసుపత్రిలోని ట్రామా వార్డులో చికిత్సకు తరలించారు.

పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, బీఎండబ్ల్యూ కారు మెరైన్ డ్రైవ్ నుంచి హాజీ అలీ వైపు కోస్టల్ రోడ్డుపై ప్రయాణిస్తోంది. లోటస్ జెట్టీ సమీపంలో కారు అదుపుతప్పి బ్రిడ్జి సరిహద్దు గోడను ఢీకొట్టింది. అనంతరం బ్రిడ్జిపై నుంచి కిందకు పడిపోయింది. ప్రమాదం ఆదివారం ఉదయం సుమారు 5:20 గంటలకు జరిగినట్లు కోస్టల్ రోడ్ కంట్రోల్ రూమ్ తెలిపింది. కారులో ఉన్న నలుగురినీ నాయర్ ఆసుపత్రికి తరలించారు. అయితే వారిలో ముగ్గురు ఆసుపత్రికి తీసుకువచ్చే సమయానికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు .

ప్రమాద తీవ్రతకు కారు దెబ్బతిన్న తీరు అద్దం పడుతోంది. బ్రిడ్జిపై ఉన్న సూచిక బోర్డును కారు ఢీకొట్టడంతో అది కూడా దెబ్బతింది . బీఎండబ్ల్యూ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. విండ్‌షీల్డ్ పగిలిపోయింది, పైకప్పు లోపలికి వంగిపోయింది. బంపర్ ఊడిపోవడంతో కారు అంతర్గత భాగాలు బయటకు కనిపించే స్థాయిలో వాహనం దెబ్బతింది. అతి వేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.



# మేము అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం

(మొదటి పేజీ తరువాయి)

2009లో కోస్గి ఎన్నికల ప్రచారంలో తనతో పాటు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డి కూడా పాల్గొన్నారని ఆమె గుర్తుచేశారు. వారిద్దరూ తర్వాత ముఖ్యమంత్రులు అయ్యారని కవిత చెప్పడంతో సభలో కొద్దిసేపు 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు వినిపించాయి. తాను అప్పటి ఎన్నికల ప్రచారంలో మూడో వ్యక్తినని చెబుతూ.. కోస్గి జూనియర్ కాలేజీ సెంటిమెంట్, కొడంగల్‌తో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజల ఆశీస్సులు తనపై ఉంటే.. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో తెలంగాణ రక్షణ సేన పార్టీదే అధికారమని కవిత ధీమా వ్యక్తం చేశారు.

అయితే తాను ముఖ్యమంత్రి అవుతానని ఆమె నేరుగా ప్రకటించకుండా.. చంద్రబాబు, రేవంత్ రెడ్డి పేర్లను సభలో ప్రస్తావించి.. తన రాజకీయ ప్రస్థానాన్ని ఆ సెంటిమెంట్‌తో అనుసంధానం చేశారు. తనపై వివిధ రాజకీయ పార్టీలు చేస్తున్న వ్యాఖ్యలపై కవిత ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్ నేతలు తనను కాంగ్రెస్ విడిచిన బాణంగా అభివర్ణిస్తున్నారని.. అదే సమయంలో.. సీఎం రేవంత్‌రెడ్డి తనను కేసీఆర్ వదిలిన బాణంగా చెబుతున్నారని ఆమె అన్నారు. మరి కొందరు బీజేపీ బాణమంటున్నారని పేర్కొంటూ.. తాను ఎవరి బాణాన్ని కాదని.. తెలంగాణ బహుజనుల బాణాన్ని అని ప్రకటించారు.

అధికారానికి, విద్యకు దూరంగా ఉన్న బహుజనుల



కోసం తన పోరాటం కొనసాగుతుందని కల్వకుంట్ల కవిత చెప్పారు. యువత యుద్ధ నినాదం, మహాత్మా జ్యోతిబా పూలే ఆత్మగౌరవ భావన, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సిద్ధాంతాలు, సావిత్రిబాయి పూలే ఆశయాల కోసం తాను ముందుకు సాగుతున్నానని పేర్కొన్నారు. ఒక మహిళ ఎలాంటి రాజకీయ అండ లేకుండా కూడా రాజకీయంగా నిలబడగలదని నిరూపించాలన్నదే తన లక్ష్యమని చెప్పారు.

ప్రజలు తనకు మద్దతు ఇస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో అయినా.. సీఎం రేవంత్‌రెడ్డితో అయినా.. కేసీఆర్‌తో అయినా పోరాడతానని కవిత తేల్చి చెప్పారు. తెలంగాణలో రాజకీయాలు కేవలం పరస్పరం విమర్శలు, దూషణలకే పరిమితం కావద్దని ఆమె వ్యాఖ్యానించారు. ప్రస్తుత అసెంబ్లీ రాజకీయాల తీరును ప్రస్తావిస్తూ ప్రజా గాయకుడు గద్దర్ పాటలోని పంక్తులను ఆలపించారు. 'భలే గుందిరో మన అసెంబ్లీ..' అంటూ గద్దర్ పాటను గుర్తుచేసి ప్రస్తుత రాజకీయాలపై విమర్శలు చేశారు. ఈ సందర్భంగా సభలో కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది.

తెలంగాణ రైతుల సమస్యలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కవిత ఆరోపించారు. రైతులకు నీళ్లు, యూరియా, ధాన్యం కొనుగోళ్ల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. వరి, మొక్కజొన్న రైతుల పంటలను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆమె ఆరోపించారు. పాలమూరు ప్రాంతానికి సాగునీరు అందించడంపైనా కవిత మాట్లాడారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే పాలమూరులో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని, ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు భారీగా నిధులు ఖర్చు చేస్తామని ఆమె ప్రకటించారు. దేశంలో మహిళలను మహారాణులుగా కీర్తిస్తున్నప్పటికీ.. వంటింట్లోని గిన్నెలపైనా పురుషుల పేర్లే కనిపిస్తున్నాయని కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలోని రాష్ట్రాల్లో మహిళల రాజకీయ ప్రాతినిధ్యం గురించి ప్రస్తావిస్తూ.. మహిళలు మరింతగా రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. బహుజనులు, మహిళలు, యువత రాజకీయంగా ఎదగడానికి తన పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. కోస్గి సభను తెలంగాణ రక్షణ సేన తన రాజకీయ విస్తరణలో కీలక కార్యక్రమంగా నిర్వహించింది. ఇప్పటికే నిజామాబాద్‌లో పాంచజన్య సంకల్ప సభ నిర్వహించిన ఆ పార్టీ.. తదుపరి ఇంద్రవెల్లిలో కూడా సభ నిర్వహించనున్నట్లు ప్రకటించింది.

# భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

(మొదటి పేజీ తరువాయి)

ఏసీబీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన జయలక్ష్మిని సీఐడీ సైబర్ క్రైమ్స్ ఐజీగా బదిలీ చేశారు. ఏపీఎస్పీ బెటాలియన్స్ ఐజీగా ఉన్న బి. రాజకుమారిని రైల్వే ఐజీగా బదిలీ చేయడంతో పాటు, సీఐడీ ఉమెన్ సేఫ్టీ ఐజీగా కూడా ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కాంతి రాణా టాటాకు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ సేఫ్టీ ఐజీగా పోస్టింగ్ దక్కింది.పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న మరో అధికారి విశాల్ గున్నికి ట్రైనింగ్ డీఐజీగా పోస్టింగ్ కేటాయించారు. గ్రేహౌండ్స్ డీఐజీగా సేవలందించిన బాబూజీ అట్టాడను టెక్నికల్ సర్వీసెస్ డీఐజీగా బదిలీ చేయడం జరిగింది. పోలవరం ఓఎస్డీగా పనిచేసిన పంకజ్ కుమార్ మీనాను మార్కాపురం జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. సీఎంఎస్‌జీ ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించిన జగదీశ్ అదహళ్లిని పల్నాడు జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు.



# సమంత స్థానంలో?

సినిమాల్లో కథానాయికల మార్పు సాధారణమే. అయితే ఓ అంతర్జాతీయ ప్రాజెక్ట్‌లో ఓ నాయిక స్థానాన్ని మరొకరు భర్తీ చేయడం మాత్రం చాలా అరుదు. ఇప్పుడు అలాంటి మార్పే 'చెన్నై స్టోరీ' విషయంలో జరిగినట్లు తెలుస్తున్నది. ఈ ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్‌లో తొలుత సమంతను కథానాయికగా ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆమె ప్రెగ్నెన్సీ కారణంగా సినిమాలకు విరామం తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సమంత స్థానంలో శృతిహాసన్‌ను కథానాయికగా ఎంపిక చేశారని వార్తలు వినిపిస్తున్నాయి. బాఫ్టా అవార్డు విజేత, డౌన్‌టౌన్ అబ్బే వంటి సినిమాలతో అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకున్న ఫిలిప్‌జాన్ దర్శకత్వంలో 'చెన్నై స్టోరీ' తెరకెక్కుతున్నది. టిమెరి ఎన్ మురారి రచించిన 'ది అరెంజ్‌మెంట్స్ ఆఫ్ లవ్' నవల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. చెన్నై, ఇంగ్లాడ్‌లోని వేల్స్ నేపథ్యంలో సాగే ఈ కథలో కథానాయిక ప్రైవేట్ డిటెక్టివ్ పాత్రలో కనిపించనుంది. అయితే ఈ సినిమా నుంచి సమంత తప్పుకున్న విషయాన్ని అధికారికంగా ధృవీకరించలేదు. అంతర్జాతీయ నటీనటులతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు.



# 'టైగర్ 3' దర్శకుడితో సారా?

బాలనటిగా కెరీర్ ఆరంభించి.. ప్రస్తుతం అగ్రతారల అవకాశాల్ని అందుకుంటూ కెరీర్‌లో మంచి జోష్ మీదుంది బాలీవుడ్ యువకథానాయిక సారా అర్జున్. ఈ మధ్యే 'ధురంధర్' చిత్రాల్లో తనదైన నటనతో ఆకట్టుకొని బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ తార.. ఇప్పుడు మరో కొత్త ప్రాజెక్ట్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. 'టైగర్ 3' ఫేమ్ మనీశ్ శర్మతో ఓ చిత్రం కోసం సారా చేతులు కలిపినట్లు సమాచారం. "పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా దీన్ని తీర్చిదిద్దాలనుకుంటున్నారు దర్శకుడు. ఇందులో సారా సరసన 'సప్నే వర్సెస్ ఎవ్రీవన్' చిత్రంతో మంచి క్రేజ్ తెచ్చుకున్న అంబ్రీశ్ వర్మ కనిపించనున్నారు. ప్రస్తుతం చిత్రబృందం నాయికతో చర్చలు చేస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి" అని బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.



# మా టీమ్ వాళ్లే వద్దన్నారు!

"దసరా' నాకు చాలా ఇష్టమైన సినిమా. దాని విషయంలో నాకెలాంటి అసంతృప్తి లేదు. కాకపోతే ఈ మధ్య దీని గురించి నాని అన్న చెప్పిన మాట.. జనాల్లోకి వేరేలా వెళ్లింది. నిజానికి ఆ సినిమా క్లాస్ టచ్‌తో ఉంటుందని నాకు ముందు నుంచీ అవగాహన ఉంది. ద్వితీయార్ధమంతా వెన్నెల చుట్టూ తిరిగే ప్రేమకథే. కానీ, ఆ చిత్ర పోస్టర్లు, ప్రచార చిత్రాలు చూసి ప్రేక్షకులు ఇదేదో 'కేజీఎఫ్' లాంటి మాస్, కమర్షియల్ యాక్షన్ చిత్రమనుకుని థియేటర్లకు వచ్చారు. తీరా తెరపై చూస్తే ఎమోషనల్ డ్రామా కనిపించేసరికి తొలి రెండు రోజులు ప్రేక్షకులు కాస్త నిరుత్సాహపడ్డారు. 'హీరో ఏదో నరికేస్తాడనుకుంటే.. వెన్నెల వెనుక తిరుగుతున్నాడేంటి?' అని ఫీలయ్యారు. అయితే ఆ తర్వాత కథలోని ఎమోషన్‌కి అందరూ బాగా కనెక్ట్ అయి ఆ చిత్రాన్ని పెద్ద హిట్ చేశారు. కానీ, ఓ దర్శకుడిగా నాలో ఓ చిన్న అసంతృప్తి మిగిలిపోయింది. 'ప్రేక్షకులు ఏదో ఊహించుకుని వస్తే.. మనం వేరేది ఇచ్చాం.. అదే వారు ఆశించిన మాస్ కమర్షియల్ కంటెంట్‌నే నా శైలిలో ఇస్తే ఎలా ఉంటుంది?' అనిపించింది. అదే విషయాన్ని నాని అన్నతో చెప్పా. 'దసరా'తో బ్లాక్‌బస్టర్ కొట్టాం. మంచి వసూళ్లు వచ్చాయి. కానీ, ఈసారి ప్రేక్షకులు కోరుకున్నట్లు మంచి మాస్ ఎక్స్‌పీరియన్స్‌తో పూర్తిస్థాయి సంతృప్తిని అందివ్వాలనే ఉద్దేశంతో 'ది ప్యారడైజ్'కి శ్రీకారం చుట్టాం".




# రెండు భాగాలూ... ఏకకాలంలో!

కొనసాగింపు చిత్రాలు, యూనివర్స్ సినిమాలు, ఫ్రాంచైజీలు... ఇలా కొత్త కొత్త పేర్లతో ఈ మధ్య సినిమాలు సందడి చేస్తున్నాయి. అగ్ర కథానాయకుల చిత్రాలనగానే ఈ పేర్లు కచ్చితంగా ప్రచారంలోకి వస్తుంటాయి. పెద్ద కథలు, భారీ హంగుల కారణంగా ఆయా కథల్ని, కథా ప్రపంచాల్ని ఒక భాగంతో సరిపెట్టకుండా... తదుపరి కూడా కొనసాగించేందుకు ప్రయత్నిస్తుంటారు దర్శకనిర్మాతలు. అది మార్కెట్ వ్యూహంలో ఓ భాగం కూడా! ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డ్రాగన్' కథ కూడా పలు భాగాలుగా కొనసాగనుందని సమాచారం. చాలావరకు సినిమాలు ఒక భాగం ప్రేక్షకుల ముందుకొచ్చాకే, మరో భాగం పనులు మొదలవుతుంటాయి. అయితే 'డ్రాగన్' మాత్రం ఏకకాలంలోనే రెండు భాగాల చిత్రీకరణని పూర్తి చేసుకొంటోందని సమాచారం.

తొలి భాగం విడుదలైన కొన్ని రోజుల్లోపే, మరో భాగాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే వ్యూహంతో చిత్రబృందం పనిచేస్తున్నట్టు సమాచారం. అందుకే కథానాయకుడు ఎన్టీఆర్ గాయం కారణంగా కొన్ని రోజులుగా సెట్‌కి దూరంగా ఉంటున్నప్పటికీ, 'డ్రాగన్' చిత్రీకరణ మాత్రం కొనసాగుతోంది. ఎన్టీఆర్ లేని సన్నివేశాల్ని ఇతర తారాగణంపై తెరకెక్కిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రంలో ఎన్టీఆర్ లూగర్ పాత్రలో సందడి చేయనున్న విషయం తెలిసిందే. రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తున్నారు. అనిల్ కపూర్ ముఖ్యభూమిక పోషిస్తున్నారు.



# స్పృహ తప్పి పడిపోయిన భారత అథ్లెట్



జపాన్‌లో ఆసియా క్రీడలు ఘనంగా జరుగుతున్నాయి. భారత్‌కు చెందిన మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ఫైటర్ వరుణ్ సన్యాల్ అస్వస్థతకు గురయ్యాడు. ఆదివారం క్రీడల్లో పాల్గొనడానికి సిద్ధమవుతుండగా.. అతడు క్రూయిజ్ షిప్‌లో స్పృహ తప్పి పడిపోయినట్లు ఎంఎంఏ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు నిఖిల్ కుందేరా వెల్లడించారు. నేపాల్‌కు చెందిన అథ్లెట్ వరుణ్ సన్యాల్‌ను గమనించి.. సమాచారం ఇవ్వడంతో ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉంది. అనారోగ్యం కారణంగా అతడు క్వార్టర్ ఫైనల్ నుంచి డిస్‌క్వాలిఫై అయినట్లు సమచారం. ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థిక సలహా మండలి సభ్యుడు సంజీవ్ సన్యాల్ కుమారుడే వరుణ్ సన్యాల్.

# ఆసియా అదిరేలా..

నగోయా: ఆసియా క్రీడాకారుల ప్రతిభను ప్రపంచానికి చాటే ఆటల పండుగ మొదలైంది. నిర్వహణ లోపాలు, ఇరుకైన వసతుల వివాదాలను పక్కనబెడుతూ 20వ ఎడిషన్ ఆసియా గేమ్స్ అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఐచి-నగోయా వేదికగా హార్మోనిక్ హార్ట్‌బీట్ (హృదయాల స్పందన) అనే ప్రధాన ఇతివృత్తంతో సాగిన ప్రారంభోత్సవంలో ఆతిథ్య జపాన్ తన హైటెక్ పారిశ్రామిక శక్తిని, ప్రాంచీన సాంస్కృతిక మూలాలను ప్రపంచానికి చాటిచెప్పింది. మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో జరిగిన వేడుకల్లో అంతర్జాతీయ ఒలింపిక్ సమాఖ్య అధిపతి కోవెర్ట్రీ, ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ అధ్యక్షుడు అల్ థానీ సమక్షంలో జపాన్ చక్రవర్తి నరుహిటో క్రీడలను అధికారికంగా ప్రారంభించారు. అక్టోబర్ 4 వరకు జరిగే మెగా ఈవెంట్‌లో 45 దేశాల నుంచి దాదాపు 11 వేల మంది అథ్లెట్లు 43 క్రీడల్లో పోటీపడనున్నారు.





# వలవరిన్ అద్భుతం.. సింగిల్స్‌లోనూ సిల్వర్ మెడల్

ఆసియా క్రీడల్లో భారత యువ షూటర్ ఎలావెనిల్ వలవరిన్ అద్భుతం చేసింది. ఇప్పటికే టీమ్ విభాగంలో రజతం సాధించిన ఆమె.. వ్యక్తిగత విభాగంలోనూ పతకం సొంతం చేసుకుంది. 10 మీటర్ల రైఫిల్ విభాగంలో రెండో ప్లేస్ సాధించింది. జపాన్‌కు చెందిన హినట టైచి 253 పాయింట్లు సాధించి స్వర్ణం కైవసం చేసుకుంది. వలవరిన్ 252.4 పాయింట్లతో సిల్వర్ మెడల్‌ను దక్కించుకుంది. సౌత్ కొరియా షూటర్ బాన్ హ్యోజిన్ (230.4) మూడో ప్లేస్‌లో నిలిచి కాంస్యం అందుకొంది.

**టీమ్ ఈవెంట్‌లోనూ..**

అంతకుముందు ఆసియా క్రీడల్లో (2026) భారత్‌కు తొలి పతకం షూటింగ్ విభాగంలో వరించింది. మహిళల 10మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో రజత పతకాన్ని సాధించింది. ఎలావెనిల్ వలరివన్, సోనం, విదర్శ వినోద్‌ల త్రయం అద్భుత ప్రదర్శనతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఈ విభాగంలో చైనా స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది.



# 8 గోల్స్‌తో అదరగొట్టిన దీపిక

ఏషియన్ గేమ్స్ 2026లో భారత మహిళల హాకీ జట్టు అదరగొట్టింది. ఉజ్బెకిస్థాన్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 19-0తో ఘన విజయం సాధించింది. గిఫు ప్రిఫెక్చురల్ గ్రీన్ స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించింది. మ్యాచ్ ఆరో నిమిషంలో లాల్‌రెమ్‌సియామి గోల్‌తో భారత్ ఖాతా తెరిచింది. నవనీత్ కౌర్ కొట్టిన షాట్‌ను ఉజ్బెకిస్థాన్ గోల్‌కీపర్ రుషానా చోరీయేవా అడ్డుకోగా.. రీబౌండ్‌ను లాల్‌రెమ్‌సియామి గోల్‌గా మలిచింది. ఆ తర్వాత భారత ఆటగాళ్లు వరుస దాడులతో ఉజ్బెకిస్థాన్ రక్షణను ఒత్తిడిలోకి నెట్టారు. తొలి రెండు క్వార్టర్లు ముగిసే సమయానికి భారత్ 5-0 ఆధిక్యంలో నిలిచింది. ఈ దశలో పలువురు భారత ఆటగాళ్లు గోల్స్ సాధించారు. మూడో క్వార్టర్‌లో దీపిక తన డ్రాగ్‌ఫ్లిక్ నైపుణ్యంతో ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై విరుచుకుపడింది. పెనాల్టీ కార్నర్లను సద్వినియోగం చేసుకున్న ఆమె ఏకంగా 8 గోల్స్ చేసింది. ఇందులో నాలుగు గోల్స్ మూడో క్వార్టర్‌లోనే రావడం విశేషం. భారత్ తరపున దీపిక 8 గోల్స్‌తో మెరిసింది. ఇషిక 3, నవనీత్ కౌర్ 2, లాల్‌థంత్లువాంగి 2, లాల్‌రెమ్‌సియామి, బాల్జీత్ కౌర్, నేహా, సాక్షి రాణా ఒక్కో గోల్ చేశారు.

# సెమీస్‌లో బంగ్లా చిత్తు.. ఫైనల్‌లో భారత అమ్మాయిలు

ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో పతకం ఖాయమైంది. క్రికెట్‌లో భారత మహిళా జట్టు ఫైనల్‌కు చేరుకుంది. సెమీస్‌లో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. దీంతో శ్రీలంకతో తుది పోరులో తలపడనుంది. మంగళవారం ఫైనల్ జరగనుంది. ఇక కాంస్య పతకం కోసం పాకిస్థాన్ - బంగ్లాదేశ్ తలపడతాయి.

టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ (100*: 49 బంతుల్లో 3 ఫోర్లు, 9 సిక్స్‌లు) శతకం బాదేసింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ (40), స్మృతి మంధాన (37) రాణించారు. అనంతరం లక్ష్య ఛేదనలో బంగ్లాదేశ్ 15.4 ఓవర్లలో 81 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ దిలారా అక్తెర్ (27) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3, నందని శర్మ 3, శ్రీ చరణి 2.. క్రాంతి గౌడ్, శ్రేయాంక పాటిల్ తలో వికెట్ తీశారు.

**షఫాలీ ధనాధన్..**

ఆసియా కప్ నుంచి మంచి ఫామ్‌లో ఉన్న షఫాలీ వర్మ.. ఇప్పుడు ఆసియా గేమ్స్‌లోనూ అదే జోష్ కొనసాగిస్తోంది. ఇక సెమీస్‌లో బంగ్లా బౌలింగ్‌ను ఊచకోత కోసింది. చివరి ఓవర్ వరకూ క్రీజ్‌లో ఉండిపోయిన ఆమె.. సిక్సర్ల వర్షం కురిపించింది. స్మృతి మంధానతో కలిసి తొలి వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం నిర్మించింది. గుణాలన్ కమలిని (3) విఫలమైనా.. హర్మన్‌తో కలిసి షఫాలీ మరింత దూకుడుగా ఆడింది. 94 పరుగులు జోడించింది. ఆఖర్లో రిచా ఘోష్ (9*) సిక్స్ కొట్టడంతో భారత్ స్కోరు 190+ దాటేసింది. బంగ్లా బౌలర్లలో మరుఫా, షాన్‌జిదా, రెబయా, నహిదా తలో వికెట్ తీశారు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314